ప్రతిపక్షం

www.prathipaksham.in

గురువారం 13.11.2025 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 233 పేజీలు:12 వెల రూ. 5/-

@prathipaksham | prathipaksham tv telugu



మీరిద్దరూ దేశవాళీ పోటీలు ఆడాల్సిందే 12



రాష్ట్రంలో ఏసీబీ జెట్ స్పీడ్

ఇప్పటి దాకా 203 కేసులు నమోదు

190 మంది లంచగొండులు అరెస్ట్

ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాలలో లంచాలు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన అనేక కేసులతో పాటు, అక్రమాస్తుల కేసులు కూడా భారీగానే నమోదు అయ్యాయి. మొత్తం నమోదు చేసిన కేసులు 203 వరకు ఉండగా 190 మందికి పైగా అవినీతి ఉద్యోగులను ఏసీబీ అధికారులుఅరెస్టు చేశారు. వారి నుండి పట్టుబడిన నగదు (ట్రాప్ కేసులలో) సుమారు రూ. 42 లక్షలు లాగేశారు. ఇప్పటి వరకుగుర్తించిన అక్రమాస్తుల విలువ (డాక్యుమెంట్ల ప్రకారం): రూ. 58 కోట్ల కంటే ఎక్కువ (మార్కెట్ విలువ రూ. 500 కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేశారు. అవినీతిలో రెవెన్యూ శాఖ, పోలీసు శాఖ, మున్సిపల్ శాఖ ముందంజలో ఉన్నఉన్నట్లు తెలుస్తోంది.

- 58 కోట్ల విలువైన డాక్యుమెంట్లు స్వాధీనం
- రూ.42 లక్షలకు పైగా నగదు పట్టివేత
- రూ.500 కోట్ల మేరకు అక్రమాస్తులు గుర్తింపు
- కరీంనగర్ లోనే 22 కేసులు: 35 మంది అరెస్టు
- అవినీతిలో టాప్ త్రీ రెవెన్యూ,పోలీసు,మున్సిపల్
- ఇన్ని దాడులు జరుగుతున్నా ఆగని అక్రమార్కులు
- అవినీతికి దూరంగా ఉండలేక పోతున్న ఉద్యోగులు
- నిర్భయంగా టోల్-ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయండి
- ప్రజలకు ఏసీబీ అధికారుల సూచన

వడ్లకొండ సదానందం

ప్రతిపక్షం బ్యూరో, ఉమ్మడి కరీంనగర్, నవంబర్ 12: లంచగొండి ప్రభుత్వ అధికారులకు ఏసీబీ హెచ్చరికలు తగు జారీ చేసింది. అవినీతిని అరికట్టే శక్తి ప్రజల చేతులలోనే ఉంది.లంచం అడగడం,తీసుకోవడం, ఇవ్వడం కూడా నేరమే. ఏదైనా ప్రభుత్వ అధికారి లంచం అడిగితే భయపడకుండా వెంటనే ఫిర్యాదు చేయాలి. ఫిర్యాదు చేయడానికి టోల్‌ఫ్రీ నంబర్ 1064. ఫిర్యాదు చేసిన వారి పేరు, వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి. ఒక కాల్ చేసినా కూడా తక్షణమే చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ప్రతి ఒక్కరూ కలిసి పనిచేస్తేనే అవినీతి రహిత తెలంగాణ సాధ్యమవుతుంది. రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) తన కార్యకలాపాలను ఇటీవల దూకుడుగా కొనసాగిస్తోంది. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాలలో లంచాలు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన అనేక కేసులతో పాటు, అక్రమాస్తుల

..:: మిగతా 2లో

'జూబ్లీ' ఉప ఎన్నికలో సీఎం వ్యూహం

అభ్యర్థి ఎంపిక నుంచి ప్రచారం వరకు

అన్నీ తానై వ్యవహరించిన రేవంత్ రెడ్డి

- డివిజన్ వారీగా మంత్రులకు బాధ్యతలు
- కీలక నేతలకు అదనపు పనులు కేటాయింపు
- వ్యూహ రచన అమలు చేసేలా సూచనలు
- మొదటి సారి చక్కగా పోల్‌మేనేజ్ మెంట్
- చంద్రబాబు 'నంద్యాల' వ్యూహం ఇక్కడ అమలు
- పక్కా లెక్కలతో ఎక్కడా రాజీ పడకుండా ముందుకు
- అందుకే కాంగ్రెస్ గెలుపును సూచించిన 'ఎగ్జిట్' పోల్స్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 12: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలో వ్యూహాత్మకంగా ముందుకు సాగారు. అంతా తానై గెలుపే లక్ష్యంగా ప్రణాళికతో ఎన్నికల ప్రక్రియను సాగించారు. దీంతో ఎగ్జిట్ పోల్స్ అన్నీ కాంగ్రెస్ గెలుపని తేల్చేశాయి. గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ముఖ్యమంత్రి అభ్యర్థి ఖరారుతో పాటు అటు ఎంఐఎం సహకారం, విపక్షాలు, కమ్యూనిస్టుల మద్దతు కూడట్టడంలో చతురతను ప్రదర్శించారు. ప్రచార వ్యూహాన్ని సైతం పదును పెట్టి విపక్ష పార్టీలను బెంబేలెత్తించారు. బీఆర్ఎస్ బలాలు, బలహీన తలను తనకు అనుకూలంగా మలుచుకుని ముందుకు సాగారు. గతంలో టీడీపీ అధినేత చంద్రబాబు నంద్యాల ఉప ఎన్నికలో అమలు

..:: మిగతా 2లో

'సివిల్స్' విజేతలకు సీఎం అభినందనలు

ఇంటర్వ్యూ కోసం మరో రూ. లక్ష సాయం

..:: 2లో





బాబీ డియోల్ ఇంటిలో ధర్మేంద్రకు చికిత్స

వెటరన్ హీరో ధర్మేంద్రకు చికిత్స కొనసాగుతోంది. కొంత కాలంగా ఆయన ఆరోగ్యంపై ఆందోళన నెలకొన్న సంగతి తెలిసిందే. ఆయన ఆరోగ్యం క్షీణించడంతో మరణించారని వదంతులు సైతం వ్యాపించాయి. అయితే, ఆయన నెమ్మదిగా కోలుకుంటున్నారు.

11



బిహార్‌లో కాంగ్రెస్ నేత రాజీనామా

బిహార్‌లో ఓటింగ్ ముగియగానే ఆ రాష్ట్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత షకీల్ అహ్మద్ రాజీనామా చేశారు. షకీల్ అహ్మద్ యూపీఏ ప్రభుత్వంలో హోమ్ శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు.

11



రిపబ్లిక్ డే రోజున దాడులకు ప్రణాళిక

గణతంత్ర దినోత్సవం, దీపావళి వంటి జాతీయ కార్యక్రమాల సమయంలో ఉగ్రదాడులు చేయడానికి ప్లాన్ చేసినట్లు డాక్టర్ ముజమ్మిల్ షకీల్ పోలీసుల విచారణలో అంగీకరించాడని తెలుస్తోంది.

11



డిజిటల్ అరెస్టు పేరుతో 99 లక్షలు స్వాహా

పుణేకు చెందిన ఓ వృద్ధురాలిని డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరించి రూ.99 లక్షలు కాజేశారు. ఇందుకోసం కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఓ అరెస్ట్ వారెంట్ సృష్టించారు.

11

రవాణా శాఖలో నిఘా కఠినతరం

- నిరంతరం ఎన్ ఫోర్స్ మెంట్ ఉండేలా ప్లాన్
- ఇందుకోసం జిల్లా స్థాయిలో 33 బృందాలు
- రాష్ట్ర స్థాయిలో 3 ఫ్లైయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు
- రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు నిర్ణయం
- నిబంధనలు ఉల్లంఘిస్తున్నవారిపై కఠినచర్యలు
- సమీక్ష సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 12: రోడ్డు ప్రమాదాలు తగ్గించేలా, రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలపై కఠినచర్యలు తీసుకొనేలా రవాణా శాఖలో నిరంతరం ఎన్ ఫోర్స్ మెంట్ ఉండేలా ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ఈ మేరకు సచివాలయంలో బుధవారం రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. ఎన్ ఫోర్స్ మెంట్ కోసం రాష్ట్రవ్యాప్తంగా జిల్లా స్థాయిలో 33 బృందాలు , రాష్ట్ర స్థాయిలో మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ప్రతి రోజు విధిగా ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా ఓవర్ లోడింగ్ లారీలు , బస్సులు, మినరల్ రవాణా, ఇసుక, బూడిద, స్టోన్, బిల్డింగ్ మెటీరియల్స్ ,వాహనాల ఫిట్నెస్ , పొల్యూషన్ , చలానాలపై ఈ బృందాలు తనిఖీలు చేయనున్నాయి. ఒక్కో బృందంలో డీటీసీ,ఎంవీఐ , ఏఎంవీఐ ఇతర సిబ్బంది ఉండనున్నారు. గత నెలలో రద్దు చెక్ పోస్ట్ లో పని చేసిన సిబ్బందిని కూడా ఇందులోకి మార్చేలా ఆదేశాలు జారీ చేశారు. ఎన్ ఫోర్స్ మెంట్ బృందాలు ప్రయాణికులతో వెళ్తున్న

..:: మిగతా 2లో



ఢిల్లీ పేలుడు దారుణం

భాధ్యులు ఎవరైనా సరే వదలబోం

- వారిని పట్టుకుని చట్టపరంగా శిక్షిస్తాం
- ఉన్నతస్థాయి బృందంతో సమగ్ర విచారణ
- కేంద్రం పర్యవేక్షణలోనే దర్యాప్తు సాగుతుంది
- కేంద్ర కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, నవంబర్ 12 : ఢిల్లీ పేలుడు ఘటనను బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ భేటీ తీవ్రంగా ఖండించింది. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపింది. దీనిని కిరాతక ఉగ్ర ఘాతుకంగా మండిపడింది. మృతుల ఆత్మశాంతి కోసం రెండు నిమిషాల మౌనం పాటించింది. ఈ దారుణ ఘటన మీద విచారణను వేగవంతం చేయాలని నిఘా సంస్థలను ఆదేశించింది. ఉగ్రవాదంపై తమ పోరు కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఈ ఘటనకు ఎవరు బాధ్యులు అయినా వారిని చట్టం ముందు నిలబెడతామని స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించిన ఓ తీర్మానాన్ని కేంద్ర కేబినెట్ ఆమోదించిందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. పేలుడు ఘటన మీద కేంద్రం ఉన్నతస్థాయిలో పర్యవేక్షిస్తోందని చెప్పారు. సోమవారం సాయంత్రం ఎర్రకోట సమీపంలో ఈ బాంబు పేలుడు జరిగింది. 12 మంది మరణించగా, అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. కేబినెట్ భేటీ తరువాత కేంద్ర మంత్రి మాట్లాడుతూ తాము ఉగ్రవాదం పట్ల జీరో టాలరెన్స్ విధానంతో ఉన్నామని

..:: మిగతా 2లో

అమెరికా సుంకాలు తగ్గే అవకాశం



ఇండియాతో వాణిజ్య ఒప్పందం త్వరలో కుదురుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. భారత వస్తువులపై టారిఫ్‌లు తగ్గిస్తామన్నారు. డొనాల్డ్ ట్రంప్ అమెరికాలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. భారతదేశంతో వాణిజ్య ఒప్పందం త్వరలో ఉంటుందని ప్రకటించారు.

..:: 11లో

యుద్ధప్రాతిపదికన 'మేడారం' పనులు

- డిసెంబర్ 20 లోగా పూర్తి చేయాలి
- ఎక్కడా నాణ్యతతో రాజీ పడేదే లేదు
- జాతరకు ఎలాంటి ఆటంకం ఉండకూడదు
- మీడియాతోమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 12 : మేడారం అభివృద్ధి పనులను డిసెంబర్ 20లోగా పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కొండా సురేఖ, ఎంపీ పోరిక బలరాం నాయక్, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కేఎస్ శ్రీనివాసరాజుతోకలిసి మేడారంలో పర్యటించారు. అభివృద్ధి పనులను

..:: మిగతా 2లో



రాష్ట్రీయం

'సివిల్స్' విజేతలకు సీఎం అభినందనలు


- ఇంటర్వ్యూ కోసం మరో రూ. లక్ష సాయం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 12 : రాష్ట్రం నుంచి సివిల్స్ మెయిన్స్ ఫలితాలలో విజయం సాధించిన అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. యూపీఎస్సీ మెయిన్స్ 2025 ఫలితాలలో తెలంగాణ అభ్యర్థులు సత్తా చాటారు. రాష్ట్రం నుంచి మెయిన్స్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులకు ప్రభుత్వం రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించింది. సివిల్స్ సాధించే లక్ష్యంతో ప్రిపేరయ్యే పేద కుటుంబీకులకు అండగా నిలిచేందుకు నిరుడు రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పథకాన్ని ప్రారంభించింది. ఈ యేడాది కూడా ఈ పథకం కింద సింగరేణి సంస్థ అధ్వర్యంలో 202 మందికి రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించింది. సాయం అందుకున్న అభ్యర్థులలో 43 మంది తాజాగా యూపీఎస్సీ మెయిన్స్ ఫలితాలలోనూ విజేతలుగా నిలిచారు. విజయం సాధించిన అభ్యర్థులందరికీ ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. వీరందరికీ నిరుటి మాదిరిగా ఈసారి కూడా ఇంటర్వ్యూలకు సన్నద్ధం అయ్యేందుకు మరో లక్ష రూపాయల ప్రోత్సాహకం అందించనున్నారు.

నగరానికి రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి


- ఏర్పాట్లపై ఉన్నత స్థాయి సమీక్ష



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 12 : ఉప రాష్ట్రపతి ఈ నెల 16 న, రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము 21న హైదరాబాద్ పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు చేయాలని సీఎస్ కె. రామకృష్ణారావు ఆదేశించారు. బుధవారం ఆయన సచివాలయంలో ఉన్నతాధికారులతో ఏర్పాట్లను సమీక్షించారు. ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఈ నెల 16వ తేదీన సగలు బేగంపేట ఎయిర్ పోర్టు కు చేరుకుంటారు. రాజ్ భవన్ లో స్వల్ప విశ్రాంతి, గవర్నర్ ఇచ్చే తేనేటీ విందులో పాల్గొని, అనంతరం రామోజీ ఫిల్మ్ సిటీ లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రి ఎనిమిది గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుండి న్యూఢిల్లీకి బయలుదేరుతారు. రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఈ నెల 21న మధ్యాహ్నం బేగంపేట్ ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. రాజ్ భవన్ లో కొద్దిసేపు బస చేసి, అనంతరం రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేసిన భారతీయ కళా మహోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. రాత్రి రాజ్ భవన్ లో బస చేసి 22వ తేదీ ఉదయం పుట్టపర్తి పర్యటనకు బయలుదేరుతారు. సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి, రామోజీ ఫిల్మ్ సిటీ ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్‌తో పెన్షనర్లకు మేలు

- 'మీసేవ'లో మరో ముందడుగన్న మంత్రి శ్రీధర్‌బాబు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 12 : పెన్షనర్లకు సౌకర్యం కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు వేసింది. బ్యాంకులు, ట్రెజరీ కార్యాలయాలకు వెళ్లకుండానే ఇంటి నుంచే మీసేవ ద్వారా లైఫ్ సర్టిఫికేట్ సమర్పించుకోవచ్చని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మీసేవ డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ సేవ పారదర్శకతతో పాటు గౌరవాన్ని కలిగించే టెక్నాలజీ ఆధారిత పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈఎస్డీ విభాగం ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ఈ సేవకు మంచి స్పందన లభిస్తోంది. వినియోగదారుల సంఖ్య సంవత్సరం వారీగా పెరుగుతోంది. 2022-23లో 143, 2023-24లో 31,295, 2024-25లో 64,612, ఈ ఆర్థిక సంవత్సరం నవంబర్ 11 వరకు 13,214 మంది పెన్షనర్లు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించారు. మొత్తం ఇప్పటి వరకు 1.09 లక్షలకుపైగా సర్టిఫికెట్లు జారీ అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 2.7 లక్షలకుపైగా పెన్షనర్లు ఈ సదుపాయంతో లాభపడుతున్నారు. మీసేవా యాప్‌లో ఆధార్ ఆధారిత ముఖ ధృవీకరణ వ్యవస్థతో గుర్తింపు పూర్తయిన వెంటనే లైఫ్ సర్టిఫికేట్ ఆటోమేటిక్‌గా ప్రభుత్వ రికార్డుల్లో అప్‌డేట్ అవుతుంది.ఇదిలా ఉండగా, అధికారులు ఈ సేవను నిరంతరం అందుబాటులో ఉంచి, పెన్షన్ చెల్లింపులు అంతరాయం లేకుండా జరుగుతున్నాయని వెల్లడించారు.

ఢిల్లీ పేలుడు దారుణం

మొదటి పేజీ తరువాయి

అన్నారు.

ఎగుమతుల ఎకో సిస్టమ్ బలోపేతానికి

కాగా, ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆరేండ్లపాటు రూ. 25,060 కోట్లతో ఎక్స్‌పోర్టు ప్రమోషన్ మిషన్‌కు ఆమోదం తెలిపారు. ఎగుమతుల ఎకో సిస్టమ్ బలోపేతానికే ఈ మిషన్‌ను తీసుకొచ్చినట్లు వివరించారు. ఎగుమతిదారుల కోసం రూ. 20 వేల కోట్ల రూపాయలతో క్రెడిట్ గ్యారంటీ పథకం విస్తరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది. గ్రాఫైట్ , రబీడియం, జిర్కోనియం లాంటి క్రిటికల్ మినరల్స్‌పై రాయల్టీ రేటు సవరించింది. ఈ నిర్ణయం దిగుమతులను తగ్గించి, స్వదేశంలోనే హైటెక్ మినరల్ ఉత్పత్తికి బాటలు వేయనుంది. దీంతో పాటు కొత్త పెట్టుబడి రంగాన్ని ప్రోత్సహించనున్నట్లు పేర్కొంది.

అత్యున్నత స్థాయి సమావేశం

అంతకుముందు ప్రధాని బాంబు పేలుడు ఘటనపై తన నివాసంలో అత్యున్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ సహా పలువురు కేంద్రమంత్రులు పాల్గొన్నారు. ఎర్రకోట బాంబు పేలుడు ఘటనకు సంబంధించిన కీలక విషయాలను చర్చించారు. దర్యాప్తు కొనసాగుతున్న తీరు, భద్రతా చర్యలు, ఆయా సంస్థల మధ్య సమన్వయంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.



బాలుడిపై వీధి కుక్కల దాడి

- ఎడమ కన్ను కోల్పోయిన బాలుడు
- నాగులపల్లి గ్రామంలో దారుణం
- కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు

ప్రతిపక్షం, షాద్ నగర్, నవంబర్12 : వీధి కుక్కలు గ్రామాలలో వీరంగం సృష్టిస్తున్నాయి. 'కుక్కల బెడద నుండి కాపాడండి మహాప్రభూ' అంటూ అధికారులను కోరినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని జనం వాపోతున్నారు. ఫరూఖ్ నగర్ మండల పరిధిలో నాగులపల్లి గ్రామంలో జనార్దన్ జ్యోతి దంపతుల కుమారుడు రిత్విక్ (3) ఇంటిలో ఆడుకుంటూ బయటకు రావడంతో ఒక్కసారిగా కుక్కలు దాడి చేశాయి. బాలుడు కేకలు వేయడంతో స్థానికులు కుక్కలను తరిమికొట్టారు. ఈ దాడిలో బాలుడి ఎడమ కంటికి తీవ్ర గాయమైంది. హుటాహుటిన షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి తీవ్రంగా ఉండడంతో హైదరాబాద్ సరోజినీ కంటి ఆసుపత్రికి తరలించారు. అక్కడ బాలుడి కన్నుకు ఆపరేషన్ చేశారు. బాలుడు ఎడమ కన్ను పూర్తిగా కోల్పోయాడని తెలియడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. వేరేక చోటు నుండి కుక్కలను పట్టుకొచ్చి తమ గ్రామంలో వదిలిపెట్టారని, అవి చిన్నారులు ఒంటరిగా ఉంటే దాడి చేసి గాయపరుస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి కుక్కలని పట్టుకోవాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.



ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడమే తమ లక్ష్యం. గత 16 నెలల్లో 120 బిలియన్‌డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. 5 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చాం. పెట్టుబడిదారులు ఏపీని ఎందుకు ఎంచుకోవాలో మూడు కారణాలు చెబుతాను. ఒకటి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. రెండోది సమర్థవంతమైన నాయకత్వం. మూడోది డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్.

- సీఐఐ సమ్మిట్ ప్రెస్‌మీట్ ఏపీ మంత్రి లోకేశ్

రాష్ట్రంలో ఏసీబీ జెట్ స్పీడ్

మొదటిపేజీ తరువాయి

కేసులు కూడా భారీగానే నమోదు అయ్యాయి. మొత్తం నమోదు చేసిన కేసులు 203 వరకు ఉండగా 190 మందికి పైగా అవినీతి ఉద్యోగులను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. వారి నుండి పట్టుబడిన నగదు (ట్రాప్ కేసులలో) సుమారు రూ. 42 లక్షలు లాగేశారు. ఇప్పటి వరకు గుర్తించిన అక్రమాస్తుల విలువ (డాక్యుమెంట్ల ప్రకారం): రూ. 58 కోట్ల కంటే ఎక్కువ (మార్కెట్ విలువ రూ. 500 కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేశారు. అవినీతిలో రెవెన్యూ శాఖ, పోలీసు శాఖ, మున్సిపల్ శాఖ ముందంజలో ఉన్న ఉన్నట్లు తెలుస్తోంది.

ఉమ్మడి కరీంనగర్ లో లంచగొండులు

ఈ 2025 సంవత్సరంలో ఇప్పటివరకు నమోదైన 22 కేసులలో 35 మందిని అరెస్టు చేశారు. రెవెన్యూలో ఎనిమిది మంది. పంచాయతీరాజ్ లో ఆరుగురు, రిజిస్ట్రేషన్ లో ముగ్గురు, ఖజానాలో ముగ్గురు, మున్సిపల్, అగ్రికల్చర్, ఔషధ విభాగం, ఆర్టీఏలో ముగ్గురేసి, పోలీసులలో ఒకరిని అరెస్టు చేశారు.

అవినీతి మరకలు ఇదిగో

హైదరాబాద్‌లో విద్యుత్ శాఖకు చెందిన అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ అంబేద్కర్ ఇళ్లపై ఏసీబీ దాడులు నిర్వహించి, ఆయన బంధువు ఇంటిలో రూ. రెండు కోట్లకు పైగా నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్న కేసులో ఆయనను అరెస్టు చేశారు. నల్గొండ జిల్లా మత్స్యశాఖ అధికారి ఎం. చరిత రెడ్డి సొసైటీలో కొత్త సభ్యులను ఆమోదించడానికి రూ. 20 వేలు లంచం తీసుకుంటూ చిక్కారు. దీపావళి సందర్భంగా క్రాకర్స్ షాపుల అనుమతి కోసం రూ. ఎనిమిది వేలు లంచం తీసుకుంటూ నల్గొండ జిల్లాకు చెందిన ఫైర్ ఆఫీసర్ ఏసీబీకి పట్టుబడ్డారు. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా, యల్లంపేట్ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ చింతల రాధా కృష్ణ రెడ్డి కాంపౌండ్ వాల్ కూల్చకుండా ఉండటానికి రూ. 3.5 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ వలకు చిక్కారు.ఒక డబుల్ బెడ్ రూమ్ ఇంటి కేసుకు సంబంధించి రూ. 50 వేలు లంచం తీసుకుంటూ మునుగోడు పోలీస్ స్టేషన్ ఎస్సై, కానిస్టేబుల్ పట్టుబడ్డారు. సిద్దిపేట జిల్లా ములుగు పోలీస్ స్టేషన్‌లో ఎస్సై విజయ్ కుమార్, కానిస్టేబుల్ రాజు డబుల్ బెడ్ రూమ్ ఇంటి కేసుకు సంబంధించి బాధితురాలి నుంచి రూ. 50 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.ఆస్తి తగాదాలలో సహాయం చేయడానికి లంచం డిమాండ్ చేశారు.మహబూబాబాద్ జిల్లా, మరిపెడ మండలంలోని అనేపురం క్లస్టర్‌కు చెందిన ఏఈఓ సందీప్ రైతుబీమా డబ్బుల మంజూరుకు రూ. 10 వేలు లంచం తీసుకుంటుండగా వరంగల్ ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నల్గొండ జిల్లా చిట్యాల తహసీల్దార్ గుగులోతు కృష్ణ భూమి మ్యుటేషన్ కోసం రూ. రెండు లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీకి చిక్కారు. రాజన్న సిరిసిల్ల తహసీల్దార్ కార్యాలయంలో ఇద్దరు సర్వేయర్లు భూమి సర్వే కోసం రూ. 20 వేలు లంచం తీసుకుంటూ కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్‌కు పట్టుబడ్డారు. కరీంనగర్ డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ మర్యాల శ్రీనివాస్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్తీక్ భరద్వాజ్ మెడికల్ షాప్ యజమాని నుంచి రూ. 20 వేలు లంచం తీసుకుంటుండగా చిక్కారు.

నకిలీ ఏసీబీ అధికారుల పట్ల అప్రమత్తత

ఏసీబీ అధికారులకు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్న మోసగాళ్ల పట్ల ప్రభుత్వ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏసీబీ అధికారులు హెచ్చరిక జారీ చేశారు. ఏసీబీ అధికారులు ఎవరూ డబ్బులు అడగరని, ఇలాంటి కాల్స్ వస్తే వెంటనే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. లంచం అడిగితే ఫిర్యాదు చేయడానికి 1064 టోల్‌ఫ్రీ నంబర్‌ను ఉపయోగించండి.

'జూబ్లీ' ఉప ఎన్నికలో సీఎం వ్యూహం

మొదటిపేజీ తరువాయి

చేసిన ఫార్ములానే ఇప్పుడు రేవంత్ జూబ్లీహిల్స్ లోనూ అమలు చేశారని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. జూబ్లీహిల్స్ లో గెలుపు అందరి కంటే సీఎం రేవంత్ కు చాలా అవసరం. ఇక్కడ గెలిస్తే తన రెండేండ్ల పాలనకు వచ్చిన తీర్పుగా చెప్పుకోవచ్చు. తేడా వస్తే పార్టీతో పాటుగా ప్రభుత్వంలోనూ విమర్శలు ఎదుర్కోవాల్సిందే.

మూడు ప్రధాన పార్టీలకు ప్రతిష్ఠాత్మకం

బీఆర్ఎస్ ఈ ఉప ఎన్నిక లో గెలుపు కోసం అన్ని సర్వశక్తులు ఒడ్డింది. త్వరలో గ్రేటర్ ఎన్నికలు జరగనుండటం మూడు ప్రధాన పార్టీలకు ప్రతిష్ఠాత్మకం గా మారింది. సీఎం రేవంత్ అభ్యర్థి విషయంలో పక్కా లెక్కలతో ముందుకు వెళ్లారు. ఢిల్లీ నేతల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా అనుమతి తీసుకున్నారు. ముందుగానే గెలుపు వీరుల వేట సాగించారు. సర్వే సైతం నిర్వహించారు. అజారుద్దీన్ ను నిలబెడితే పక్కగా ఓడిపోతామన్న విషయం గ్రహించారు. అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇచ్చారు. అటు ఎంఐఎంతో ఒప్పందం కలిసి వచ్చింది. జూబ్లీహిల్స్ లో ఆపరేషన్ కొనసాగించారు. మంత్రులను పూర్తిగా రంగంలోకి దించారు. ప్రతీ వార్డుకు బాధ్యులను నియమించారు. సామాజిక వర్గాలవారీగా నేతలను మోహరించారు. తానే ప్రచారంలోకి దిగారు. ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. మంత్రులకు వ్యూహ రచన అమలు బాధ్యతలను అప్పగించారు. బీఆర్ఎస్ కు మద్దతుగా నిలిచే ఓటర్లను తమ వైపు తిప్పుకోవటానికి కొత్త హామీలు గుప్పించారు. చివరి రెండు రోజులలో వ్యూహాత్మకం గా వ్యవహరించారు. దీంతో పోలింగ్ సరళి, ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్ కు అనుకూలంగా ఉన్నాయి. తుది ఫలితం కాంగ్రెస్ కే అనుకూలంగా ఉండే అవకాశం కనిపిస్తోంది. దీని ద్వారా రేవంత్ త్వరలో స్థానిక సంస్థలు... ఆ తరువాత గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలకు సిద్ధం కావటంతో పాటుగా పార్టీలో .. ప్రభుత్వంలో తన పట్టు పెంచుకోవటానికి ఈ ఫలితం అస్త్రంగా మారే ఛాన్స్ ఉంది. దీంతో జూబ్లీ హిల్స్ ఫలితం వేళ.. పొలిటికల్ సర్కిల్స్ నాటి నంద్యాల ఉప ఎన్నిక రాజకీయం గుర్తు చేసుకుంటున్నారు.



గురుకులాల బకాయిలు రూ.163 కోట్లు

- వెంటనే విడుదలకు డిసీఎం ఆదేశం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 12 : ఎస్సీ, మైనారిటీ గురుకులాల డైట్, అద్దె, మధ్యాహ్నం భోజనానికి సంబంధించిన బకాయిలు సుమారు 163 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఆయన ప్రజా భవన్ లో, ఆర్థిక శాఖ అధికారులు, గురుకులాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషక విలువలతో , వైవిధ్యంతో కూడిన ఆహారాన్ని అందించాలన్న సదుద్దేశంతో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే గురుకులాలు, వసతి గృహ విద్యార్థుల డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్ ర్జీలు 200 పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. నిర్వాహకులు నాణ్యతలో ఎక్కడ రాజీ పడవద్దని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ పూర్తిస్థాయిలో పాటించాలని ఆదేశించారు. విద్యార్థులకు అందుతున్న వసతులను సమీక్షించేందుకు అధికారులు నిర్దేశిత క్యాలెండర్ ప్రకారం సందర్శించాలని సూచించారు. నివేదికలను ఎప్పటికప్పుడు అందించాలన్నారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

రవాణా శాఖలో నిఘా కఠినతరం

మొదటిపేజీ తరువాయి

ఆటోలు , వ్యవసాయ సంబంధిత ట్రాక్టర్ లను వేధింపులకు గురి చేయరాదని సూచించారు.

మార్గదర్శకాలలో ప్రధానంగా

జేటీసీ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేయడానికి జిల్లాల నుండి ఎంవీఐ, ఏఎంవీఐలను నెలవారీ రొటేషన్ పద్ధతిలో రాష్ట్రవ్యాప్తంగా ఆకస్మిక తనిఖీ చేయడానికి ఈ స్క్వాడ్‌ను ఉపయోగిస్తారు. జటీసీ హైదరాబాద్, డీటీసీలు ప్రభుత్వ సెలవు దినాలు సహా అన్ని సమయాలలో కనీసం ఒక బృందం రోడ్డుపై ఉండే విధంగా చూసుకోవాలి. హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ , సంగారెడ్డి డీటీసీలు ప్రతి వారం కనీసం రెండుసార్లు అంతర్‌రాష్ట్ర కాంట్రాక్ట్ క్యారేజ్ (సీసీ) బస్సులపై తనిఖీలు నిర్వహించాలి. ఫిట్‌నెస్ గడువు ముగిసిన వాహనాలు, భారీ వస్తువుల వాహనాలు, బస్సులను సీజ్ చేయాలి. ఓవర్ స్పీడ్ వాహనాలను గుర్తించి చర్యలు తీసుకోవాలి. ఓవర్‌లోడ్ గూడ్స్ వాహనాలను సీజ్ చేయాలి. ముఖ్యంగా సీసీ బస్సులు, బహుళ ఈ చలాన్లు/ వీసీఆర్‌లు ఉన్న భారీ వస్తువుల వాహనాలను స్వాధీనం చేసుకుంటారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా తిరిగే వాహనాలు, ముఖ్యంగా భారీ, మధ్యతరహా వస్తువుల వాహనాలు ప్రయాణీకుల వాహనాలు మరియు విద్యాసంస్థ బస్సులు సీజ్ చేయబడతాయి. వస్తువుల వాహనాలలో ఓవర్‌లోడింగ్ వాహనాలను స్వాధీనం చేసుకోవాలి .అదనపు లోడ్ ఆఫ్ లోడ్ చేయకుండా అనుమతించకూడదు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి , జెటిసి లు రమేష్ , చంద్రశేఖర్ , శివలింగయ్య పాల్గొన్నారు

యుద్ధప్రాతిపదికన 'మేడారం' పనులు

మొదటిపేజీ తరువాయి



క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. హరిత కాకతీయ హోటల్ లో అధికారులు, గుత్తేదారులతో పనుల గురించి చర్చించారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ మేడారం లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. గ్రీనరీ, ప్లాంటేషన్ చేయాలన్నారు. మాస్టర్ ప్లాన్ లో భాగంగా మొదటి విడతలో క్యూ లైన్ షెడ్స్, నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ, టెంపుల్ అభివృద్ధి మీద సమీక్షించారు. గద్దెల వద్ద భక్తుల కెపాసిటీ మూడు వేల నుండి పది వేలకు పెంచనున్నట్లు తెలిపారు. 19 ఎకరాలు భూసేకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్. హరీశ్, కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్పీ శబరిష్, డీఎఫ్ఓ రాహూల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా మేడారంలో జరుగుతున్న అభివృద్ధి పనులను జాతరకు పక్షం రోజుల ముందుగానే అన్ని పనులను పూర్తి చేస్తామని చెప్పారు. గిరిజన పూజారుల సూచన మేరకే పునరుద్ధరణ పనులు చేపడుతున్నామని అన్నారు. ఎంత డబ్బు ఖర్చు అయినా అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

'జెవెల్స్ ఆఫ్ అసాఫ్ జాయిస్ ద గ్లోరీ ఆఫ్ వరంగల్'

- కాఫీ టేబుల్ బుక్ ను ఆవిష్కరించిన సీఎస్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 12 : సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ కన్నెకంటి వెంకటరమణ రచించిన 'జెవెల్స్ ఆఫ్ అసాఫ్ జాయిస్ ద గ్లోరీ ఆఫ్ వరంగల్' అనే కాఫీ టేబుల్ బుక్ ను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు బుధవారం నాడు ఆవిష్కరించారు. సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక హాజరయ్యారు. వరంగల్ నగరంలో అసఫ్ జాహీల హయాంలో నిర్మితమైన అద్భుతమైన కట్టడాలు, వరంగల్ కేంద్రంగా పాలనను చేసిన సుబేదారుల వివరాలు, చరిత్రతో కూడిన ఈ కాఫీ టేబుల్ బుక్ చరిత్ర పరిశోధకులకు, పోటీ పరీక్షలకు హాజరయ్యేవారికి ఉపయోగపడుతుందని సీఎస్ అన్నారు. వరంగల్ అంటే, కాకతీయుల పాలన, వేయిస్తంభాల ఆలయం, ఖిలా వరంగల్, భద్రకాళి ఆలయం వెంటనే మదికి వస్తాయి. కాజీపేట నుండి మామునూర్ వరకు నిజాం నవాబులు నిర్మించిన అద్భుతమైన భవనాలు, కాజీపేట రైల్వే స్టేషన్, ప్రస్తుత మిషన్ భగీరథ పథకమైన ఇంటింటికి తాగునీరందించే ధర్మసాగర్ ఫిల్టర్ బెడ్ ఎన్నో ఉన్నాయి. వీటితోపాటు వరంగల్ కేంద్రంగా వరంగల్ సుబాహ్ గా ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం లోని కొన్నిప్రాంతాలు ఉండేవి.



కాంగ్రెస్ ప్రభుత్వంపై కవిత ఆగ్రహం

- కృష్ణా నీటి ప్రాజెక్టుల పూర్తి పై ప్రశ్నల వర్షం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నల్గొండ, నవంబర్ 12: 'సామాజిక తెలంగాణ' కోసం పోరాటం కొనసాగుతుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. జనం బాట కార్యక్రమంలో భాగంగా నల్గొండ జిల్లాలో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ను తిట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమవుతోందని దుయ్యబట్టారు. 'ఎస్ఎల్బీసీ, నక్కలగండి, డిండి ప్రాజెక్టులు ఎప్పుడు పూర్తి చేస్తారు? సుంకిశాల ప్రమాదం పై కాంట్రాక్టర్ పై ఎందుకు చర్యలు తీసుకోలేదు?' అని ప్రశ్నల వర్షం కురిపించారు. మెఘా సంస్థతో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల బంధం ఫెవికాల్ లాంటిదని విమర్శించారు. కృష్ణా నది నీళ్లు తెచ్చే విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే సీఎం ఇంటి ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో 13.44 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా ఉందని, కానీ ప్రభుత్వం ఇప్పటి వరకు 375 కొనుగోలు కేంద్రాలు మాత్రమే తెరిచిందని అన్నారు. వెంటనే వెయ్యి కేంద్రాలు తెరవాలన్నారు. బోనస్ తప్పించుకునేందుకే కొనుగోలు ఆలస్యం చేస్తున్నారన్నారు.



నల్గొండలో చాయ్ చేసిన కవిత

- ప్రజలతో మమేకమవుతూ మాటా ముచ్చట

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జరుగుతున్న జనం బాట కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బుధవారం నల్గొండ పట్టణంలోని ప్రకాశం బజార్‌లో మదీన హోటల్‌లో చాయ్ చేసారు. స్థానికులతో కలిసి చాయ్ తాగుతూ మాట్లాడిన కవిత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, చిన్న వ్యాపారులు, ఆటో డ్రైవర్లు వంటి వివిధ వర్గాల వారు తమ సమస్యలను కవిత గారితో పంచుకున్నారు. ప్రజల అభిప్రాయాలను శ్రద్ధగా విన్న కవిత వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాలను సూచిస్తామని తెలిపారు. జాగృతి జనంబాట ద్వారా ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై వారి అభిప్రాయాలు, అవసరాలను తెలుసుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని కవిత పేర్కొన్నారు.

యువత సాహసాలు చేసినప్పుడే విజయం

- ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 12 : యువత సాహసాలు చేసినప్పుడే విజయం దక్కుతుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఉన్నతస్థానానికి చేరుకోవాలనే లక్ష్యం పెట్టుకుని ఆ దిశగా కష్టపడాలని యువతకు సలహా ఇచ్చారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. యువత సరికొత్త ఆలోచనలతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వినూత్న ఆలోచనలతో ముందుకొచ్చే వారికే ఉజ్జ్వల భవిష్యతు ఉంటుందని వివరించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు కొత్త విధానం తీసుకొచ్చామని, అంకుర పరిశ్రమలు వంద కోట్ల టర్నోవర్‌కు చేరుకోవాలని, స్టార్టప్‌లకు సాయం చేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఇవాళ ప్రపంచమంతా మనవైపు చూస్తోందని, ఇతర దేశాల్లో అవకాశాల కోసం చూడవద్దని కోరారు. ఇతర దేశాలు భారత్‌పై ఆధారపడే స్థితికి మనం ఎదగాలన్నారు.

హక్కులు తేల్చాకే బుద్వేల్ భూముల వేలం

- తేల్చిచెప్పిన హైకోర్టు ధర్మాసనం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 12 : రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం బుద్వేలు గ్రామంలోని 4.19 ఎకరాల భూమి వేలానికి హైకోర్టు బ్రేక్ వేసింది. సర్వే నంబర్ 288/4 భూమిపై యాజమాన్య హక్కుల కోసం ఇద్దరు వ్యక్తులు చేసుకున్న దరఖాస్తులపై హెచ్ఎండీఏ అధికారులు తుది నిర్ణయం తీసుకునే వరకు వేలం వేయరాదని ఆదేశించింది. ఇద్దరి దరఖాస్తులపై డిసెంబర్ 12లోగా నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించింది. ఆ తర్వాతే ఆ భూమి వేలంపై తుది నిర్ణయం తీసుకోవాలని హెచ్ఎండీఏకి స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను జనవరి రెండుకు వాయిదా వేసింది.



అమెరికాలో అందెశ్రీకి ఘన నివాళి

- ఆయన రచనలు ముందు తరాలకు అందాలి
- తెలంగాణ ప్రభుత్వానికి తెలంగాణ ప్రవాసుల వినతి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 12 : ప్రజా కవి, గాయకుడు, వాగ్గేయకారుడు అందెశ్రీ అకాల మృతిపై అమెరికాలో ఘన నివాళి అర్పించారు. నార్త్ కరోలినా ఛార్లెట్ లో స్థిరపడిన తెలంగాణ ప్రవాసులు అందెశ్రీ మాట, పాటలను స్మరించుకున్నారు. తెలంగాణ భూమి పుత్రుడిగా, నిస్వార్థ స్వరాష్ట్ర సాధన స్వాప్నికుడిగా అందెశ్రీని తెలంగాణ సమాజం కలకాలం గుర్తుపెట్టుకుంటుందని అభిప్రాయపడ్డారు. ఉద్యమ సమయంలో, ఆ తర్వాత కూడా ఆయన ప్రవాసులతో ఆత్మీయ అనుబంధాన్ని కొనసాగించారని కొనియాడారు. అందెశ్రీ రచనలు, ఆయన గాత్రం చరిత్రలో నిలిచిపోయేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రానున్న తరాలకు ఆయన రచనలు పరిచయం అయ్యేలా పాఠ్య పుస్తకాలలో చేర్చటంతో పాటు, అందెశ్రీ పేరుపై రాష్ట్ర స్థాయిలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రత్యేక స్మృతివనం ఏర్పాటు చేయాలని సమావేశానికి హాజరైన టీపీసీసీఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ వై. నరేందర్ రెడ్డికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (టీటీఏ) అధ్యక్షుడు నవీన్ రెడ్డి మలిపెద్ది, కోర్ టీం సభ్యుడు, చార్లెట్ చాప్టర్ దిలీప్ రెడ్డి స్యాసని, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ నరేంద్ర దేవరపల్లి, గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ (జీటీఏ) చార్లెట్ చాప్టర్ అధ్యక్షుడు కదిరి కృష్ణ, చార్లెట్ తెలంగాణ అసోసియేషన్ (సీటీఏ) కార్యదర్శి ప్యారం పుట్టలి, తెలంగాణ ఎన్ఆర్ఐ ప్రముఖుడు పవన్ కుమార్ రెడ్డి కొండ హాజరయ్యారు.



తెలంగాణ కేబినెట్ భేటీ 15కు వాయిదా

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో , హైదరాబాద్, నవంబర్ 12 : తెలంగాణ కేబినెట్ సమావేశం మళ్లీ వాయిదా పడింది. బుధవారం జరగాల్సిన భేటీని ఈ నెల శనివారానికి వాయిదా వేశారు. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే కేబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. మంత్రివర్గ సమావేశానికి మంత్రులు, ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. వాస్తవానికి తెలంగాణ కేబినెట్ సమావేశం ఈ నెల ఏడున జరగాల్సింది. కానీ,12వ తేదీకి వాయిదా వేశారు. ఇపుడు కూడా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. జూబ్లీహిల్స్ ఫలితం తేలిన మరుసటి రోజున కేబినెట్ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.



గాంధీ భారీ విగ్రహం ఏర్పాటుకు సంఘీభావం

- రాష్ట్ర వ్యాప్తంగా అడుగు గాంధీ విగ్రహాల సేకరణ
- ప్రచార రథాన్ని ప్రారంభించిన పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 12 : గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ స్వర్ణోత్సవాల సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రపంచంలోనే గాంధీజీ ఎత్తయిన విగ్రహం ఏర్పాటు చేస్తున్నది. దీనికి సంఘీభావంగా ఒక అడుగు గాంధీజీ విగ్రహాలను రాష్ట్రమంతటా సేకరించి హైదరాబాద్ మహా నగరంలో ప్రదర్శించనున్నారు. ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, విద్యా సంస్థలకు, లైబ్రరీలకు, ఠాణాలలో టేబుల్ పై పెట్టుకునేందుకు అందించనున్నారు. ఈ క్రమంలో గాంధీభవన్ లో 'బాపు బాట' ప్రచార రథాన్ని పీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ ప్రచార రథం 33 జిల్లాలలో తిరుగుతూ గాంధీ విగ్రహాల సేకరణ, గాంధీజీ సిద్ధాంతాలను విస్తృత ప్రచారం చేస్తుంది. గాంధీ సుస్థిర విజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో అందరికీ తెలియడం కోసం ఈ చైతన్య రథం ఉపయోగపడుతుందని సంస్థ చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్ రెడ్డి, గాంధీ విజ్ఞాన కేంద్రాల కమిటీ కన్వీనర్ గాంధారి ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వర్ణోత్సవాల కమిటీ వైస్ చైర్మన్ కొత్త పెల్లి శ్రీనివాస్ రెడ్డి ఆర్గనైజర్ కె నాగేశ్వర రావు వైస్ ప్రెసిడెంట్ నీరుడు దయాకర్ రెడ్డి ప్రచార కార్యదర్శి కే సుభాష్ చంద్ర వైస్ ప్రెసిడెంట్ యానాల ప్రభాకర్ రెడ్డి సెక్రటరీ వేణు గోపాల్ పల్లె శ్రీనివాస్ గౌడ్ బి పవన్ , పి.సాయి ఎన్ సాయి, శిరీష శ్రీ వాణి తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఐపీఎస్ అధికారుల సంఘం వార్నింగ్

- చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 12 : మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘం వార్నింగ్ ఇచ్చింది. డీజీపీకి పూర్తి మద్దతు ప్రకటిస్తూ, అవసరమైతే చట్టపర చర్యలు తీసుకునే హక్కు తమకు ఉందని హెచ్చరించింది. ఒక మీడియా ఛానల్ ఇంటర్వ్యూలో కేటీఆర్ చేసిన అవమానకరమైన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొంది. డీజీపీ శివధర్ రెడ్డి, పోలీసు వ్యవస్థను లక్ష్యంగా చేసుకొని కేటీఆర్ వ్యాఖ్యలు చేశారని ఆరోపించింది. పోలీస్ వ్యవస్థ మీద అభ్యంతరాలు ఉంటే, వాటిని బహిరంగంగా దూషించడం కాకుండా, చట్టబద్ధంగా లేవనెత్తాలని పేర్కొంది. ఇలాంటి వ్యాఖ్యలు ప్రజలను తప్పుదారి పట్టించి, పోలీసుల నిష్పాక్షికత, వృత్తి గౌరవాన్ని దెబ్బతీస్తాయని హెచ్చరించింది.
వ్యక్తిగత లేదా పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు సరైనవి కావని తెలిపింది. రాజకీయ ప్రయోజనాల కోసం అధికారులపై నిరాధార ఆరోపణలు చేయడం సరైంది కాదని, తెలంగాణ పోలీసులు ఎల్లప్పుడూ చట్టబద్ధంగా పనిచేస్తున్నారని సంఘం తన ప్రకటనలో వెల్లడించింది.





త్వరలో అమరజ్యోతి కేంద్రం ప్రారంభం

- సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేస్తా
- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జి చిన్నారెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 12 : ట్యాంక్ బండ్ రోడ్డు, సచివాలయం ఎదురుగా నిర్మించిన అమరవీరుల స్మారక అమర జ్యోతి కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాల్సిన ఆవశ్యకత ఉందని, అందు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేస్తానని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జి చిన్నారెడ్డి అన్నారు. బుధవారం నాడు ఆయన అమర వీరుల స్మారక అమర జ్యోతి కేంద్రాన్ని సందర్శించారు. స్వరాష్ట్ర సాధన కోసం అమరులైన ఉద్యమకారుల స్మారకం కోసం నిర్మించిన అమర జ్యోతి కేంద్రం ప్రారంభానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ ప్రాంగణంలో భారీ సమావేశ మందిరం, క్యాంటీన్, విశాల ప్రదేశం, ఎస్కలేటర్స్ ఉండటాన్ని చిన్నారెడ్డి గమనించారు. అమర వీరుల స్మారక కేంద్రం నిర్మాణానికి ప్రణాళిక రూపొందించిన ప్రముఖ శిల్పి ఎం వీ రమణా రెడ్డి అమర జ్యోతి ప్రాంగణాన్ని దగ్గర ఉండి చిన్నారెడ్డికి వివరించారు. ఆయన వెంట తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి ఫౌండర్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ గంటా జలంధర్ రెడ్డి ఉన్నారు.

ఎంత ఖర్చైనా సరే, పిల్లవాడి ప్రాణం ముఖ్యం

- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్





ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 12: మానవత్వమే అసలైన గొప్పతనం. అది చూపించారు మంత్రి అడ్లూరి లక్ష్మణ్. ఈ సంఘటన, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచింది. ఈ ఘటనతో జగిత్యాల జిల్లా ప్రజల అభిమానాన్ని ప్రేమను 'అడ్లూరి' చూరగొన్నారని జిల్లావాసులు చెబుతున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపు ఎస్సీ బాలుర వసతిగృహంపై గత సెప్టెంబర్‌లో పిడుగు పడటంతో విద్యార్థి బొల్లె హిమేశ్ చంద్ర (8వ తరగతి) తీవ్రంగా గాయపడ్డాడు. టెర్రస్‌పై ఆరేసిన దుస్తులు తేవడానికి వెళ్లిన హిమేశ్ పై ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పిడుగు పడింది. క్షణాలలోనే మంటలు వ్యాపించి, అతని చేతులు, వెన్ను తీవ్రంగా కాలిపోయాయి. వసతిగృహ సిబ్బంది వెంటనే బాలుడిని జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స అనంతరం కరీంనగర్ ఆసుపత్రికి, పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. పిడుగు ప్రభావంతో భవనం పైకప్పు, గోడలు పగిలిపోయాయి. స్లాబ్ పెచ్చు లూడి మంచాలపై పడగా, ఆ సమయంలో విద్యార్థులు బయట ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పింది. మొదట ట్రాన్స్‌ఫార్మర్ పేలిందని భావించిన అధికారులు, విద్యుత్ శాఖ ఏఈడీ జవహర్‌లాల్ నాయక్ పరిశీలనలో భవనంపై నేరుగా పిడుగు పడినట్లు తేలింది.

చలించిన మంత్రి అడ్లూరి

ఈ ఘటన విషయం తెలిసిన వెంటనే ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పందించారు. ఇప్పటివరకు దాదాపు ఐదు సార్లు స్వయంగా తన సిబ్బందిని వెంటబెట్టుకొని ఆస్పత్రిలో బాలుడిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించేలా ఎప్పటికప్పుడు వైద్యులకు ఆదేశాలు జారీ చేశారు. 'విద్యార్థికి అత్యుత్తమ వైద్యం అందించండి. ఎంత ఖర్చైనా సరే, పిల్లవాడి ప్రాణం ముఖ్యం' అని స్పష్టంగా చెప్పారు. దీంతో అధికారులు వెంటనే చర్యలు తీసుకొని, హిమేశ్‌కు ప్రత్యేక వైద్యం అందేలా యశోద ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు నెలరోజులపాటు చికిత్స అందించి, ప్లాస్టిక్ సర్జరీ చేశారు. చికిత్స ఖర్చు దాదాపు 18 లక్షలు కావడంతో, సాధారణ కుటుంబం భరించలేని స్థితి ఏర్పడింది. విషయం తెలిసిన మంత్రి అడ్లూరి మానవత్‌తో నిర్ణయం తీసుకున్నారు. మొత్తం వైద్య ఖర్చును సంక్షేమ శాఖ నిధుల నుండి చెల్లించాలంటూ ఆదేశాలు జారీ చేశారు.



ఢిల్లీ పేలుడు మృతులకు కేంద్ర కేబినెట్ సంతాపం తెలిపింది. ఇది ఉగ్రవాద చర్య అని అధికారికంగా ప్రకటించింది. ఉగ్రవాదులను చట్టం ముందు నిలబెడతాం. దర్యాప్తును అత్యవసరంగా నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఉగ్రవాదులు, వారి స్పాన్సర్లను గుర్తించి, బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించింది. పరిస్థితిని అత్యున్నత స్థాయిలో పర్యవేక్షిస్తున్నాం.
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

ఓపెన్ వాయిస్

భారత్ 'ఆపరేషన్ సిందూర్–2'కు రెడీ

ఢిల్లీ ఎర్రకోట సమీపంలో పేలిన బాంబు మనదేశంలో ఉన్న ఉగ్రవాదులను పట్టిస్తోంది. ఇప్పటికే ఈ సంఘటనలో ముగ్గురు డాక్టర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తాజాగా మరో ముగ్గురిని కూడా అరెస్టు చేశారు. ఈ ముగ్గురు డాక్టర్లు హర్యానాలోని ఫరీదాబాద్ ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. ఆల్ ఫలాహ్ విశ్వవిద్యాలయంతో సంబంధాలు కలిగి ఉన్నారు. పోలీసులు అరెస్ట్ చేసిన వైద్యులలో డాక్టర్ ముజామిల్ షకీల్, డాక్టర్ షాహిన్ షాహిద్, డాక్టర్ ఉమర్ మహమ్మద్ ఉన్నారు. ఇందులో ఉమర్, ముజామిల్ కాశ్మీర్ రాష్ట్రానికి చెందిన వారు. షహీన్ లక్నోకు చెందినవారు. దౌజా అనే గ్రామంలో షకీల్ రెండు ఇండ్లను అద్దెకు తీసుకున్నాడు. అందులో మూడు టన్నుల పేలుడు పదార్థాలను నిల్వ చేసాడు. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. జైషే మహమ్మద్ అనే ఉగ్రవాద సంస్థ వైట్ మాడ్యూల్ లో ఉగ్రవాదులను తయారు చేస్తోంది. డాక్టర్లను, విద్యార్థులను ఉగ్రవాదులుగా మార్చుతోంది. ఈ విభాగానికి డాక్టర్ షహీన నాయకత్వం వహిస్తున్నారు. అందువల్లే ఆ యూనివర్సిటీలో పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కాలేజీలో చదువుతున్న చాలామంది వైద్య విద్యార్థులు ఉగ్రవాద సంస్థల కార్యకలాపాలకు ఆకర్షితులవుతున్నారని ఇంటెలిజెన్స్ రిపోర్టు ఇటీవల పోలీసులకు తెలిసింది. దీంతో పోలీసులు ఈ విశ్వవిద్యాలయం పై దృష్టి సారించారు. ఫలితంగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఇంటెలిజెన్స్ వర్గాలు. నిఘా వర్గాలు ఈ విశ్వవిద్యాలయం లో చదివిన పాత విద్యార్థుల వివరాలు కూడా సేకరించాయి. అందులో కేసులు ఉన్న వారి వివరాలు కూడా పరిశీలించి, వారి గురించి ఆరా తీస్తున్నాయి. ఈ విశ్వవిద్యాలయం వైద్యుల ఫ్యాక్టరీ మాదిరిగా ఉండేది. ఇక్కడ చదువుకున్న వారంతా దేశ విదేశాలలో స్థిరపడ్డారు. ఈ ప్రాంతానికి విశేష పేరు తీసుకొచ్చారు. కొంతకాలంగా ఈ విశ్వవిద్యాలయం లో పరిస్థితి దారుణంగా మారుతోంది. కొంతమంది ఇక్కడ వైద్య విద్య పేరుతో ప్రవేశం పొంది దారుణమైన కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. విద్యార్థులను ఉగ్రవాద కార్యకలాపాలు చేపట్టడానికి ఎంపిక చేసుకుంటున్నారు. వారి ద్వారా దారుణమైన పనులు చేయిస్తున్నారు. చివరికి వారి ప్రాణాలను గాలిలో కలిసేలా చేస్తున్నారు. ఆత్మహుతి దళాలుగా కూడా పనిచేసేలా శిక్షణ ఇస్తున్నారు. చివరికి వారి కుటుంబాలను కూడా అన్యాయం చేస్తున్నారు. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ పాకిస్తాన్ మీద విరుచుకుపడింది. ముఖ్యంగా పాకిస్తాన్ దేశంలో ఉన్న ఉగ్రస్తావరాలపై విస్తృతంగా దాడి చేసింది. చూస్తుండగానే ఉగ్రస్తావరాలను నేలమట్టం చేసింది. రెండో కంటికి తెలియకుండా ఉగ్రవాద నివాసాలను కూడా కాలగర్భంలో కలిపేసింది. భారత్ చేసిన దాడులకు సహజంగానే పాకిస్తాన్ స్పందించింది. ఎందుకంటే పాకిస్తాన్ కు, ఉగ్రవాదులతో అవినాభావ సంబంధం ఉంది. అందువల్లే ఉగ్రవాదుల స్థావరాలు నేలమట్టమైతే పాకిస్తాన్ స్పందించింది. ఒకరకంగా శోకాలు పెట్టింది. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత భారత్ పాకిస్తాన్ దేశాన్ని మరింత ఇబ్బందికి గురిచేసే ప్రయత్నం మొదలు పెట్టింది. ఈ క్రమంలో సింధూ నది మీద ఒక బృహత్తర హైడల్ ప్రాజెక్ట్ నిర్మించాలని భావించింది. అంతేకాదు, పాకిస్తాన్ దేశానికి సింధూ నది ప్రవాహాన్ని నిలిపివేసే ప్రణాళిక కూడా విజయవంతంగా అమలు చేస్తోంది. దీంతో పాకిస్తాన్ దేశంలో హాహా కారాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు అక్కడి వ్యవసాయం కూడా తీవ్రంగా ప్రభావితమవుతోంది. చివరికి క్రికెట్ విషయంలో కూడా పాకిస్తాన్ దేశంతో ఆడేందుకు భారత్ ఒప్పుకోవడం లేదు. ద్వైపాక్షిక సిరీస్ లకు టీ మీడియా ఎప్పుడో దూరమైంది. ఐసీసీ నిర్వహించే మెగా టోర్నీలో మాత్రమే టీమిండియా పాక్ జట్టుతో తలపడుతోంది. అది కూడా తటస్థ వేదికలలో మాత్రమే ఆడుతోంది. ఢిల్లీ ఎర్రకోట సమీపంలోని మెట్రో స్టేషన్ వద్ద కారు పేలుడుకు పాల్పడింది పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులని భారత ఇంటెలిజెన్స్ వర్గాలు అనుమానిస్తున్నాయి. ఇదే క్రమంలో జాతీయ మీడియాలో కూడా కథనాలు వస్తున్నాయి. ఢిల్లీ కారు పేలుడుకు కారణమైన పాకిస్తాన్ ఉగ్రవాదులకు గట్టి బుద్ధి చెప్పాలని భారత్ భావిస్తోంది. ఈ క్రమంలో ఆపరేషన్ సిందూర్ 2.0 చేపట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. భూటాన్ వేదికగా జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కీలకమైన వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదులకు గట్టి సమాధానం చెబుతామని, అటువంటివారిని ఎట్టి పరిస్థితులలో తాము ఉపేక్షించబోమని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ కు ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇంగ్లిష్ లో మాట్లాడారు. ఇప్పుడు కూడా ఆయన ఇంగ్లిషులోనే మాట్లాడారు.

ప్రతిపక్షం
హైదరాబాద్
గురువారం
13.11.2025

ధిక్కార స్వరం కాళోజీ నారాయణ రావు

కాళోజీ సత్యాగ్రహోద్యమంలో పాల్గొని 25 సంవత్సరాల వయసులో జైలుశిక్ష అనుభవించాడు. నిజామాంధ్ర మహాసభ, హైదరాబాదు స్టేట్ కాంగ్రెసుతో కాళోజీకి ఉన్న అనుబంధం విడదీయరానిది. 1940 లో రుక్మిణీబాయితో వివాహం జరిగింది. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, జమలాపురం కేశవరావు, బూర్గుల రామకృష్ణారావు, పి.వి.నరసింహారావు వంటి వారితో కలిసి కాళోజీ అనేక ఉద్యమాలలో పాల్గొన్నాడు. విద్యార్థి దశలోనే నిజాం నిషేధాజ్ఞలను ఉల్లంఘించి వరంగల్లులో గణపతి ఉత్సవాలు నిర్వహించాడు. తెలంగాణలో అక్షరజ్యోతిని వ్యాపింపజేయాలన్న తపనతో ఆంధ్ర సారస్వత పరిషత్తును స్థాపించిన ప్రముఖులలో కాళోజీ ఒకడు.




కామిడి సతీశ్ రెడ్డి
9848445134

'తెలుగు బిడ్డవురోరి తెలుగు మాట్లాడుటకు సంకోచ పడియెదవు సంగతేమిటిరా? అన్య భాష లు నేర్చి ఆంధ్రంబు రాదంచు సకిలించు ఆంధ్రుడా! చావవేటికిరా' ఈ మాటలు అన్నది ఎవరో కాదు. ప్రముఖ కవి, రచయిత మాటల మాంత్రికుడు ధిక్కార స్వరాన్ని వినిపించి, అందరి గొడవ ను తన గొడవ గా భావించిన అక్షర యోధుడు మన కాళోజీ నారాయణ రావు. రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరాం రాజా కాళోజీ 9 సెప్టెంబరు 1914 న జన్మించారు. కాళోజీ నారాయణరావు లేదా కాళోజీ లేదా కాళన్నగా సుపరిచితులు. ఆయన తెలంగాణ ప్రజల ప్రతీ ఉద్యమంక్క ప్రతిధ్వనిగా కొనియాడబడతాడు. ఆయన రాజకీయ సాంఘిక చైతన్యాల సమాహారం. కవిత్వం రాసిన ప్రజాకవి. హక్కులడిగిన ప్రజల మనిషి. ఉద్యమం నడిపిన ప్రజావాది. మొత్తంగా తెలంగాణ జీవిత చలనశీలి, గొంతుక కాళోజీ. పుట్టుక, చావు కాకుండా బతుకంతా తెలంగాణకిచ్చిన మహనీయుడు, వైతాళికుడు కాళోజీ. నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకి వ్యతిరేకంగా ఆయన కలం ఎత్తాడు. ఆయన స్వాతంత్ర్య సమర యోధుడు, తెలంగాణా ఉద్యమకారుడు. 1992లో భారతదేశ అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్ పొందాడు. ఆయన జన్మదినాన్ని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా చేసి గౌరవిస్తున్నది. వరంగల్ లో నెలకొన్న వైద్య విద్యాలయానికి ఆయన పేరు పెట్టబడింది. తెలంగాణ తొలిపొద్దు కాళోజీ.

-అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తి

'అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి, అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తి ప్రాప్తి. అన్యాయాన్నెదిరించిన వాడే నాకారాధ్యుడు' అని సగర్వంగా ప్రకటించి ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు. కర్ణాటక రాష్ట్రం, బీజాపూర్ జిల్లా రట్టిహళ్లి గ్రామంలో జన్మించాడు. తల్లి రమాబాయమ్మ, కన్నడిగుల ఆడపడుచు. తండ్రి కాళోజీ రంగారావు మహారాష్ట్రీయుడు. తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ, ఇంగ్లిషు భాషలలో రచయిత గా ప్రఖ్యాతిగాంచాడు. రాజకీయ వ్యంగ్య కవిత్వం రాయడంలో దిట్ట. 'నా గొడవ' పేరిట సమకాలీన సామాజిక సమస్యలపై నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా, కటువుగా స్పందించి. పాలకులపై అక్షరాయుధాలను సంధించి ప్రజాకవిగా కీర్తి గడించాడు. తెలంగాణ ప్రజల ఆర్తి, ఆవేదన, ఆగ్రహం ఆయన గేయాలలో రూపు కడతాయి. బీజాపూర్ నుంచి హన్మకొండకి తరలివచ్చిన కాళోజీ కుటుంబం మడికొండలో స్థిరపడింది. ప్రాథమిక విద్యానంతరం హైదరాబాదు పాతబస్తీ చౌమహల్లా న్యాయపాఠశాలలో కొంతకాలం చదివిన కాళోజీ, తరువాత సిటీ కాలేజీలోనూ, హన్మకొండలోని కాలేజియేట్ ఉన్నత పాఠశాలలో మెట్రిక్యులేషను పూర్తిచేశాడు. 1939 లో హైదరాబాదులో హైకోర్టుకు అనుబంధంగా ఉన్న న్యాయ కళాశాల నుంచి న్యాయశాస్త్రం లో పట్టా పొందాడు. 1930



నుంచే కాళోజీ గ్రంథాలయోద్యమం లో ఎంతో చురుగ్గా పాల్గొన్నాడు. తెలంగాణలోని ప్రతి గ్రామంలో ఒక గ్రంథాలయం ఉండాలన్నది కాళోజీ ఆకాంక్ష.

25 సంవత్సరాల వయసులో జైలుశిక్ష

సత్యాగ్రహోద్యమంలో పాల్గొని 25 సంవత్సరాల వయసులో జైలుశిక్ష అనుభవించాడు. నిజామాంధ్ర మహాసభ, హైదరాబాదు స్టేట్ కాంగ్రెసుతో కాళోజీకి ఉన్న అనుబంధం విడదీయరానిది. 1940 లో రుక్మిణీబాయితో వివాహం జరిగింది. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, జమలాపురం కేశవరావు, బూర్గుల రామకృష్ణారావు, పి.వి.నరసింహారావు వంటి వారితో కలిసి కాళోజీ అనేక ఉద్యమాలలో పాల్గొన్నాడు. విద్యార్థి దశలోనే నిజాం నిషేధాజ్ఞలను ఉల్లంఘించి వరంగల్లులో గణపతి ఉత్సవాలు నిర్వహించాడు. తెలంగాణలో అక్షర జ్యోతిని వ్యాపింపజేయాలన్న తపనతో ఆంధ్ర సారస్వత పరిషత్తును స్థాపించిన ప్రముఖులలో కాళోజీ ఒకడు. రజాకార్ల దౌర్జన్యాన్ని ప్రతిఘటిస్తూ 1945 లో పరిషత్తు ద్వితీయ మహాసభలను దిగ్విజయంగా నిర్వహించడంలో కాళోజీ ప్రదర్శించిన చొరవ, ధైర్యసాహసాలను ఆయన అభిమానులు ఇప్పటికీ గుర్తుచేసుకుంటుంటారు. వరంగల్ కోటలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడానికి ప్రయత్నించినందుకు ఆయనకు నగర బహిష్కరణశిక్ష విధించారు. స్వరాజ్య సమరంలో పాల్గొని ఉస్మానియావిశ్వవిద్యాలయవిద్యార్థులు బహిష్కరణకు గురైనప్పుడు, వారిని నాగపూర్ విశ్వవిద్యాలయంలో చేర్పించి ఆదుకోవడంలో కాళోజీ పాత్ర ఎనలేనిది.

1958 లో శాసనమండలికి

1953 లో తెలంగాణ రచయితల సంఘం ఉపాధ్యక్షుడుగా, 1958 లో ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి శాసనమండలికి ఎన్నికయ్యాడు. కాకతీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. భారత ప్రభుత్వం పద్మవిభూషణ్ అవార్డుతో సత్కరించింది. 'హింస తప్పు, రాజ్యహింస మరీ తప్పు' అంటూ 'సామాన్యుడే నా దేవుడు' అని ప్రకటించిన కాళోజీ 2002 నవంబరు 13 న తుదిశ్వాస విడిచాడు. అతని మరణానంతరం ఆయన పార్థివ శరీరాన్ని కాకతీయ మెడికల్ కళాశాలకు అందజేసారు. కాళోజీ జన్మించిన అయిదారు నెలలకే రమాబాయమ్మ చనిపోవడంతో అన్నే అమ్మగా మారి తమ్ముడు కాళోజీని పెంచి పెద్దచేశాడు. కాళోజీ రామేశ్వరరావు ఆయన అన్న, ఉర్దూ కవి. తమ్ముడి కన్నా అన్న ఆరేండ్లు పెద్ద. 'షాద్' పేరుతో ఉర్దూ కవిత్వం రాశాడు. ఇద్దరూ అన్యోన్యంగా కలిసిమెలిసి బతికారు. 1996 లో రామేశ్వరరావు చనిపోయినప్పుడు, 'నేను నా ఆరవయేట మా అన్న భుజాల మీదికెక్కినాను. ఆయన మరణించేదాకా దిగలేదు. నేను ఆయన భుజాల మీదికి ఎక్కడం గొప్ప కాదు. 70 యేండ్ల వరకూ ఆయన నన్ను దించకుండా ఉండడం గొప్ప.' అన్నాడు. కాళోజీ 13 నవంబరు 2002 న మరణించారు. వీరి జయంతిని తెలంగాణ మాండలిక భాషా దినోత్సవం గా పాటిస్తారు. వీరి జీవిత చరిత్రని ప్రతి కవి, రచయిత అధ్యయనం చేయాలి.

(నేడు కాళోజీ నారాయణ రావు వర్ధంతి)

(వ్యాస రచయిత తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, జేఎస భూపాలపల్లి)

అంచనాలకు భిన్నంగా ఫలితాలు?!

బిహార్, జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితాలు భారతీయ ప్రజాస్వామ్యానికి ఒక గుణపాఠం. కేవలం పాత పద్ధతులు లేదా సాంప్రదాయ వర్గాలు మాత్రమే గెలుపును నిర్ణయించలేవు. పనితీరు, సంక్షేమం, అభివృ, సమర్థవంతమైన పాలన వంటి అంశాలకే ప్రజలు పెద్దపీట వేస్తారని నిరూపిస్తాయి. కొత్తగా ఎన్నికైన ప్రభుత్వాలు, ప్రజలు తమ మీద ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకోవడానికి, తమ హామీలను నెరవేర్చడానికి, ప్రజల ఆకాంక్షలను చేరుకోవడానికి కట్టుబడి ఉండాలి.



ఫిరోజ్ ఖాన్
9640466464

దేశ రాజకీయాల గతిని మలుపు తిప్పగల బిహార్ ఎన్నికల ఫలితాల అంచనాలు, తెలంగాణలోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలు అంచనాలకు భిన్నంగా వెలువడి, దేశ రాజకీయాలలో ప్రకంపనలు సృష్టించాయి. ఫలితాలు కేవలం అంకెల గెలుపు మాత్రమే కాదు, కుల సమీకరణాలు, ప్రాంతీయ ఆకాంక్షలు, సంక్షేమ హామీల కలగలుపుతో కూడిన నూతన రాజకీయ సూత్రాన్ని ఆవిష్కరించాయి. అనూహ్య తీర్పు వెనుక ఉన్న సామాజిక, రాజకీయ రహస్యం ఏమిటి, విజయం రాబోయే కేంద్ర, రాష్ట్ర రాజకీయాలపై ఎలాంటి ప్రభావాన్ని చూపబోతోంది అనే అంశంపైనే ఇప్పుడు దేశం దృష్టి ఉంది. బిహార్, జూబ్లీహిల్స్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ తీవ్ర ఉత్కంఠ మధ్య ముగుస్తుంది. బిహార్ రాష్ట్ర ఎన్నికలలో ప్రధాన కూటమిలో మెజారిటీ మార్కును దాటి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు నిశ్చయాత్మక తీర్పును సాధించింది. అదే సమయంలో, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం రాష్ట్రంలో అధికారంలో ఉన్న పక్షం పని తీరుకు, ప్రతిపక్షం పట్టుకు అద్దం పట్టింది. ప్రజలు స్థిర ప్రభుత్వాన్ని, అభివృద్ధిని కోరుకుంటు కోరుకుంటున్నారనే విషయాన్ని విజయం సాధించిన పక్షం నిరూపించింది.

బిహార్‌లో 'మహాదళిత్' సంక్షేమ విజయం

బిహార్ ఎన్నికల విజయం కేవలం సంప్రదాయ కుల రాజకీయాల ఆధారంగా మాత్రమే రాలేదు. విజయం సాధించిన పక్షం, 'మహాదళిత్' అత్యంత వెనుకబడిన కులాల ఓట్లను ఏకతాటిపైకి తీసుకురావడంలో విజయం సాధించి, సంక్షేమ పథకాలు, ఉపాధి కల్పన హామీలను సమర్థవంతంగా వినియోగించుకుంది. యువత, మహిళా ఓటర్ల మొగ్గు పాత రాజకీయ ధోరణులను దాటి ఆర్థిక భద్రత వైపు మళ్లిందనేది ఫలితాల ద్వారా స్పష్టమవుతోంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితం తెలంగాణ రాజకీయాలకు ఒక కీలక సంకేతం. ఉపఎన్నిక ఫలితాలు ఎగ్జిట్ పోల్స్‌పై 'జుబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఎవరు గెలుస్తారు! పాలక పక్షం గెలుపు వారి ప్రజాకర్షక పథకాలకు అందిన మద్దతుగానే



పరిగణించబడగా, ప్రతిపక్షం పటిష్ట పోటీ ఇవ్వడం రాష్ట్ర వ్యాప్తంగా వారి పట్టు తగ్గలేదని సూచిస్తుంది. ఎన్నికలలో ఓటమి చవిచూసిన పక్షాలు, ఓటమికి గల ఆంతరంగిక, బాహ్య కారణాలపై లోతైన ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. బిహార్‌లో, ఓటమి పాలైన పక్షం మారుతున్న ప్రజాభిప్రాయాన్ని అంచనా వేయడంలో విఫలమై, బూత్ స్థాయి నిర్వహణలో బలహీనతలను ఎదుర్కొంది. జుబ్లీహిల్స్‌లో, కొన్ని వర్గాల ఓటర్లను ఆకర్షించడంలో విఫలమవడం ఓటమికి దారితీసింది. రాజకీయాల్లో అతి విశ్వాసం ఎంత ప్రమాదకరమో ఈ ఫలితాలు నిరూపించబడుతాయి.

బిహార్ ఫలితాల ప్రభావం

బిహార్ ఎన్నికల ఫలితాలు రాబోయే దేశ రాజకీయాల పై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. బిహార్‌లో విజయం సాధించిన పక్షం, దేశంలోని సారూప్య రాజకీయ ప్రాంతాలలో తమ వ్యూహాలను బలోపేతం చేసుకుంటుంది. ఇది కేంద్రంలో విపక్ష కూటముల నిర్మాణానికి, పాలక కూటమి బలాన్ని పెంచడానికి నిర్దిష్ట దిశను అందిస్తుంది, స్థానిక అంశాలతో పాటు జాతీయ విధానాలు కూడా ప్రజల తీర్పును ప్రభావితం చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. బిహార్, జూబ్లీహిల్స్ లో ఫిర్యాదులు, అభ్యంతరాలు ఉన్నప్పటికీ, ఎన్నికల సంఘం నిష్పాక్షికంగా, పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించడంలో విజయం సాధించింది. ముఖ్యంగా, కేంద్ర బలగాల మోహరింపు, వెబ్‌కాస్టింగ్ పర్యవేక్షణ ద్వారా ఈసీ పవిత్రతను కాపాడింది. ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951 కింద చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో ఈసీ చూపిన దృఢత్వం, అక్రమాలకు పాల్పడే వారికి ఒక హెచ్చరికగా నిలిచింది.

కొత్త రాజకీయ సూత్రానికి నాంది

బిహార్, జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితాలు భారతీయ ప్రజాస్వామ్యానికి ఒక గుణపాఠం. కేవలం పాత పద్ధతులు లేదా సాంప్రదాయ వర్గాలు మాత్రమే గెలుపును నిర్ణయించలేవు. పనితీరు, సంక్షేమం, అభివృ, సమర్థవంతమైన పాలన వంటి అంశాలకే ప్రజలు పెద్దపీట వేస్తారని నిరూపిస్తాయి. కొత్తగా ఎన్నికైన ప్రభుత్వాలు, ప్రజలు తమ మీద ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకోవడానికి, తమ హామీలను నెరవేర్చడానికి, ప్రజల ఆకాంక్షలను చేరుకోవడానికి కట్టుబడి ఉండాలి.

(వ్యాస రచయిత సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)

మానవత్వ దీపానికి చమురు దయాగుణమే



డా. బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

మానవీయ గుణాలలో దయ, కరుణ, క్షమాగుణం లాంటివి అతి ప్రధానమైనవి. దయ చూపడం ఓ సుగుణం అని అర్థం చేసుకోవాలి. దయను పంచడం ఓ అలవాటు కాలాలి. దయకలిగిన వారిలో దైవత్వం ఉట్టిపడుతుంది. దయాగుణం కలిగిన మానవ సమాజం ప్రశాంత వాతావరణంలో సుఖశాంతులతో వర్ధిల్లుతుంది. అటు దయ పంచనివారు కఠినాత్ములుగా పరిగణించబడతారు. ఇలాంటి అతి ముఖ్యమైన మానవీయ దయాగుణం ప్రాధాన్యాన్ని ప్రపంచ మానవాళికి గుర్తు చేయడానికి, దాని శక్తిని అవగాహన పర్చడానికి 1998 నుంచి యేటా 13 నవంబర్ రోజున ప్రపంచవ్యాప్తంగా 'ప్రపంచ దయా దినోత్సవం' నిర్వహించడం ఆనవాయితీగా మారింది. మన దైనందిన జీవితాలలో దయాగుణానికి పెద్ద పీట వేయబడింది. సున్నిత మనస్కులలో దయాగుణం ఒక శాశ్వత సుందర ఆభరణంగా నిలుస్తుందని ప్రజలకు తెలియపర్చడం, సానుభూతి అలవాటు చేసుకోవడం, అర్థవంతంగా జీవితాన్ని గడపడం, సమన్వయ భావనతో ఇరుగుపొరుగుకు చేయూతనివ్వడం లాంటివి దయామయులకు మాత్రమే సాధ్యమవుతాయి.

దయగల హృదయంతో

దయగల వ్యక్తులు ఉదారంగా, ప్రేమగా, సదుద్దేశ్యంతో ఉంటారు. అసంకల్పితంగా పరులకు సాయం చేయడం, నిస్వార్థంగా అవసరార్థులకు సేవలందించడం, సత్కార్యాలకు పూనుకోవడంలాంటి సద్గుణాలు దయామయుడిలో కనిపిస్తాయి. దయగల వ్యక్తులు ఇతరుల జీవితాలలో నవ్వుల వెలుగులు చూడడానికి ఉత్సాహపడతారు. మహానుభావులు సమాజంలో ఆదర్శవంతులుగా లేదా రోల్ మోడల్‌గా నిలబడతారు. దయామయులు చరిత్రలో చెరగని ముద్రను వేస్తారు. దయగల వ్యక్తులలో నైతికత, నీతి, నిజాయితీ, సేవా తత్పరత, నిబద్ధత, ప్రేమాభిమానాలు, విలువలతో కూడిన జీవన విధానాలు విధిగా కనిపిస్తాయి. దయగల వారు చీమకు కూడా హానిని తలపెట్టరు. "సకల జీవుల సేవయే మాధవ సేవ" అని పూర్తిగా నమ్ముతారు. దయగల వ్యక్తులు ఇతరులకు స్వచ్ఛందంగా సహాయం చేయగల మహత్తర శక్తి ఉంటుంది. దాతృత్వం, సహృదయత, విచక్షణ, మానవీయత, సహానుభూతి గుణాలు కలిగిన వ్యక్తులను దయామయుడిగా పరిగణిస్తారు.

చిన్నతనం నుంచే పిల్లలలో

'మొక్కై వంగనిదే మానై వంగునా' అన్నట్లు చిన్నతనం నుంచే పిల్లలలో దయాగుణాన్ని బోధించడం తల్లితండ్రులు బాధ్యతగా గుర్తించాలి. దయలేని ప్రపంచం నరక ప్రాయమే అర్థం చేయించాలి. ప్రపంచ దయ దినోత్సవం వేదికగా దయా గుణాన్ని పిల్లలలో అలవాటు చేయడం, బడి పిల్లల చేత ఇతరులకు సేవ అందించడాన్ని అలవాటు చేయడం, చిన్నారుల చేతుల మీదుగా పేదలకు సహాయం



చేయించడం, వారి పుట్టిన రోజులను పేదల పిల్లల మధ్య జరుపుకోవడం, దయ ప్రాధాన్యాన్ని వివరించడం, దానధర్మాలు చేయడం, నిస్సహాయులకు చేయూత అందించడం, దయగల వ్యక్తులను సన్మానించడం లాంటి కార్యక్రమాలు నిర్వహించవచ్చు. దయగల ప్రపంచం స్వర్గతుల్యం. దయలేని మనిషిలో రాక్షసత్వం బయట పడుతుంది. దయాగుణంతో ప్రజల మనసులను గెలవవచ్చు. దయను ప్రదర్శించడానికి ప్రత్యేక సందర్భాలంటూ కొన్ని ఉన్నప్పటికీ, అనుక్షణం దయను చూపడం ఓ మంచి అలవాటుగా కలిగి ఉండాలి. అనాథాశ్రమ వాసులకు సహాయం చేయడం, అవసరార్థులకు తగు చేయూతనివ్వడం మన కనీస కర్తవ్యంగా భావించి దయాగుణాన్ని నరనరాల్లో నింపుకుందాం, దయ అనే వృక్షం నీడన జీవించడం అలవాటు చేసుకుందాం.

(నేడు 'ప్రపంచ దయా దినోత్సవం')

(వ్యాస రచయిత సామాజిక విశ్లేషకులు)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

ప్రాంతీయం





చెరువులకు అందాలు అద్దడం అభివృద్ధి కాదు

- పూర్తి స్థాయి పునరుద్ధరణ జరగాలన్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

ప్రతిపక్షం,సిటి బ్యూరో , నవంబర్ 12: చెరువుల అభివృద్ధి అంటే అందాలు అద్దడం ఒక్కటే కాదని.. దాని అవసరాలు నెరవేరే విధంగా వాటిని తీర్చిదిద్దాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. సకల జీవకోటికీ ప్రాణాధారంగా వాటిని రూపొందించాలని అన్నారు. చెరువుల్లో ఆక్రమణలను, పోసిన మట్టితో పాటు.. కొన్నేళ్లుగా పేరుకుపోయిన పూడికను, దుర్గంధాన్నితొలగించిన తర్వాత మిగతా ఆకర్షణలపై దృష్టి పెట్టాలని సూచించారు. సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ)కింద చెరువులను అభివృద్ధి చేస్తున్నవారు ఈ విషయాలపై దృష్టి పెట్టాలన్నారు. శిల్పకళావేదికలో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం బుధవారం నిర్వహించిన సౌత్ ఇండియా సీఎస్ఆర్ సమ్మిట్‌లో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ సీఎస్ ఆర్ నిధులు పూర్తి స్థాయిలో సద్వినియోగం అయ్యేలా ఆయా సంస్థలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా చెరువుల పునరుద్ధరణను హైడ్రా ఎలా చేపట్టిందనేది పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటతో పాటు.. నగరంలో మొదటి విడతగా చేపట్టిన 6 చెరువుల పునరుద్ధరణ గురించి వివరంగా తెలిపారు. చెరువుల్లో వరద నీరు నిలిచేలా లోతు పెంచాల్సినవసరం ఉందని.. అలాగే ఇన్‌లెట్లు, ఔట్ లెట్లు సరిగా ఉండేలా చూడాలన్నారు. చెరువుల్లోకి మురుగు నీరు చేరకుండా హైడ్రా చర్యలను కూడా వివరించారు.

చెరువులతో పాటు నాలాల అభివృద్ధి

గొలుసుకట్టు చెరువులకు ప్రాణాధారమైన నాలాలను కూడా పరిరక్షించుకోవాల్సినవసరం ఉందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. అప్పుడే నగరంలో వరదలను నివారించగలమని చెప్పారు. చెరువుల ఆవశ్యకతను వివరిస్తూ.. ఒక ఎకరం పరిధిలో మీటరు లోతులో 4 మిలియన్ లీటర్ల నీటిని ఆపగలమన్నారు. ఈ లెక్కన వరదలను నివారించడానికి చెరువులు ఎంత అవసరమో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదన్నారు. ప్రభుత్వ భూములు, చెరువుల, నాలాలు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను పరిరక్షించడంతో పాటు.. ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కోడానికి హైడ్రాను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ప్రకృతిని మనం కాపాడితే.. ప్రకృతి వైపరీత్యాల నుంచి చాలా వరకు బయటపడగలమన్నారు. నగరంలో చెరువులు దాదాపు 61 శాతం కనుమరుగయ్యాయని.. వాటిని వీలైనంతవరకు పునరుద్ధరించేందుకు హైడ్రా కృషి చేస్తోందన్నారు. కార్పొరేట్ సంస్థలు కూడా ఇందుకోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చెరువులు శాశ్వత ఆస్తులుగా పరిగణించి ముందు తరాలవారికి వాటిని భద్రంగా అప్పజెప్పాల్సినవసరాన్ని గుర్తు చేశారు. చెరువుల చెంత పిల్లలు ప్రశాంతమైన వాతావరణంలో ఆడుకునేలా.. అక్కడ అన్ని వయసులవారు సేదదీరే విధంగా తీర్చిదిద్దాల్సినవసరాన్ని చెప్పారు. సీఎస్ ఆర్ సమ్మిట్ ముఖ్య ఉద్దేశాలను ఎమ్మెల్సీ ప్రొ. కోదండరామ్ వివరించారు. హైడ్రాకు తమవంతు సహకారం అందిస్తామని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఖైరతాబాద్ ఛైర్మన్ ప్రొ . డా. రమణ నాయక్ తెలిపారు.

ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని
ప్రశ్నించడం నేరమా?

- నల్గొండలో జాగృతి హోర్డింగ్‌ల తొలగింపును తీవ్రంగా ఖండిస్తున్నాం
- కప్పాటి పాండు రంగారెడ్డి జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు



ప్రతిపక్షం, సిటి బ్యూరో, నవంబర్ 12 : నల్గొండలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను మున్సిపల్ అధికారులు రాత్రికి రాత్రే తొలగించడాన్ని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండు రంగారెడ్డి తీవ్రంగా ఖండించారు. బుధవారం మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో, ఇది కేవలం పోస్టర్‌లను తొలగించడం మాత్రమే కాదు, ప్రజాభిప్రాయాన్ని అణచివేయడానికి ఒక రాజకీయ కుట్ర అని ఆయన అన్నారు. "జాగృతి జనంబాట" కార్యక్రమాన్ని ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో నిర్వహిస్తున్నారు, అటువంటి కార్యక్రమానికి సంబంధించిన హోర్డింగ్‌లను ఏర్పాటు చేయడంలో తప్పేంటి? అని ఆయన ప్రశ్నించారు. ఈ హోర్డింగ్‌ల తొలగింపు వెనుక మంత్రి కోమటి రెడ్డి ఆదేశాలు ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ చర్య ప్రజాస్వామ్య సూత్రాలను స్పష్టంగా ఉల్లంఘించడమేనని ఆయన అన్నారు. ఒకవైపు అధికార పార్టీ నాయకులు ప్రభుత్వ నిధులతో ప్రతిచోటా తమ పోస్టర్లను అతికిస్తున్నారు, మరోవైపు, ప్రజా అవగాహన కార్యక్రమాల ఫ్లెక్సీలను కూడా భరించలేకపోతున్నారు ఇదేనా ప్రజాస్వామ్య స్వేచ్ఛ అని పాండురంగా రెడ్డి అన్నారు. "ప్రజాస్వామ్యంలో వ్యతిరేక స్వరాలను అణచివేయడం అధికార దుర్వినియోగమే. ప్రజల అభిప్రాయాలను అణచివేసే బదులు, వినడం నేర్చుకోవాలి, ఇదే నిజమైన ప్రజాస్వామ్యం" అని ఆయన అన్నారు.



రోడ్డు ప్రమాదంలో ముగ్గురు అక్కాచెల్లెల్ల మృతి బాధాకరం

- బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన గౌడ కుల సంఘం నాయకులు
- రూ.43వేలు ఆర్థికసాయం అందజేత

ప్రతిపక్షం,మొయినాబాద్,నవంబర్ 12 : చేవెళ్ల మండలంలోని మిర్జగూడ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు అక్కా చెల్లెల్లు మృతి చెందడం బాధాకరమని గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు మల్లేష్ గౌడ్ అన్నారు. బుధవారం జిల్లా అధ్యక్షులు నర్సింహా గౌడ్, అంజయ్య గౌడ్ ల ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులు ఎల్లయ్యగౌడ్ దంపతులను పరామర్శించారు. అనంతరం వారికి ఓదార్చి మనోధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మొయినాబాద్ మండలం గౌడ కుల సంఘం ఆధ్వర్యంలో రూ.43వేలు ఆర్థికసాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌడ కుల సంఘం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఫార్మసి విద్యతో బంగారు భవిష్యత్తు

- జాతీయ ఆరోగ్య మంత్రిత్వ శాఖ శాస్త్రవేత్త డాక్టర్ సంతోష్ కుమార్.

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 12 : ఫార్మసి విద్యలో విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకొని ఔషధ రంగా అభివృద్ధి కోసం ఎదగాలని జాతీయ మంత్రిత్వ శాఖ శాస్త్రవేత్త డాక్టర్ సంతోష్ కుమార్ అన్నారు మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అండాపూర్ చౌరస్తాలో గల భాస్కర ఫార్మసి కళాశాలలో ఓరియంటేషన్ డే కార్యక్రమాన్ని ఆ కళాశాల సెక్రటరీ జెవీ కృష్ణారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ ఆరోగ్య మంత్రిత్వ శాఖ శాస్త్రవేత్త డాక్టర్ సతీష్ కుమార్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..దేశ ప్రపంచాలలో అయినా ఔషధ రంగానికి ఎంతో గుర్తింపు ఉందని అన్నారు. అభివృద్ధి కోసం ఫార్మసీ చదువుతున్న విద్యార్థులు ఎన్ఎంకలాంటి వారని తెలిపారు ఫార్మసీ విద్యలో విద్యార్థులు నైపుణ్య విద్యుత్ తో పాటు పరిశోధనలు ఎంతో అవసరమని సూచించారు నేటి సమాజంలో ప్రతి ఒక్కరికి ఔషధం అనే పదార్థం ఎంతో కీలకమైందని సూచించారు. నూతన టెక్నాలజీ రంగంలో మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నతమైన విద్యతోపాటు బంగారు భవిష్యత్తు నిర్మించుకోవాలని తెలిపారు భాస్కర ఫార్మసీ కళాశాలలో కళాశాల యజమాన్యం జెవీ కృష్ణారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ఎంతో నైపుణ్యం ఉందని తెలిపారు . ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సంజయ్ భాస్కర ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసరావు వైస్ ప్రిన్సిపాల్ చందు భాష కిషోర్ సాయినాథ్ కిషోర్ బాబు శ్రీకాంత్ సుమలత తేజశ్రీ తాయాభి నాగమణి పర సామ్సన్ తదితరులు పాల్గొన్నారు..



డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

ప్రతిపక్షం,ఉప్పల్ సిటి బ్యూరో, నవంబర్ 12 : ఉప్పల్ నియోజకవర్గం లోని మల్లాపూర్ డివిజన్ పరిధిలోని గ్రీన్ హిల్స్ కాలనీ ఫేస్ 2 లో, 73 లక్షల రూపాయలతో డ్రైనేజి లైను పనులకు, మల్లాపూర్ సర్వే నెం 110 లో, జిమ్ సెంటర్ అనుకోని ఉన్న ఖాళీ స్థలానికి 8.5 లక్షల రూపాయలతో ప్రహరి గోడ నిర్మాణనికి అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి , కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రీన్ హిల్స్ కాలనీ ఫేస్ 2 నెలకొన్న పలు సమస్యలను పరిశీలించారు, వాటిని దశల వారిగా పరిష్కరిస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జివిచ్ఎంసి, కాప్రా సర్కిల్, డిఈ, రూపా, ఏఈ శ్రవంతి స్థానిక కాలనీ వాసులు సుదర్శన్, రాజేష్, అల్తాఫ్, విజయ్ గౌడ్, నిరంజన్, నాగరాజు నాయకులు, రాపోలు సతీష్, తండా వాసుగౌడ్, కుంటి కృష్ణ, ఉస్మాన్, అల్లాడి కృష్ణయాదవ్, మల్లేష్, రాములు నాయక్, రఘు, శ్రీశైలం, శ్రీనివాస్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



త్యాగాల పునాదులపై రాజ్యం కావాలి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 12 : బహుజన్ సమాజ్ పార్టీ ఉమ్మడి మెదక్ జిల్లా జిల్లా ముఖ్య కార్యకర్తల సమీక్ష సమావేశం బీఎస్పీ సంగారెడ్డి జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ,అసెంబ్లీ కమిటీల సమీక్ష్య నిర్వహించారు . సమీక్ష సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్ మాట్లాడుతూ జన కళ్యాణ్ టార్గెట్ ను నిర్దేచించారు, రానున్న రోజుల్లో బహుజన రాజ్యాన్ని సాధించాలంటే మహనీయుల త్యాగాల పునాదులపై రాజ్యాన్ని సాధించాలని ఆయన పేర్కొన్నారు. అలాంటప్పుడే సరైనా నాయకత్వం చేయగలరు.మహనీయులు మానవులే కాని వారి త్యాగం వల్ల మాత్రమే రాజ్యాధికారం సాధ్యం అయ్యింది, మనం త్యాగం చెయ్యకుంటే మార్పును సాధించలేము,మహనీయుల కలలు కన్నా బహుజన రాజ్యాధికారం సాధించాలి, నాయకుడు ప్రజలను తయారు చేయాలి కాని ప్రజలు నాయకుడిని తయారు చెయ్యరు, నూటికి 85 శాతం ఉన్న బహుజనులను కూడితేనే రాజ్యమే వస్తుంది, మీ గ్రామంలో 100 ఓట్లు ఉన్నోడికి ఉన్న విలువ కోట్ల రూపాయలు ఉన్నోడికి ఉండదు, విమర్శించడం మానేసి ప్రేమించడం మొదలు పెట్టండి. బహుజనుల ఆర్థిక సహకారంతో ఏర్పడిన ప్రభుత్వం మాత్రమే బహుజనుల బ్రతుకు మారుస్తుంది అని అలాంటి జన కళ్యాణ్ దివాస్ విరాళాలను విజయవంతంగా పూర్తి చెయ్యాలి అని అన్నారు





సంగారెడ్డిలో ఐక్యత మార్చ్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 12 : దేశ సమైక్యతకు ప్రతీకగా నిలిచిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా బుధవారం సంగారెడ్డిలో ఐక్యత మార్చ్ ఘనంగా జరిగింది. కేంద్ర యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని "మై భారత్" సంస్థ సమన్వయంతో ఐబి నుండి కలెక్టరేట్ వరకు ఈ పాదయాత్ర నిర్వహించారు. ఎంపీ రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రశేఖర్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ అంజయ్య, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వందేమాతరం 'జైహింద్' నినాదాలతో నగరం మార్మోగింది. తరువాత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమాన్ని ఎంపీ రఘునందన్ రావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. వందేమాతరం గీతంతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ... ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ తో పాటు దేశానికి స్వాతంత్రం సిద్ధించిన 100వ సంవత్సరం 2047 వరకు భారత దేశాన్ని విశ్వగురువుగా నిలపాలని లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు . సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ సమైక్యతకు ప్రతీక. ఆయన చూపిన మార్గంలో యువత నడవాలి అన్నారు. స్వాతంత్రం వచ్చిన సమయంలో భారతదేశ 536సంస్థానాలతో చిన్న చిన్న ముక్కలుగా ఏ ప్రాంతానికి ఆ ప్రాంతం ఉండి ప్రత్యేక రాజ్యాలుగా ఉండేదని ఆ సంస్థానాలన్నిటిని భారతదేశంలో విలీనం చేసిన మహనీయుడు అఖండ భారత నిర్మాత సర్దార్ వల్లభాయ్ పటేల్ అని అన్నారు . అన్ని సంస్థానాలు భారతదేశంలో విలీనమైనప్పటికీ మన హైదరాబాద్ సంస్థానం తోపాటు కాశ్మీర్ భారతదేశంలో విలీనం కాలేదని అన్నారు. హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడం కోసం ఆపరేషన్ పోలో నిర్వహించి 1948 సెప్టెంబర్ 17వ తేదీన భారతదేశంలో హైదరాబాద్ సంస్థనాన్ని విలీనం చేసిన ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్ కు దక్కుతుందన్నారు. సంస్థానాల విలీనం ద్వారా అఖండ భారతావని నిర్మించిన ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్ కు దక్కుతుందని అన్నారు. భారతదేశాన్ని ఐక్యంగా, శక్తివంతంగా నిలబెట్టడం మనందరి బాధ్యత అని అన్నారు. దేశ సమైక్యత వెనుక పటేల్ లాంటి మహనీయుల త్యాగాలు ఉన్నాయని, ఆయన స్ఫూర్తిని ఆచరణలో పెట్టి యువత దేశ సేవలో ముందుండాలని ఈ సందర్భంగా ఎంపి రఘునందన్ రావు పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ సర్దార్ పటేల్ దేశ ఏకతకు,సామాజిక సమగ్రతకు చేసిన కృషి అపూర్వం. ఆయన ఆలోచనలు నేటి తరానికి మార్గదర్శకం అని పేర్కొన్నారు. దేశ ఐక్యత, జాతీయ సమగ్రతకు ప్రతీకగా నిలిచిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలను స్మరించుకుంటూ, ప్రభుత్వ అధికారులు ఆయన స్ఫూర్తిని తమ కర్తవ్యాల్లో ప్రతిబింబించాలని పిలుపునిచ్చారు. 1947లో దేశాన్ని ఏకం చేసిన సర్దార్ పటేల్ స్ఫూర్తిని ప్రతి భారత పౌరుడు గుండెల్లో దాచుకోవాలని సూచించారు. ఆయన చూపిన మార్గం నేటి తరానికి మార్గదర్శకమని, అధికారులు ప్రజల్లో దేశభక్తి, ఐక్యతా భావాన్ని నింపేందుకు కృషి చేయాలని నేతలు పిలుపునిచ్చారు. యువతలో దేశభక్తిని పెంపొందించడం కోసం కేంద్ర ప్రభుత్వం ఏక్ బారత్ ఆత్మనిర్భార్ భారత్ పేరట ఈ యూనిటీ మార్చి కార్యక్రమాన్ని చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. దేశ సమగ్రత కోసం భావితరాల కు స్వతంత్ర సంగ్రామంలో మహనీయులు చేసిన కృషిని తెలియజెప్పడం కోసం ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దూకదం చేస్తాయన్నారు. భిన్నత్వంలో ఏకత్వం" భారతదేశ బలమని, మన అందరం ఈ దేశానికి వరమని గుర్తిస్తూ సమైక్యతతో ముందుకు సాగాలన్నారు.ఈ కార్యక్రమ సమన్వయకర్తగా ఉమ్మడి మెదక్ జిల్లా ఎం.రంజిత్ రెడ్డి, జిల్లా యువజన అధికారి, మై భారత్, మోయస్, గోల్. జిల్లా యువజన అధికారి ఖాసీం బేగ్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలోట్రైనీ కలెక్టర్లు దీపికా, ప్రతిభ, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు , వివిధ విద్యాసంస్థల అధ్యాపకులు, విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మానవత్వాన్ని చాటిన ఇందిరా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్

- అనాథ మహిళ అంత్యక్రియలు నిర్వహించిన కాలనీ వాసులు

ప్రతిపక్షం, రామంతాపూర్, నవంబర్12 : రామంతాపూర్ ఇంద్ర నగర్ మార్కండేయ ఆలయం వద్ద ఒంటరిగా నివసించే పెంటమ్మ(55) అనే మహిళ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఇందిరా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, ఇందిరా నగర్ కాలనీ వాసుల ఆర్థిక సహాయంతో స్థానిక రాజేంద్ర నగర్ కాలనీ హిందూ స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారం పెంటమ్మ అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. కాలనీ వాసులు సైతం చొరవ తీసుకుని తమ మానవతా దృక్పథం చాటుకున్నారు. ఈ సందర్భం కాలనీ వాసులు మాట్లాడుతూ పెంటమ్మ అంత్యక్రియలకు సేకరించిన విరాళాలు ఆమె అంత్యక్రియ కోసం వెచ్చించి, మిగిలిన మొత్తం పెంటమ్మ పేరుపై పేదలకు అన్నదానం చేయాలని నిర్ణయించారు, తద్వారా పెంటమ్మ అనాథ కాదని, ఆమెకు అన్ని తామై ముందు ఉండి, తన ఆత్మశాంతి చేకూరేలా భగవంతుడిని ప్రార్థిస్తూన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రముఖులు జక్రియా, ఆపిల్ శ్రీను, సాజన్, మున్నా, సత్యనారాయణ, ప్రేమ్, బొడ్డుపల్లి శ్రీనివాస్, దీపక్, అక్తర్ బేగం, మహిళలు తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమకారులు విద్యాసాగర్ కాసోజు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం ప్రజాప్రతినిధులు ఫోన్ ద్వారా కాలనీ వాసులని అభినందించారు.



ఢిల్లీలో జరిగిన పేలుడు ఘటనను ఖండిస్తున్నా. బాధిత కుటుంబాలకు నా సానుభూతి. భారత్‌కు తమ మద్దతు ఎప్పుడూ ఉంటుంది. భారత్, ఇజ్రాయెల్ శాశ్వత సత్యాలపై ఆధారపడిన పురాతన నాగరికతలు. మన నగరాలపై దాడులు జరగొచ్చు. కానీ అవి మనల్ని భయపెట్టలేవు. ఇరు దేశాల వెలుగు శత్రువుల చీకట్లను తరిమేస్తుంది.

- ట్విటర్లో ఇజ్రాయెల్ పీఎం నెతన్యాహు



కొనసాగుతున్న ఆర్మీ రిక్రూట్ మెంట్

- మూడో రోజు మూడు జిల్లాల అభ్యర్థులకు

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 12: హనుమకొండ లోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో డిడిజి (స్టేట్స్), జోనల్ రిక్రూటింగ్ ఆఫీస్ చెన్నై,డైరెక్టర్ రిక్రూటింగ్ ఏఆర్ఓ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీలో భాగంగా ఆర్మీ పరీక్షలో ఇంతకుముందే ఉత్తీర్ణత సాధించిన మూడు జిల్లాలకు చెందిన అభ్యర్థులకు ఆర్మీ అధికారులు ఆర్మీలో ఎంపికకు వివిధ పరీక్షలను బుధవారం నిర్వహించారు. కుమురంభీమ్ ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్ నగర్ జిల్లాలకు చెందిన అభ్యర్థులు 794 ఆర్మీ నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులు కాగా జేఎన్ఎస్ లో నిర్వహించిన ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ ఎంపిక పరీక్షకు 623 హాజరయ్యారు. ఈ సందర్భంగా మూడు జిల్లాలకు చెందిన 623 మంది అభ్యర్థులకు ఆర్మీ అధికారులు రన్నింగ్, ఫిజికల్ ఫిట్ నెస్ పరీక్షలను నిర్వహించి అభ్యర్థుల ఎత్తు, బరువు, ఛాతీ ప్రమాణాలను కొలిచారు. ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీలో పాల్గొంటున్న అభ్యర్థులు నిర్ణీత సమయంలో పరుగును పూర్తి చేసేందుకు ఉత్సాహంగా పరిగెత్తుతున్నారు. ఆర్మీలో చేరడమే లక్ష్యంగా అభ్యర్థులు పోటీ పడుతున్నారు. కాగా మంగళవారం రన్నింగ్, ఫిజికల్ ఫిట్నెస్, పరీక్షల్లో పాల్గొన్న అభ్యర్థులకు బుధవారం మెడికల్ ఎగ్జామ్ నిర్వహించారు.



యూనియన్ పెట్టుకునే హక్కు కార్మికులకు ఉంది

- పాశమైలారం పారిశ్రామిక క్లస్టర్ (సిఐటియు) కన్వీనర్ అతిమేల మాణిక్
- సీఐటీయూ ఆధ్వర్యంలో పరిశ్రమ ముందు ఆందోళన

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 12 : ట్రేడ్ యూనియన్ యాక్ట్ ప్రకారం యూనియన్ పెట్టుకునే హక్కు కార్మికులకు ఉందని, యూనియన్ పెట్టుకుంటే కార్మికులను ఎట్లా తొలగిస్తారని పాశమైలారం పారిశ్రామిక క్లస్టర్ (సిఐటియు) కన్వీనర్ అతిమేల మాణిక్ మండిపడ్డారు. బుధవారం బిస్లరీ పరిశ్రమల్లో తొలగించిన కార్మికులను వెంటనే తీసుకోవాలని ఐడిఏ పాశమైలారంలో సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేయడం జరిగింది. ఈ సందర్భంగా అతిమేల మాణిక్ మాట్లాడుతూ పాశమైలారం పారిశ్రామిక ప్రాంతంలోని బిస్లరీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో ఇటీవల కార్మికులు ట్రేడ్ యూనియన్ యాక్ట్ 1926 ప్రకారం యూనియన్ ను ఏర్పాటు చేసుకున్నారని, యూనియన్ పెట్టుకున్నందుకు యాజమాన్యం కక్షపూరితంగా వ్యవహరిస్తు యూనియన్ లో ఉండొద్దని, యూనియన్ ను రద్దు చేసుకోవాలని 50 రూపాయల బాండ్ పేపర్ పై సంతకాలు చేయాలని కార్మికుల మీద తీవ్ర ఒత్తిడి చేయడం చట్ట విరుద్ధమని అన్నారు. యాజమాన్యం కు కార్మిక శాఖ అధికారులకు పోలీసు అధికారులకు చట్టబద్ధంగా యూనియన్ ఏర్పాటు చేసుకున్నమని తెలియజేసినప్పటికీ కక్షపూరితంగా వేధింపులకు పాల్పడడం, తొలగించడం దుర్మార్గమన్నారు. చట్టానికి విరుద్ధంగా తొలగించిన కార్మికులను వెంటనే తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టాలను ఉల్లంఘిస్తు కార్మిక వ్యతిరేక విధానాలకు కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాశమైలారం పారిశ్రామిక క్లస్టర్ నాయకులు రాజు, వెంకటేష్, శ్రీనివాస్, దుర్గయ్య, బిస్లరీ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రటరీ శేఖర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, కోశాధికారి నవీన్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా పోస్టర్స్ ఆవిష్కరణ

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 12 : అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం సంగారెడ్డి లో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా పోస్టర్స్ ఆవిష్కరించడం జరిగింది కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లలితా కుమారి మాట్లాడుతూ ఈనెల 12 నుండి 19 వరకు వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాలు జరుగుతాయని తెలియజేశారు. ఈ ఉత్సవాలలో సీనియర్ సిటిజన్స్ అందరూ పాల్గొనాలని తెలియజేశారు తల్లిదండ్రులు వయోవృద్ధుల పోషణ మరియు సంక్షేమ చట్టం 2007, సీనియర్ సిటిజన్ కొరకు ఏర్పాటు చేయబడిందని తెలియజేశారు. ఈ సంక్షేమ చట్టం గురించి అందరూ అవగాహన కలిగి ఉండాలి అందరికీ తెలియజేయాలని కోరారు. సమాజంలో తల్లిదండ్రులు పిల్లల వలన ఎదుర్కొంటున్న సమస్యల కొరకు వృద్ధుల పోషణ మరియు సంరక్షణ కొరకు ప్రత్యేకమైనటువంటి టోల్ ఫ్రీ నెంబర్ 14567 ఏర్పాటు చేయబడింది. ఈ టోల్ ఫ్రీ నెంబర్ ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీఓ సూర్య రావు, వయో వృద్ధుల, దివ్యాంగుల శాఖ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశం, వయోవృద్ధులు మరియు దివ్యాంగులు,ట్రాన్స్ జెండర్స్ శాఖ ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి సతీష్,జిల్లా బాలల సంరక్షణ అధికారి రత్నం కమ్యూనిటీ ఎడ్యుకేటర్ ఉమేరా సహిష్ట, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు విజయ రావు, అశోక్ కుమార్ సంగయ్య కృష్ణ సత్తయ్య నరసింహారెడ్డి, ఖాదర్ మైనుద్దీన్ పాల్గొన్నారు.

అనధికారిక ఆదేశాలతో కలెక్టరేట్‌లో
ఉప తహసిల్దార్ విధుల నిర్వహణ

- అర్బన్ తహసిల్దార్ కార్యాలయంలో కుంటుపడుతున్న సేవలు
- అతిథుల పర్యటనల పేరిట రోజులకు రోజులే కార్యాలయానికి ఉద్యోగులు సిబ్బంది దూరం



ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 12 : ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారి వద్దకే పరిపాలనను అందించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే నిర్మల్ అర్బన్ తహసిల్దార్ కార్యాలయంలో మాత్రం ఉన్నత అధికారులు నిర్వాకం భిన్నంగా ఉంది. లక్షకు పైగా జనాభా కలిగి ఉన్న నిర్మల్ పట్టణానికి జనాభాకు అనుగుణంగా నిత్య సేవలు సకాలంలో అందించవలసిన అధికారులు అవేమీ పట్టించుకోకుండా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు విధులు నిర్వహిస్తున్నారు. నిర్మల్ అర్బన్ తహసిల్దార్ కార్యాలయ ఉప తహసిల్దార్ తనకు అధికారికంగా కేటాయించిన ఉప తహసిల్దార్ పదవి బాధ్యతలను స్థానికంగా నిర్వహించవలసి ఉండగా అనధికారిక ఆదేశాలతో పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లా కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ రెవెన్యూ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. పట్టణ నడిబొడ్డున కార్యాలయం ఉన్న తమ తమ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే దరఖాస్తుదారులకు మాత్రం తహసిల్దార్, ఉప తహసిల్దారులు అందుబాటులో ఉండడం లేదనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

జిల్లా కేంద్రం కావడంతోనే..

నిర్మల్ జిల్లా కేంద్రం కావడంతో ఉన్నత అధికారులు,ప్రజా ప్రతినిధులు, ప్రత్యేక అధికారులు ఎవరూ నిర్మల్ కు వచ్చిన నిర్మల్ అర్బన్ తహసిల్దార్ వారి సిబ్బంది అందుబాటులో ఉండి వచ్చిన వారి ఆలనా పాలనాలు చూసుకోవాల్సి ఉంటున్నది. నిర్మల్ అధికారిక అతిథులు ఎవరు వచ్చినా తమ పనీపాట వీడి ఒకవైపు తహసిల్దార్ మరోవైపు రెవెన్యూ ఇన్స్పెక్టర్ లు ఇతర సిబ్బంది బిజీ బిజీగా ఉండవలసి వస్తుంది. దీనికి తోడు తహసిల్దారు స్థానికంగా లేనప్పుడు వారి ఆ విధులను ప్రత్యామ్నాయంగా.. బాధ్యతగా చూసుకోవాల్సిన బాధ్యత ఉప తహసిల్దార్ పై ఉంటుంది.ఉన్నత అధికారుల

అనధికారిక ఆదేశాలతో స్థానికంగా కుంటుపడుతున్న సేవలు

నిర్మల్ అర్బన్ తహసిల్దార్ కార్యాలయం ఉప తహసిల్దార్ మాత్రం అనధికారికంగా తమ ఉన్నత అధికారులు ఇచ్చిన ఆదేశాల అనుసారం తన నిత్య విధి నిర్వహణను అష్ట కష్టాలు పడుతూ జిల్లా కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ (రెవెన్యూ విభాగం) వారి విభాగంలో నిర్వహిస్తుండటంతో ఆయనకు కేటాయించిన అర్బన్ తహసిల్దార్ కార్యాలయంలో విధి నిర్వహణ బాధ్యతలను చేసుకోలేకపోతున్నారు. దీంతో ప్రతిరోజు వందలాదిగా వస్తున్న ఆదాయం,నివాసం,కులం, ఇతరత్రా అధికారిక ధ్రువీకరణ పత్రాల జారీ నిర్ణీత సమయాలలో జరగక దరఖాస్తుదారులు నానా తండాలు పడవలసి వస్తుందని ఆరోపణలు ఉన్నాయి. ఉప తహసిల్దారు పర్యవేక్షణలలో జరిగే అనేక అధికారిక కార్యాలయ సంబంధిత కార్యకలాపాలు స్థానికంగా కుంటుపడుతున్నాయని చెప్పక తప్పదు.

రికార్డ్ విభాగంలో సిబ్బందిదే ఇష్టారాజ్యం

ముఖ్యంగా రెవెన్యూ రికార్డుల విభాగం పూర్తిస్థాయి బాధ్యత ఉప తహసిల్దార్ కే ఉంటుంది. స్థానికంగా ఉప తహసిల్దార్ నిత్య పర్యవేక్షణ లోపించడంతో రికార్డు విభాగం తమదే రాజ్యంగా తమ నిత్య కార్యకర్తలను కొనసాగిస్తున్నారని ఆరోపణలు జోరందుకుంటున్నాయి. ముఖ్యంగా వీళ్ళ తరబడి ఆధారిత రికార్డుల కోసం అనగా నఖల్ పత్రాలు, ఫామ్ నంబర్ సేవన్ ఇతరత్రా వ్యవహారాల నిమిత్తం అధికారిక నియమ నిబంధనల ఆధారంగా సంబంధిత దరఖాస్తుదారులు దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. కానీ నేరుగా సంబంధిత సిబ్బందికి మొబైల్ ద్వారా ఫలానా సర్వేనెంబర్.? ఫలానా ఫాం నంబర్ సేవన్.? ఈ సంవత్సరం నుంచి ఆ సంవత్సరం వరకు కావాలని చెప్పేస్తే చాలు నేరుగా వారి ఫోన్ నెంబర్ నుంచి సంబంధిత బాధితుడికి వాట్సాప్ ద్వారా రికార్డుల సంబంధిత చిత్రాలు వివరాలు క్షణాలలో వచ్చేస్తున్నాయని పలువురు దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్ చేయవలసిన విధులు వీఆర్ఏ ద్వారా నిత్యం వచ్చే నివాస ఆదాయ కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు, జనన మరణ ఈడబ్ల్యూఎస్ ఇతరత్రా అధికారిక సర్టిఫికెట్లను పొందేందుకు కార్యాలయానికి వచ్చే వారికి తీవ్ర నిరాశే మిగులుతుంది. సదరు ధ్రువీకరణ పత్రాలను సమర్పించుకునే విభాగాన్ని కనీస అవగాహన లేని వీఆర్ఏకు అప్పగించారు. ఇక్కడ రెగ్యులర్ జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి జిపిఓగా ఖానాపూర్ కు బదిలీ అయ్యాడు. ఆస్థాయి జూనియర్ అసిస్టెంట్ అర్హత ఉన్న సిబ్బంది కార్యాలయంలో ఉన్న వారికి ఇతర బాధ్యతలను అప్పగించి విభాగపరమైన కనీస అవగాహన లేని వీఆర్ఏ స్థాయి సిబ్బందిని విభాగ నిర్వహణ బాధ్యతలను అప్పగించడంతో దరఖాస్తుదారులు నిత్యం పడరాని పాట్లు పడుతున్నారు. సదరు విభాగాన్ని చూసుకుంటున్న వీఆర్ఏ దరఖాస్తుదారులతో కనీస మర్యాద లేకుండా వ్యవహరిస్తుండడంతో తాము తీవ్ర మానసిక శోభకు గురవుతున్నామని దరఖాస్తుదారులు వాపోయారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోతున్నదని ఆరోపించారు.


జాతీయ రహదారి విస్తరణ పనుల్లో వేగం పెంచండి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి




ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 12 : మదినగూడ నుండి సంగారెడ్డి వరకు చేపడుతున్న జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పటాన్చెరు నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి జాతీయ రహదారుల సంస్థ అధికారులకు సూచించారు. బుధవారం సాయంత్రం పటాన్చెరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సంస్థ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిహెచ్ఇఎల్ చౌరస్తా నుండి రుద్రారం గణేష్ గడ్డ వరకు చేపడుతున్న పనులు నెమ్మదిగా కొనసాగుతున్నాయని తెలిపారు. దీని మూలంగా నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడి వాహనదారులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అశోక్ నగర్, బీరంగూడ, రామచంద్రపురం, పటాన్చెరు పట్టణాల పరిధిలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాల అంశంలో సంయుక్త పరిశీలన చేసిన తర్వాతే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. నిర్మాణాల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని.. ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాతీయ రహదారుల సంస్థ డి ఈ రామకృష్ణ, నిర్మాణ సంస్థ ప్రతినిధులు శాస్త్రి, రమేష్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.





వచ్చే విద్యా సంవత్సరానికి భవనాలు పూర్తి కావాలి

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 12 : వచ్చే విద్యా సంవత్సరం నాటికి మండలంలో కొనసాగుతున్న అన్ని కళాశాల భవన నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభించేలా పనులు వేగిరం చేయాలని కలెక్టర్ సూచించారు. భూనేడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.5.50 లక్షలతో నిర్మిస్తున్న కొత్తపల్లి మండల ప్రభుత్వ జూనియర్ కళాశాల పనులను కడ ప్రత్యేక అధికారి తో కలిసి ఆమె పరిశించారు. పనుల్లో వేగం పెంచి జూన్ 2026 నాటికి కొత్త. కళాశాలను ప్రారంభించాలని ఆమె తెలిపారు. ఆ పాఠశాలలో సాయంత్రం కొనసాగుతున్న పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులను కలెక్టర్ పర్యవేక్షించారు. గత ఏడాది కంటే ఈ సారి పది ఫలితాల్లో మెరుగైన ఉత్తీర్ణుల శాతం రావాలని, హార్డ్ సబ్జెక్ట్ ఏదైనా ఉంటే సంబంధిత ఉపాధ్యాయులతో ప్రత్యేక క్లాస్లు చెప్పించాలని హెచ్ ఎం కు సూచించారు. డిసెంబర్ నెలాఖరునాటికి సిలబస్ పూర్తి చేసి, జనవరి నుంచి రివిజన్ ప్రారంభించాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణలో డైనింగ్ హాల్ నిర్మాణం గురించి అధికారులతో కలెక్టర్ చర్చించారు. అనంతరం కొత్తపల్లి గుండు మల్ వరకు రూ. 38 కోట్లతో చేపట్టిన ఆర్ అండ్ బి బీటీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ కొత్తపల్లి సమీపంలో కాలువ వద్ద వంతెన నిర్మాణ పనులు నిలిచి పోవడంపై అర్ అండ్ బి అధికారులను వివరణ కోరారు. వర్షాల కారణంగా పనులు నిలిచి పోయాయని అధికారులు జవాబు ఇవ్వగా, మరోసారి పరిశీలనకు వచ్చేలోపు వంతెన నిర్మాణం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తర్వాత కొత్తపల్లి,గుండుమల్ మండల కేంద్రాలలో రూ.8.80 లక్షలతో నిర్మిస్తున్న మండల కార్యాలయాల సమీకృత భవన నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులు వేగంగా చేపట్టాలని, గడువులోపు మండల కార్యాలయాల సమీకృత సముదాయాలు పనులు పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గుండుమల్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో రూ. కోటి నిధులతో నిర్మాణం పూర్తికావస్తున్న అదనపు గదుల పనులను వారు పరిశీలించారు. గుండుమల్ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి వసతి గృహ ఆవరణలో ప్రారంభించిన వసతి గృహ అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. వసతి గృహంలో కొనసాగుతున్న సాయంత్రం ప్రత్యేక స్టడీ అవర్ ను కలెక్టర్, కడ అధికారి పర్యవేక్షించారు. వసతి గృహ వంటగదికి వెళ్లి విద్యార్థులకు వండుతున్న రాత్రి భోజనాన్ని వారు పరిశీలించారు. మెనూ ప్రకారం కూరగాయలు లేకపోవడం, వసతి గృహంలో వార్డెన్ లేకపోవడం పై అసహనం వ్యక్తం చేశారు. స్టాక్ రిజిస్టర్ ను గురువారం కలెక్టరేట్ కు తీసుకురావాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. మళ్ళీ విద్యార్థులతో ముఖా ముఖి నిర్వహించి, వసతి గృహ సమస్యలపై ఆరా తీశారు. అందరూ బాగా చదువుకోవాలని సూచించారు. చివరగా రూ. 5.50 లక్షలతో చేపడుతున్న గుండుమాల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించి, వీలైనంత తొందరగా పనులు పూర్తిచేసేలా అధికారులు దగ్గరుండి పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ ఈ ఈ,డీ ఈ, ఆర్ అండ్ బి డీ ఈ, ఏ ఈ లు, ఆయా మండలాల తాసిల్దారులు, ఎంపీడీవోలు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వచ్చే ఉగాదికి మరో 5.90 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి పేదలకు అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం పని చేస్తోంది. ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల కుటుంబాలు గృహప్రవేశాలు చేశాయి. తాను అన్నమయ్య జిల్లాలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నా. ఇల్లు అంటే నాలుగు గోడలు కాదు. ఒక కుటుంబానికి గౌరవం, సంతోషం, భవిష్యత్, భద్రత అని నమ్మి పాలన అందిస్తున్నాం.

- ఏపీ సీఎం చంద్రబాబు

ప్రాంతీయం

అమలు కాని సమాచార హక్కు చట్టం

- ఖాళీగా ఉన్న అధికారులు వివరాల బోర్డు



ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, నవంబర్ 12: సిద్దిపేట జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్(డీపీఆర్ఈ) కార్యాలయంలో పారదర్శకతకు చిహ్నమైన సమాచార హక్కు చట్టానికి సంబంధించిన అధికారుల వివరాలు తెలిపే బోర్డు ఖాళీగా వదిలి వేశారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, అప్పిలేట్ అథారిటీ అధికారి పేర్లు, హోదాలు, సంప్రదింపు వివరాలు స్పష్టంగా ప్రదర్శించడం తప్పనిసరి. సిద్దిపేటలోని డీపీఆర్ఈ కార్యాలయంలో బోర్డు పై ఎటువంటి వివరాలు లేకపోవడం సమాచార హక్కు చట్టం అమలు తీరుకు అద్దం పడుతోంది. ప్రభుత్వం పారదర్శకతపై దృష్టి పెట్టిన ప్రస్తుత సమయంలో సమాచార హక్కు చట్టాన్ని అమలు చేసే అధికారుల వివరాలు లేకపోవడం విచారకరమని పలువురు పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం ప్రకారం వివరాలు స్పష్టంగా ప్రదర్శించకపోవడం నిర్లక్ష్యమని పలువురు ఆరోపించారు. సంబంధిత అధికారులు ఈ విషయంపై స్పందించి తక్షణం ఆర్టీఐ చట్టానికి అనుగుణంగా బోర్డు పూర్తి వివరాలతో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



నార్సింగి అక్షర స్కూల్ బస్సులో మంటలు

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 12: నార్సింగి మండల కేంద్రంలోని అక్షర స్కూల్ (సాహితీ విద్యాలయం) బస్సులో మంటలు చెలరేగడంతో గ్రామస్తులను ఆందోళనకు గురయ్యారు. ఈ సంఘటన బుధవారం సాయంత్రం జరిగింది. విద్యార్థులను గ్రామాలకు తరలించిన అనంతరం తిరిగి చేరుకున్న బస్సు శివాలయం వద్ద ఖాళీ స్థలంలో నిలిపివేశారు. అంతలోనే మంటలు చెలరేగి స్కూల్ బస్ దగ్ధమవుతుండగా చుట్టుపక్క నివాస గృహాలకు చెందిన వ్యక్తులు మంటలనార్పే ప్రయత్నం చేశారు. స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఫైర్ ఇంజన్ కు సమాచారం అందించగా కాలుతున్న బస్సు మంటలను ఆర్పివేశారు. దీంతో ప్రైవేట్ స్కూల్ బస్సు కొంతమేరకు నష్టం జరిగినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు.



పూర్ణకుంభ ఆకృతిలో కార్తీకదీపం

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 12: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో బుధవారం నాడు భక్తులు హరిద్రా నదిలో స్నానమాచరించి తదుపరి స్వామివారిని దర్శించుకుని సత్యనారాయణ స్వామి వ్రతములు ఆచరించారు. సాయంకాలము నిత్య కార్తీక దీపోత్సవంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో "పూర్ణకుంభ"ఆకృతిలో దీపాలంకరణ చేసి స్వామివారికి నీరాజన సేవ, ఆకాశదీపారాధన జరిపించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ పాలకవర్గం, సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు.



బాధిత కుటుంబాలను

పరామర్శించిన పద్మా దేవేందర్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 12:- నిజాంపేట మండలం నస్కల్ గ్రామానికి చెందిన లాలాగౌడ్ విద్యుత్ షాక్ తో మంగళవారం మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను బుధవారం మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి, మండల నాయకులతో కలసి పరామర్శించారు. లాలాగౌడ్ మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం బచ్చురాజు పల్లి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ మల్లేశం తండ్రి ఎర్ర మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పద్మదేవేందర్ రెడ్డి బచ్చురాజు పల్లి చేరుకొని మల్లయ్య మృతదేహానికి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, మనోధైర్యాన్ని తెలిపారు. వీరి వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ సంపత్, నిజాంపేట పీఏసీఎస్ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు అబ్దుల్ అజీజ్ గౌస్, నాయకులు యాదగిరి, వెంకటస్వామి గౌడ్, నరేందర్ నాయక్, సుభాష్ నాయక్, పత్తి నాయక్, రాజు, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.



ఆర్టీసీ బస్టాండ్‌లో మదర్ ఫీడింగ్ రూం ఏర్పాటు

- ప్రారంభించిన లేడిస్ సర్కిల్ ఇండియన్ నేషనల్ ప్రెసిడెంట్ శీసం సభర్వాల్

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 12: మహిళలు, శిశువుల సంక్షేమం, అభివృద్ధి కోసం తమ వంతు సహకారం అందిస్తున్నామని లేడిస్ సర్కిల్ ఇండియన్ నేషనల్ ప్రెసిడెంట్ శీసం సభర్వాల్ తెలిపారు. సికింద్రాబాద్ లేడిస్ సర్కిల్ 17 స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, ఇతర ఎన్జీవోస్ సహకారంతో సిద్దిపేట న్యూ ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన మదర్ ఫీడింగ్ రూంను బుధవారం ఆమె చైర్‌పర్సన్ భావన సుమన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శీసం సభర్వాల్ మాట్లాడుతూ లేడిస్ సర్కిల్ 17 పేరుతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు దేశంలోని 20 పట్టణాల్లో 79 మదర్ ఫీడింగ్ రూములు ఏర్పాటు చేశామని, సిద్దిపేటలో ప్రారంభించిన ఈ రూం 80వది కావడం విశేషమని తెలిపారు. ఈ ఏడాది తమ మోటో "వుమెన్ ఎంపవర్‌మెంట్" అని పేర్కొన్నారు. మహిళలకు వ్యాపారం చేయడం, ఉపాధి అవకాశాలు పొందడం కోసం శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్య, వైద్యం, పేదల సంక్షేమం వంటి రంగాల్లోనూ అనేక సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వివరించారు. అదే విధంగా అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని రామేశ్వరంపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని 44మంది విద్యార్థినిలకు ఉచిత సైకిళ్లను పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో లేడిస్ సర్కిల్ 17 చైర్‌పర్సన్ భావన సుమన్, ప్రతినిధులు మాల్విక, రిమా, నేహా, శివాని, దీప, సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ భవభూతి, తదితరులు పాల్గొన్నారు.



సమిష్టి కృషితో బాల్య వివాహాలను అరికట్టాలి

- అవగాహన సదస్సులో వక్తల వెల్లడి

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 12: బాల్య వివాలను అరికట్టడానికి సమిష్టి కృషి అవసరమని అధికారులు హితవు పలికారు. బుధవారం చేగుంట మండల పరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జరిగిన బాల్య వివాహాల అవగాహన సదస్సులో ఎంపీడీవో చిన్నారెడ్డి తహసిల్దార్ శివ ప్రసాద్ ఎస్సై చైతన్య రెడ్డి ఎంఈఓ నీరజ సిడిపిఓ స్వరూప రాణి పాల్గొని మాట్లాడారు. బాల్యవివాహాల రహిత మండలముగా చేగుంటను ప్రథమ స్థానంలో నిలుపవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లా పరిషత్ హై స్కూల్ లలో బాల్యవివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో బాల్య వ్యవహారం అరికట్టాలని వక్తలు సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో విసిపిసి కమిటీలతో బాల్యవివాలను అరికట్టాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు శైనీ సువర్ణ శ్యామల అంగన్వాడీ కార్యకర్తలు ఆరోగ్య సిబ్బంది ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



విద్యార్థులను దేశభక్తులుగా

తీర్చిదిద్దడమే లక్ష్యం

- ఏబీవీపీ రాష్ట్ర సహ సంఘటన కార్యదర్శి విష్ణువర్ధన్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 12: ప్రతి విద్యార్థిని దేశభక్తులుగా తీర్చిదిద్ది, సమాజ సేవలో భాగం చేయడమే ఏబీవీపీ లక్ష్యం అని ఏబీవీపీ రాష్ట్ర సహ సంఘటన కార్యదర్శి విష్ణువర్ధన్ తెలిపారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ సిద్దిపేట శాఖ ఆధ్వర్యంలో నగర అభ్యాస వర్గ నిర్వహించారు. అనంతరం నగర కార్యవర్గం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మెదక్ విభాగ్ సంఘటన మంత్రి లక్ష్మణ్, సిద్దిపేట మెదక్ జిల్లాల సంఘటన మంత్రి లక్ష్మీపతి, జిల్లా కన్వీనర్ ఆదిత్య, రాష్ట్ర హాస్టల్స్ కోకన్వీనర్ పవన్, వనవాసి కోకన్వీనర్ మరియు నగర కార్యదర్శి పరుశురాం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఫనిందర్ విద్యార్థులు పాల్గొన్నారు.



16 న నందిని సిద్ధారెడ్డి "నాగటి తరం" నవల ఆవిష్కరణ సభ

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 12: మంజీరా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 16న ఉదయం 10 గంటలకు కొండపాక మండలం బందారంలో ప్రముఖ కవి రచయిత నందిని సిద్ధారెడ్డి కలం నుంచి జాలువారిన "నాగటి తరం" నవల ఆవిష్కరణ సభ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్లో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మరసం ప్రతినిధులు కొమురవెల్లి అంజయ్య పప్పుల రాజిరెడ్డి, ఎన్. భగవాన్ రెడ్డి బోరెడ్డి, మధుసూదన్ రెడ్డి, పొన్నాల బాలయ్య, తోట అశోక్ , సిద్దెంకి యాదగిరి లు సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో తనదైన ముద్రను వేసిన నందిని సిద్ధారెడ్డి అనుభవాలనుంచి రచించిన ఈ నవల ఆవిష్కరణ సభకు ప్రముఖ సంపాదకులు, రచయిత బైస దేవదాసు అధ్యక్షత వహిస్తారని తెలిపారు. ప్రముఖ కవి వాసిరెడ్డి నవీన్ నవలను ఆవిష్కరిస్తారని, తెలంగాణ రచయిత సంఘం అధ్యక్షులు, కవి, రచయిత నాళేశ్వరం శంకరం నవలను సమీక్షిస్తారని తెలిపారు. సభలో ఆత్మీయ అతిథులుగా తెలంగాణ జేఏసీ పూర్వ చైర్మన్ దేవీప్రసాద్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు విరాహత్ అలీ, కవులు, రచయితలు నక్క యాదవ రెడ్డి, కందుకూరి శ్రీరాములు, టేకులపల్లి గోపాల్ రెడ్డి, కొమురవెల్లి అంజయ్య, సీహెచ్. బాల్ నర్సయ్య, కె. రంగాచారి, ఎన్. మల్లారెడ్డి, డా. సిద్దెంకి గిరి లు పాల్గొంటారని తెలిపారు. ఈ సభలో కవులు, విమర్శకులు, సాహిత్యాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. నందిని సిధారెడ్డి సృజనాత్మక దృక్కోణం, ఆలోచనా వైశాల్యం, నవలలో ప్రతిఫలించిన మానవతా స్ఫూర్తి గురించి వక్తలు విశ్లేషిస్తారని తెలిపారు. కవులు రచయితలు సాహిత్య అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఏసీబీకి పట్టుబడ్డ ఎస్సై, కానిస్టేబుల్

- ములుగు పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ దాడులు



ప్రతిపక్షం, గజ్వేల్ (ములుగు) నవంబర్ 12: నియోజకవర్గంలోని ములుగు మండల పోలీస్ స్టేషన్‌లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గత రాత్రి దాడులు నిర్వహించారు. ఓ కేసు పరిష్కారానికి సంబంధించి లంచం తీసుకుంటున్న ఎస్సై విజయ్‌కుమార్, కానిస్టేబుల్‌ను ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే ములుగు పరిధిలోని రాజీవ్ గృహకల్పంలో వ్యక్తికి కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను మరొకరు అక్రమంగా ఆక్రమించుకున్నారని ఓ వ్యక్తి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఈ కేసు పరిష్కారం కోసం ఎస్సై విజయ్‌కుమార్, కానిస్టేబుల్‌లు ఒక లక్ష లంచం డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగా ఫిర్యాదుదారుడు ముందుగా 50 వేల రూపాయలు ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. ఈ విషయం ఏసీబీకి ఫిర్యాదు చేయడంతో అధికారులు ముందస్తు సమాచారంతో పన్నాగం పన్ని, పోలీస్ స్టేషన్ వద్ద లంచం తీసుకుంటున్న సమయంలో ఇద్దరినీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ కేసులో ఎస్సై విజయ్‌కుమార్, కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

సమయం వృధా చేయకుండా ఒక లక్ష్యంతో చదవాలి

- మెనూ పాటించకుంటే చర్యలు తప్పవు
- ఆకస్మిక తనిఖీలలో జిల్లా కలెక్టర్




ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 12: . ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశములపై పట్టు సాధించాలని, సమయం వృధా చేయకుండా ఒక లక్ష్యం పెట్టుకుని చదవాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి విద్యార్థులకు సూచించారు. నియోజకవర్గ పరిధిలోని ములుగు మండలం క్షీరసాగర్ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ గత రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. వంట గదికి వెళ్ళి మధ్యాహ్న భోజన ప్రక్రియను పరిశీలిస్తూ రోజు వారి మెనూ ప్రకారం రుచికరంగా వంటలను వండాలని తెలుపుతూ, వంట గది పరిసరాలను పర్శిలించారు. వంటగదిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని వంట సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు చదువు, భోజనం విషయంలో ఎలాంటి కొరత లేకుండా చూసుకోవాలని ఉపాధ్యాయులకు తెలిపారు. అంతేకాకుండా పాఠశాల ప్రాంగణం శుభ్రంగా ఉంచుకోవాలని ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయులను ఆదేశించారు. తరగతి గదుల్లోకి వెల్లి విద్యార్థులు ఇబంధులు ఏమైనా ఉంటె, తిరిగి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని వంటిమామిడి గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అక్కడ మెనూ ప్రకారం కాకుండా అన్నం, ఒక కూర మాత్రమే వండినందుకు కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సాంబారు చేయకుండా ఒక్క కూర విద్యార్థులకు సరిపోతుందా అని ప్రిన్సిపల్ పై మండిపడ్డారు. తప్పనిసరిగా మెనూ ప్రకారం పాటించాలని లేనియెడల కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



18 రోజుల నిరీక్షణ.. స్వగ్రామానికి మృతదేహం

ప్రతిపక్షం, కొమురవెల్లి, నవంబర్ 12: కొమురవెల్లి మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన కొయ్యడ ఎల్లయ్య(57) బతుకుదేరువు కోసం సౌదీ అరేబియా వెళ్లి అక్కడ అక్టోబర్ 25న అనుమానస్పదంగా మృతి చెందిన విషయం మనకు తెలిసిందే. కాగా గత 18 రోజుల నిరీక్షణ తరువాత ఎల్లయ్య మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరింది. బంధువులు, స్నేహితుల రోదనాలు మిన్నంటాయి. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే దేశ రాజధాని ఢిల్లీలో బ్లాస్ట్ జరిగింది. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలి. నిందితులను కఠినంగా శిక్షించాలి. దేశ రాజధానిలో ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరం. ఇంటిలిజెన్స్‌బ్యూరో, సీబీఐ లాంటి ఏజెన్సీలు ఉన్నప్పటికీ బీజేపీ ప్రభుత్వం విఫలమైంది. దర్యాప్తు నివేదిక వచ్చాక మేం మరింత మాట్లాడతాం.

- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

ప్రాంతీయం



రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 12:- జిల్లాలో వరి ధాన్యం అమ్మిన రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించే విధంగా పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కొల్చారం మండలంలో విస్తృతంగా పర్యటించిన కలెక్టర్ ముందుగా సత్యసాయి రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుండి ఎన్ని లారీల ధాన్యం పంపించారు, వాటిని ఎప్పుడు దిగుమతి చేసుకున్నారు వంటి అంశాలను ఆయన క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. ఈ తనిఖీలో ధాన్యం సేకరణ, నిల్వ ప్రక్రియలపై ఆయన ఆరా తీశారు. రైస్ మిల్లులో ధాన్యం దించుకుంటున్న విధానాన్ని పరిశీలించారు. ఏ లారీ కూడా 24గంటలకు మించి వెయిటింగ్లో ఉండకూడదని అందుకు తగ్గట్టుగా రైస్ మిల్లర్లు హమాలీలని ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం వరిగుంతం పాక్స్ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి కొనుగోలు నిర్వహణ తీరు సంబంధిత వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో 82 వేల 481 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని 21,277 మంది రైతులకు గాను 54 కోట్ల 52 లక్షల రూపాయలను రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో , డిప్యూటీ తాసిల్దార్ నాగవర్ధన్, రెవెన్యూ సిబ్బంది, కొనుగోలు కేంద్ర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్‌లో 'హై అలర్ట్'

- కట్టుదిట్టమైన భద్రత.. 14 చోట్ల నాఖాబంధీ.. తనిఖీలు
- 6 ప్రాంతాల్లో ఔటర్ కార్డన్, 8 ప్రాంతాల్లో ఇన్నర్ కార్డన్ సెర్చ్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 12: జిల్లాలో ప్రజల రక్షణ, శాంతిభద్రతలు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కరీంనగర్ పోలీసులు భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు.దీనిలో భాగంగా, నగరంలోని కీలక ప్రాంతాలలో పోలీసులు విస్తృతస్థాయిలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీలో పట్టుబడిన వాహనాల వివరాలు డ్రంకెన్ డ్రైవ్ 34, ఈ చలాన్స్ విధించబడిన వాహనాలు 74, సరైన ధ్రువపత్రాలులేని 38 వాహనాల సీజ్ చేశారు. కరీంనగర్ అల్గునూర్ చౌరస్తా, బైపాస్, బొమ్మకల్ చౌరస్తా, రైల్వేస్టేషన్, రేకుర్తి చౌరస్తా, పద్మనగర్ బైపాస్ లతో పాటు నగరంలోని ప్రధాన కూడళ్ళలో గీతాభవన్ చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, భగత్ నగర్, నాఖా చౌరస్తా పలు చోట్ల ఏకకాలంలో పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలను ఆపి, వాటి పత్రాలను, వాహనదారుల గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాలను అరికట్టడానికి, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువుల కదలికలను గుర్తించడానికి ఈ తనిఖీలు ఎంతగానో ఉపయోగపడతాయని ఏసీపీ వెంకటస్వామి తెలిపారు.ఈ భద్రతా చర్యలకు వాహనదారులు, ప్రజలు సహకరించాలని కరీంనగర్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా పోలీసు కంట్రోల్ రూమ్ నంబర్ 8712670744 కు తెలియజేయాలని విజ్ఞప్తి చేసారు.ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామి, రూరల్ ఏసీపీ విజయ కుమార్ లతో పాటు వారి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



కార్డన్ సెర్చ్‌లో 67 వాహనాలు సీజ్

- తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ వెల్లడి

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 12: మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని కారణంగా 67 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. కంపెనీలో పని చేసే కార్మికులకు ఇండ్లు అద్దెకిస్తే ఆధార్ కార్డులు, ఫోన్ నెంబర్లు తీసుకోవాలన్నారు. ఇంటి పరసారాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే ఎలాంటి సంఘటనలు జరిగినా వెంటనే స్పందించే అవకాశాలుంటాయన్నారు. అధిక నేరాలలో ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు ఉంటున్నారని గుర్తు చేశారు. సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నందున వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని నరేందర్ గౌడ్ సూచించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ సీఐ రంగకృష్ణ, రామాయంపేట సీఐ వెంకట రాజాగౌడ్, మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్ గౌడ్, జాన్ రెడ్డి పాల్గొన్నారు.



బీసీ ఆక్రోష సభను విజయవంతం చేద్దాం

- బీసీ సంఘాల నాయకుల పిలుపు

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 12: 42% బీసీ రిజర్వేషన్ల సాధన సమితి, బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీల ఆధ్వర్యంలో ఈ నెల 15న కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే బీసీ ఆక్రోశ సభను విజయవంతం చేయాలని సంఘ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించి భారత రాజ్యాంగంలో తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చే ప్రక్రియలో నిజాయితీ లేకుండా తప్పుడు జీవో ల ద్వారా బీసీ ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఖరికి నిరసనగా, బీసీలను నిర్లక్ష్యం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ప్రజల ఆక్రోష సభని నిర్వహించడం జరుగుతున్నదన్నారు. ఈ ఆక్రోశ సభకు జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ కుల సంఘాల నాయకులు, మేధావులు, విద్యావంతులు అధిక సంఖ్యలో తరలి వచ్చి సభని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు బోయిని సదన్ మహారాజ్, పౌర హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు రాగుల భూపతి, న్యాయవాదులు దేవునూరి రవీందర్, రాము యాదవ్ బీసీ ఎస్సీ ఎస్టీ జాక్ నాయకులు, డి బి రాజు, రాజశేఖర్, బాబు పాల్గొన్నారు.

అదృష్టం దూరమై.. ఆశ్రయం కరవై

- మర్పడగ గ్రామానికి చెందిన దబ్బెర రేణుక కష్టాలు
- మానవత్వం కావాలి ఆధారం



ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్ (కొండపాక), నవంబర్ 12: కొండపాక మండలంలోని మర్పడగకు చెందిన దబ్బెర రేణుక పట్ల విధి చిన్న చూపు చూస్తోంది. ఆమె జీవితం నిరంతర పరీక్షగా మారింది. ఏడేళ్ల కిందట భర్తను కోల్పోయింది. ఇంటి పెద్ద దిక్కు చనిపోవడంతో ఇద్దరు చిన్నారులు రోహిత్, కార్తీక్ లతోజీవన పోరాటం మొదలు పెట్టింది. కూలి పనులు చేస్తూ పిల్లలను పోషిస్తోంది. కష్టాలు పడుతూ పిల్లలను చదివిస్తోంది. అయినా రేణుకను సమస్యలు వెంటాడుతున్నాయి. గ్రామ పెద్దలు ఇచ్చిన 60 గజాల స్థలంలో తాత్కాలికంగా గుడిసె కట్టుకొని రోజువారీ కూలీ పనులు చేస్తూ ఇద్దరు పిల్లలను చదివిస్తూ బతుకు వెళ్లదీస్తోంది. గత శనివారం (ఈ నెల 8న) బోనాల వేడుక సమయంలో ప్రమాదవశాత్తు గుడిసె మంటల్లో కాలి బూడిదైంది. చుట్టుపక్కల వారు మంటలు ఆర్పి వేసి రేణుక, ఆమె పిల్లల ప్రాణాలను రక్షించారు. ప్రాణాలు దక్కినా ఆశ్రయం లేకుండా పోయింది. గత జూన్ నెలలో గాలి వానలతో గుడిసె కూలిపోయింది. అప్పట్లో రెవెన్యూ అధికారులు పంచనామా చేసినప్పటికీ సహాయం మాత్రం అందలేదు. మళ్లీ అదే దురదృష్టం వెంటాడింది. ఇప్పుడు గుడిసె కాలిపోయింది. దీంతో తల్లీ పిల్లలు కట్టుబట్టలతో వీధిలో ఉండాల్సిన పరిస్థితి కలచివేస్తోంది. చలికాలం మొదలవడంతో గుడిసె కూడా లేక కష్టాల్లో మునిగిపోయారు. తొమ్మిది సంవత్సరాల వయసు ఉన్న పెద్ద కొడుకు ఆటో ప్రమాదంలో గాయపడి మంచం పట్టాడు. విషయం తెలుసుకున్న స్త్రీ జాగరణ సమితి అధ్యక్షురాలు లక్కిరెడ్డి విజయ రేణుకను కలిసి ఆత్మస్థైర్యం ఇచ్చారు. ప్రభుత్వ సహాయం ఆలస్యం అవుతుందేమో కానీ, మానవత్వం ఆలస్యం కాకూడదని రేణుక కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు రావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రేణుకకు తక్షణ సహాయం అందించేందుకు స్థానిక రెవెన్యూ అధికారులు 10 కిలోల బియ్యం, నూనె, పప్పు వంటి అవసరమైన నిత్యావసర సరుకులు అందించారు. సిద్దిపేట జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు ఇర్రి ఉమా సురేష్ రెడ్డి ముందుకు వచ్చి రేణుకకు అవసరమైన సరుకులు అందించి మానవత్వాన్ని చాటారు. "రేణుకకు సురక్షితమైన గూడు నిర్మించడమే ఇప్పుడు అత్యవసరం. ఇసుక, రేకులు, సిమెంట్ లేదా ఆర్థిక సాయం రూపంలో వీలైనంత సహాయం అందించి రేణుక కుటుంబానికి మళ్లీ బతుకు దీపం వెలిగించండి" అని స్త్రీ జాగరణ సమితి అధ్యక్షురాలు లక్కిరెడ్డి విజయ విజ్ఞప్తి చేశారు. శీతాకాలంలో చలికి తాళలేని ఈ తల్లీ పిల్లలకు మానవత్వంతో చేయగల చిన్న సహాయం వారికీ పెద్ద ఆశ్రయం అవుతుందన్నారు. సహాయం చేయాలనే వారు ఫోన్ పే..9949579637 లేదా బ్యాంక్ ఖాతా 3985638871, ఐఎఫ్ఎస్సీ కోడ్: CBINO283358, సెంట్రల్ బ్యాంక్, సిద్దిపేట బ్రాంచి ద్వారా ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

> **సహాయం చేయాలనే వారు**
> **ఫోన్ పే..9949579637 లేదా బ్యాంక్ ఖాతా 3985638871, ఐఎఫ్ఎస్సీ కోడ్: CBINO283358, సెంట్రల్ బ్యాంక్, సిద్దిపేట కు సహాయాన్ని అందించవచ్చు.**



ఇసుక అక్రమ తవ్వకాలను సహించేది లేదు

- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 12:- మెదక్ నియోజకవర్గంలో అక్రమంగా ఇసుక తవ్వకాలను సహించేది లేదని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ స్పష్టం చేశారు. అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే మెదక్ ఎస్పీ, డీఎస్పీతో పాటు రెవెన్యూ అధికారులకు కూడా ఆదేశాలు జారీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఇకపై జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని ఆయన స్పష్టమైన సూచనలు ఇచ్చారు. గత 10 సంవత్సరాలుగా బీఆర్ఎస్ నేతలు ఇసుక అక్రమ తవ్వకాలు నిర్వహించారని, హరీష్ రావు కూడా మెదక్ నుండి పెద్ద ఎత్తున ఇసుక దోపిడీ చేశారని ఆరోపించారు.



14న పటేల్ జయంతి సందర్భంగా భారీ ర్యాలీ

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశం గౌడ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్12:- ఈ నెల 14న భారత ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో రన్ ఫర్ యూనిటీలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశం గౌడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం మెదక్ జూనియర్ కాలేజ్ నుండి ప్రారంభమై రాందాస్ చౌరస్తా వద్ద ముఖ్య నాయకుల ప్రసంగంతో ముగిస్తుందని తెలిపారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిథిగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు హాజరుకానునట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్‌గౌడ్, జనగామ ప్రబారి నందా రెడ్డి, జిల్లా కార్యదర్శి బాదే బాలరాజు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్‌రెడ్డి, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు గడ్డం కాశీనాథ్, జిల్లా నాయకులు బాలరాజ్, సిద్ధిరాములు, యువమోర్చా నాయకులు శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షులు నాయిని ప్రసాద్, శ్రీనివాస్, నవీన్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శులు ఆంజనేయులు, శ్యామ్, ప్రవీణ్ రాజ్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయస్థాయి కథల పోటీల విజేత కీర్తన

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 12 బాలల దినోత్సవం పురస్కరించుకుని తెలంగాణ సారస్వత పరిషత్ నిర్వహించిన జాతీయ స్థాయి కథల పోటీలలో మెదక్ జిల్లా హవేలీ ఘణపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థిని కీర్తన ప్రథమ బహుమతికి ఎంపికైనట్లు తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి జె.చెన్నయ్య తెలిపారు. ఈ నెల 23న హైదరాబాద్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో కీర్తనకు రూ.2 వేల నగదుతో పాటు మెమొంటో, ప్రశంసాపత్రం అందజేస్తామని చెన్నయ్య పేర్కొన్నారు. జాతీయ స్థాయి కథల పోటీలో ప్రథమ బహుమతికి కీర్తన ఎంపిక కావడం పట్ల ప్రధానోపాధ్యాయులు ఆడెపు కరుణాకర్ అభినందించారు. విద్యార్థులలో సాహిత్య సృజనకు పాటుపడుతున్న తెలుగు ఉపాధ్యాయులు ఉండ్రాళ్ల రాజేశం, నల్ల అశోక్, ఎల్లమ్మలను అభినందించారు.



ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 12: జిల్లాలో కొనుగోలు కేంద్రాల నిర్వహణపై నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్ర నిర్వాహణపై అదనపు కలెక్టర్ నగేష్, సివిల్ సప్లై మార్కెటింగ్, వ్యవసాయ, సహకార శాఖ, డీఆర్డీఏ, అధికారులతో కలసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అధికారులు నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షించాలని, జిల్లాలోప్రస్తుతం వాతావరణ అనుకూల ప్రభావంగా ఉన్నందున కొనుగోలు వేగం పుంజుకుని రైతులకు లబ్ది చేకూర్చాలన్నారు. రైస్ మిల్లుల వద్ద ఒక రెవెన్యూ ఆఫీసర్ నియమించి లారీల దిగుమతి పర్యవేక్షణ చేసే విధంగా కార్యాచరణ తయారు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీలను పెంచి వేగంగా కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్స్ ఉన్న మండలాలలో రైతులు ధాన్యం శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రవాణా లారీల విషయంలో సంబంధిత ట్రాన్స్పోర్ట్ అధికారులతో సమన్వయంతో ముందుకు పోవాలన్నారు. సీఎంఆర్ పెండింగ్ విషయంలో పౌరసరఫరాల అధికారులు దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్, జిల్లా పౌర సరఫరాధికారి నిత్యానంద్, డీఎం సివిల్ సప్లై జగదీష్, మార్కెటింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రణభేరి మహాసభ విజయవంతం చేయాలి

- మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి. చెన్నయ్య



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 12: రణభేరి మహాసభ విజయవంతం చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి. చెన్నయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు నవంబర్ 23న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియం మైదానంలో జరగనున్న మాలల రణభేరి మహాసభ కర పత్రాన్ని సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో రాష్ట్ర అధ్యక్షుడు రాయలే బూరుగుల వెంకటేశ్వర్లతో కలసి మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి. చెన్నయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ తర్వాత రోస్టర్ పాయింట్ల కేటాయింపులో 5శాతం కేటాయించిన గ్రూప్-3లోని మాలలకు 1శాతం ఉన్న గ్రూప్-1 కులాల కంటే విద్య, ఉద్యోగాల్లో తక్కువ అవకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు.ఈ అన్యాయంపై ప్రశ్నిస్తూ, ఎస్సీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ శాతం పెంచడం, ఎస్సీ కార్పొరేషన్ రుణాల మంజూరు, మాల కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యికోట్ల నిధుల కేటాయింపు, అలాగే మాలల సామాజిక భవనం ఏర్పాటు వంటి డిమాండ్ల సాధన కోసం రణభేరి మహాసభలో ప్రభుత్వాన్ని ప్రశ్నించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా సీనియర్ నాయకులు పురుషోత్తం మాట్లాడుతూ... మండలాల వారీగా మాలలను చైతన్యపరచి మహాసభకు భారీగా హాజరయ్యేలా చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి ర్యాలీగా వెళ్లి పూలమాలలు అర్పించారు.ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు జంజీరపు ఎల్లేష్,జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మల విజయ్, జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు పాకనాటి రాజు, గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షుడు కమ్మవారి రమేష్, సంయుక్త కార్యదర్శి ఎం. ఎల్లేష్, వైస్ ప్రెసిడెంట్ మెరుగు వై.ఎస్., సీనియర్ నాయకులు మంద పాండు, బొమ్మల ప్రవీణ్, దుబ్బాక అధ్యక్షుడు పాకనాటి సునీల్, పట్టణ ప్రధాన కార్యదర్శి దువల వంశీ, ఉపాధ్యక్షులు సందీప్, మధు శేఖర్, వెంకటయ్య, నరసింహులు, బొమ్మల సాయి, సుకూరి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

“



కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నాం.మేడిగడ్డ కూలిపోవడానికి, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లో లీకేజీలకు తప్పుడు నిర్ణయాలు, సాంకేతిక లోపాలే ప్రధాన కారణమని ఎన్డీఎస్ఏ పేర్కొంది. 15--20 రోజుల్లో నీటి నిల్వలు తగ్గిన వెంటనే జియో ఫిజికల్, హైడ్రాలిక్ టెస్టులు నిర్వహిస్తాం.
- మంత్రి ఉత్తమ్

ప్రాంతీయం

అంగన్వాడీల్లో సేవలపై విస్తృత అవగాహన కల్పించాలి

- పౌష్టికాహారం ఇవ్వాలి.. ఉత్తమ సేవలు అందించాలి
- మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్
- హాజరైన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల, నవంబర్ - 12: అంగన్వాడీ కేంద్రాల్లో అందించే అన్ని సేవలపై విస్తృత ప్రచారం కల్పించాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్ ఆదేశించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖపై సంబంధిత అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి కార్యదర్శి అనిత రామచంద్రన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో పోషణలోపంతో బాధపడుతున్న వారి వివరాలు అధికారులను తెలుసుకున్నారు. పోషణ లోపంతో బాధపడుతున్న వారికి అందించాల్సిన సేవల గురించి అందుతున్న సేవల స్థితిగతులపై ఆరా తీశారు. అలాగే ప్రభుత్వం తరపున అందిస్తున్న ఆహార పదార్థాలు సక్రమంగా చేరుతున్నాయా లేదా అనేది పరిశీలించారు. అలాగే సూపర్వైజర్ లను అడిగి వారి సమస్యలపై ఆరా తీశారు. అంగన్వాడీలలో పిల్లల హాజరు శాతం పెంచడానికి చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. ప్రతి వారం ఎగ్ బిర్యానీ పెట్టాల్సిందిగా ఆదేశించారు. అలాగే గర్భిణీలకు ప్రతి అంగన్వాడికి రెండు చొప్పున బెంచీలు అందిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే పోషన్ ట్రాకర్, ఎన్ హెచ్ టి ఎస్ అప్ లలో లబ్ధిదారుల సంఖ్యను పోల్చి చూసి పరిశీలించారు. సఖి ద్వారా అందుతున్న సేవలను తెలుసుకున్నారు. అలాగే అందరూ వారి కాళ్ళ మీద వాళ్ళు నిలబడడానికి అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి నైపుణ్య శిక్షణ ఇవ్వవలసిందిగా ఆదేశించారు. బాల్యవివాహాలు జరగకుండా గ్రామాలలో భేటీ బచావో బేటి పడావో ద్వారా ప్రత్యేక కళాజాత కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులపై ప్రతి కార్యాలయంలో తప్పనిసరిగా ఇంటర్నల్ కమిటీ లను ఏర్పాటు చేయాలని, వారందరికీ చట్టం పైన శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దివ్యాంగులకు వయోవృద్ధులకు ఉపకరణాలు పరికరాలు అందించాలని సూచించారని తెలిపారు. ఎంతో శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. అలాగే ప్రస్తుతం జరిగిన క్యాంపుల వివరాలను పరిశీలించి విజయవంతం కావడానికి కృషిచేసిన సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించబోతున్న డేకేర్ సెంటర్ గురించి అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగులకు, వయోవృద్ధులందరికీ పరికరాలు అందించాలని సూచించారు. అలాగే ప్రభుత్వ వయోవృద్ధుల ఆశ్రమాన్ని సందర్శించి వారికి ఎలాంటి వసతులు అందుతున్నాయి అని ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్జెడి ఝాన్సీ, జిల్లా సంక్షేమ అధికారి పీ లక్ష్మీరాజం, సిడిపివోలు ఉమారాణి, సౌందర్య, డిహబ్ కోఆర్డినేటర్ రోజా, డిసిపిఓ కవిత, సఖి కోఆర్డినేటర్ మమత, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ బాలకిషన్, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త చెరువు ఆవరణ శుభ్రంగా ఉండాలి

- డంప్ యార్డులో తడి, పొడి చెత్త వేరు చేయాలి
- అవసరమైన యంత్రాలు, పరికరాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- అన్ని అమ్మకాలు రైతు బజార్లో జరగాలి
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల, నవంబర్ -12: సిరిసిల్ల పట్టణంలోని కొత్త చెరువు ఆవరణ శుభ్రంగా ఉండాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని కొత్త చెరువును ఇంచార్జి కలెక్టర్ బుధవారం పరిశీలించారు. చెరువు కట్ట పైకి వెళ్లి, పరిసరాలు సందర్శించి, అధికారులకు పలు సూచనలు చేశారు. చెరువు పరిసరాలు మొత్తం శుభ్రం చేయాలని, చెత్తాచెదారం, చెట్లు తొలగించాలని సూచించారు. ఇక్కడ అవసరమైన యంత్రాలు, సామగ్రిపై ప్రతిపాదనలు పంపాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. పట్టణ ప్రజలు పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా తీర్చిదిద్దాలని సూచించారు.

నిర్వహణ సక్రమంగా చేపట్టాలి

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు వద్ద ఉన్న డంపింగ్ యార్డ్ ను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సందర్శించారు. తడి, పొడి చెత్త వేరు చేసే విధానం, ఆవరణ పరిసరాలు పరిశీలించారు. నిర్వహణ సక్రమంగా చేపట్టాలని అన్నారు. కంపోస్ట్ షెడ్ ను పరిశీలించి కంపోస్ట్ తయారీ వివరాలను ఆరా తీశారు. డంపింగ్ యార్డుకు కావాల్సిన యంత్రాలు, పరికరాలకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.

రైతు బజార్ లోనే విక్రయాలు చేయాలి

సిరిసిల్ల పట్టణంలోని రైతు బజార్ లో చికెన్, మటన్, చేపలు, కూరగాయల విక్రయాలు పూర్తి స్థాయిలో ఇక్కడే చేసేలా ఏర్పాట్లు చేయాలని ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు. రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కూరగాయల షెడ్ ను పరిశీలించారు. స్లాటర్ హౌస్ నిర్మించి, చికెన్, మటన్, చేపలు విక్రయాల పూర్తి స్థాయిలో చేసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరిశీలనలో సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారెడ్డి, సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, డీవీహెచ్ఓ రవీందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ మహేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



దళారుల చేతుల్లో మోసపోవద్దు

- పత్తి రైతులకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి పిలుపు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 12: దళారుల చేతుల్లో రైతులు మోసపోవద్దని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం బెజ్జంకి మండలం ముత్తన్నపేట గ్రామంలో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి మాట్లాడుతూ పత్తి రైతులు దళారుల బారిన పడకుండా ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పంట ఉత్పత్తులు విక్రయించాలని కోరారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం వర్షాల కారణంగా పత్తి దిగుబడి తగ్గిందని, ఈ క్రమంలో ప్రైవేటు వ్యాపారులు ,దళారులకు పత్తి విక్రయించకూడదన్నారు. ప్రభుత్వం గత సంవత్సరం కన్నా ఈ ఏడాది పత్తికి మద్దతు ధర పెంచినందుకు ఈ అవకాశాన్ని పత్తి రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. అయితే నాణ్యమైన పత్తికే ధర పలుకుతుందనే విషయాన్ని రైతులు గమనించాలన్నారు. పత్తి కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం కొన్ని మార్పులు చేసిందని, పత్తి రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు పడాల్సిన రాకుండా ఉండేందుకు స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశ పెట్టిందని ఆయన చెప్పారు.సాంకేతిక విధానంలో వివరాలు నమోదు చేసుకోవాలని, ఈ వివరాలను ప్రత్యేక యాప్ లోని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ద్వారా నమోదు చేయించాలన్నారు. ఆ తర్వాతనే యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. పత్తి సేకరణ, చెల్లింపులన్నీ డిజిటల్ ట్రాకింగ్ ద్వారా పర్యవేక్షించడానికి ఈ యాప్ ఉపకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ,వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మచ్చ కుమార్, బోనాల రాజేశం, పులి సంతోష్, బైర సంతోష్, గూడెల్లి శ్రీకాంత్, చెప్యాల శ్రీనివాస్ గౌడ్, పర్ష సంతోష్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డు గ్రహీతను సన్మానించిన ట్రస్మా

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 12 : స్వాతంత్ర సమరయోధులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి జాతీయ విద్యా దినోత్సవం,రాష్ట్ర మైనార్టీల సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ మైనార్టీ శాఖ మాత్యులు మహమ్మద్ అజహర్ ఒద్దిన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్ బిన్ అందాన్ చేతుల మీదుగా నిర్మల్ జిల్లా సియాసత్ ఉర్దూ పత్రిక సీనియర్ జర్నలిస్ట్ సయ్యద్ జలీల్ ఆజహర్ ఉత్తమ ఉర్దూ భాష సేవ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ట్రస్మా నిర్మల్ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ పూల మాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమరవేణి నర్సాగౌడ్, ట్రస్మా రాష్ట్ర కమిటీ నాయకులు షేక్ షబ్బీర్ అలీ, మోకుదెబ్బ జిల్లా అధికార ప్రతినిధి పీసర శ్రీనివాస్ గౌడ్,మైనార్టీ నాయకులు అజ్మత్ ఖాన్, అర్షద్ అలీ, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక మద్దతు పథకాల లక్ష్య సాధనకు బ్యాంకర్లు సహకరించాలి

- రూ.7821.19 కోట్ల రుణాలు మంజూరు
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- బ్యాంకర్లు , జిల్లా అధికారులతో సమావేశం



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 12: ఆర్థిక మద్దతు పథకాల లక్ష్య సాధనకు బ్యాంకర్లు సహకరించాలని, కచ్చితంగా ఆర్బీఐ నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ కలెక్టరేట్ సమావేశం మందిరంలో బ్యాంకర్లు , జిల్లా అధికారులతో రైతులకు రుణాల పంపిణీ, స్వయం సహాయక సంఘాల రుణాలు, రికవరీ, పీఎం జి.పి.వై. రుణాలు, ఎస్సీ, బిసి, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖల పథకాలకు సంబంధించి రుణ లక్ష్య పురోగతిపై డీసీసీ, డీఎల్ఆర్సీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ ఆర్థిక మద్దతు పథకాల లక్ష్యసాధనకు రుణాలు అందించడంలో బ్యాంకర్లు పూర్తిస్థాయిలో సహకరించాలని సూచించారు. వివిధ ఆర్థిక మద్దతు పథకాలకు సంబంధించి వంద శాతం లక్ష్యసాధనకు బ్యాంకర్లు, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.రైతులు తమ రుణాలను రెన్యూవల్ చేసుకునే అంశం పై వారికి అవగాహన కల్పించాలని, జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ బ్యాంకర్లు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని తెలిపారు.202526 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 2025 నుండి సెప్టెంబర్ 2025 నెల వరకు రూ. 7821.19 కోట్ల రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా వ్యవసాయం మరియు వ్యవసాయ అనుబంధ రంగాలకు గాను రూ. 3239.73 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగంలో రూ. 1761.41 కోట్లు, విద్యా రుణాలకు రూ. 9.70 కోట్లు, హౌసింగ్ లోన్స్ రూ. 99.89 కోట్లు మహిళా సంఘాలకు రూ.614.36 కోట్లు మరియు ఇతర రంగాలకు సంబంధించి రూ.2096.10 కోట్లు రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. అర్హులైన రైతులు అందరికీ రుణాలు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.

యోగా క్రీడాకారులకు జిల్లా కలెక్టర్ అభినందన

రంగారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి యోగాసనా క్రీడా పోటీలలో ఓవరాల్ చంపియన్షిప్ సాధించిన కరీంనగర్ జిల్లా క్రీడాకారులని జిల్లా కలెక్టర్ పమేల సత్పతి అభినందించారు. ఈనెల 9న రంగారెడ్డి జిల్లాలోని ఎస్ఎంపి అంతర్జాతీయ పాఠశాలలో తెలంగాణ యోగ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కరీంనగర్ క్రీడాకారులు అద్వితీయ ప్రతిభ కనబరిచి 83 పాయింట్ల తో ఓరల్ ఛాంపియన్షిప్ సాధించారు. ఈ పోటీలో ఐదుగురు స్వర్ణ పథకాలు నలుగురు రజత పథకాలు నలుగురు కాంస్య పథకాలు సాధించిన క్రీడాకారులను బుధవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రస్థాయి యోగాలో జిల్లా కీర్తిని దశాబ్దాలుగా ఆధిపత్యాన్ని కొనసాగించడం విశేషం అన్నారు.



పోలంపల్లిలో 'బండి' సైకిళ్ల పంపిణీ

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 12: పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ ఉచితంగా ఇస్తున్నటువంటి సైకిళ్లను బుధవారం పోలంపల్లి పాఠశాలలో పంపిణి చేసారు. స్థానిక బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా హాజరైన బీజేపీ మండల అధ్యక్షులు జగదీశ్వర చారి మాట్లాడుతూ సైకిళ్లే కాకుండా 10వ తరగతి పరీక్షల ఫీజులను కూడా కేంద్ర మంత్రే చెల్లించడం చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఇంచార్జ్ మండల విద్యాధికారి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు కరుణాకర్, ఉపాధ్యాయ సిబ్బంది, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, ఉపాధ్యక్షులు వొద్నాల రవీందర్, పడాల శ్రీనివాస్ గౌడ్, పడాల సారయ్య, రాపర్తి రవీందర్, బుడిగే మహేష్, బుడిగే నరేష్, కాశవేణి రాజు, పచ్చిమట్ల మల్లయ్య, పడాల తిరుపతి, రేగూరి సుగుణాకర్, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రెడ్డి మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



దస్తగిరి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే చందర్

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 12: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గోదావరిఖని ప్రెస్ క్లబ్ బాయ్ దస్తగిరి కుటుంబాన్ని బుధవారం సాయంత్రం రామగుండం మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ పరామర్శించారు. 30 సంవత్సరాలుగా గోదావరిఖని ప్రెస్ క్లబ్లో బాయ్ గా దస్తగిరి పని చేస్తు ఇక్కడి రాజకీయ నాయకుల అందరితో అభిమానంతో మేలిగారని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గుర్తుచేశారు. దస్తగిరి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో దస్తగిరి కుటుంబ సహాయ నిధికి చందర్ 10 వేల రూపాయలు అందజేశారు. దస్తగిరి సహాయ నిధికి 10 వేలు అందించిన మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కి ప్రెస్ క్లబ్ కార్యవర్గం దన్యవాదలు తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు నూతి తిరుపతి తదితరులున్నారు.



పారామెడికల్ సిబ్బందికి ప్రమోషన్స్ ఇవ్వాలి

- ఏసీఎంఓ ద్వారా సీఎంఓ కు వినతి పత్రం

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 12: రామగుండం సింగరేణి ఏరియా హాస్పిటల్ లో మిగతా పారామెడికల్ కేడర్స్ అయిన ఫార్మసిస్టులు, రేడియోగ్రాఫర్స్, సిటీ స్కాన్ టెక్నీషియన్స్, ల్యాబ్ టెక్నీషియన్స్, ఫిజియోథెరపీ డైటీషియన్,రిఫ్రాక్షర్స్ లకు కూడా ప్రమోషన్స్ ఇప్పించాలని బుధవారం హాస్పిటల్ ఏసీఎంఓ అంబికా ద్వారా చీఫ్ మెడికల్ ఆఫీసర్ కు వినతి పత్రం పంపించాలని కోరారు. ఈ సందర్భంగా పారామెడికల్ సిబ్బంది మాట్లాడుతూ సింగరేణి ఏరియా ఆసుపత్రి పారామెడికల్ సిబ్బంది ఇచ్చిన వినతి పత్రం ఇటీవల జరిగిన స్ట్రక్చర్ మీటింగ్లో మెడికల్ డిపార్ట్మెంట్ నర్సింగ్ సిబ్బందికి ఆఫీసర్ పదోన్నతులు కల్పిస్తూ ఏ గ్రేడ్ లోని ఐదు సంవత్సరాలు గడిచిన సిబ్బందికి ఈ గ్రేడ్ ప్రమోషన్స్ ఇచ్చినట్లు సింగరేణి యాజమాన్యాన్ని గుర్తింపు కార్మిక సంఘం ఒప్పించిందని అన్నారు. మిగతా పారామెడికల్ కేడర్స్ అయినా ఫార్మసిస్టులు, రేడియోగ్రాఫర్స్ సిటీ స్కాన్స్ తదితర టెక్నీషియన్స్ ప్రమోషన్లు కల్పించాలని వారు సీఎంఓ ను కోరారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంఓ డా. అంబిక, డా.ప్రసన్న, డీవైసీఎంఓ శ్రీనివాస్, సీనియర్ పీఓ మురళి, పారా మెడికల్ సిబ్బంది యాదవ రెడ్డి, బీడీ శాస్త్రి, ముక్తార్, బాలచందర్, సుచరిత, వెంకటేశ్వర్లు, పద్మలత, రత్నమాల, శ్రీనివాస్, హెప్సీ హెలెన్, శ్రీనివాస్, సంపత్, ఎక్రే, ల్యాబ్, సిటి స్కాన్ ఫిజియోథెరపీ, ఫార్మసిస్ట టెక్నీషియన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గుళ్లు కూల్చినోళ్లు తగిన మూల్యం చెల్లించక తప్పదు

- ప్రజల మనోభావాలను దెబ్బతీస్తే ఊరుకునేది లేదు
- ఎమ్మెల్యే పూర్తి బాధ్యత వహించాలి
- గుళ్లను కూల్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- రామగుండం మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు చందర్

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 12: రామగుండం పారిశ్రామిక ప్రాంత ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఈ ప్రాంతంలోని 46 మైసమ్మ, వేల్పులమ్మ అమ్మవారి దేవాలయాలను కూల్చినోళ్లు తగిన మూల్యం చెల్లించక తప్పదని, అధికారం ఉందని ఇష్టమొచ్చినట్లు చేస్తే చూస్తూ ఊరుకోమని రామగుండం మాజీ శాసనసభ్యులు,పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ తీవ్రంగా హెచ్చరించారు. బుధవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో వారం రోజుల క్రితం 46 మైసమ్మ గుళ్లను కూల్చివేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రామగుండంలో ప్రజాస్వామ్యం ఉందా అని ఆయన ప్రశ్నించారు. ఈ ఊరు ప్రజలు మైసమ్మ తల్లిని మొక్కే సంస్కృతి ఉందని, అమ్మవారిని అరాధించడం ఇక్కడి ప్రజలకు ఆనవాయితీగా వస్తుందని అందుకు విరుద్ధంగా ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా గుళ్లను కూల్చడం ఎంటనీ ఆయన ప్రశ్నించారు. కూల్చివేతలతో కాంగ్రెస్ పార్టీ కి సంబంధం లేనప్పుడు గుళ్ల నిర్మాణం ఎందుకు చేస్తున్నారని అన్నారు. పారిశ్రామిక ప్రాంతాన్ని ఏం చేయాలనుకుంటున్నారు.. మాట్లాడితే కేసులు పెట్టడం.. ఎదురు తిరిగితే దాడులు చేయడం ఇక్కడ పరిపాటిగా మారిపోయిందని అన్నారు. ఇక్కడి పోలీసు వ్యవస్థ ఎం చేస్తుందని, గుళ్లను కూల్చివారం రోజులైనా కూల్చిన వారిపై చర్యలేవని ప్రశ్నించారు. ఈ కూల్చివేతలు చేసింది సింగరేణా, మున్సిపాటీనా ప్రజలకు తెలుపాలన్నారు. రామగుండం ఎమ్మెల్యే ఈ ఘటన కు భాధ్యత తీసుకోవాలని, బాధ్యులు ఎవరైనా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో మున్సిపల్ ఆఫీస్,ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ జడ్పీటీసీ ఆముల నారాయణ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గోపు ఐలయ్య యాదవ్, బొడ్డు రవీందర్, మెతుకు దేవరాజు, నూతి తిరుపతి, మేడి సదానందం, దొమ్మేటి వాసు, సట్టు శ్రీనివాస్, జక్కుల తిరుపతి, వెంకట స్వామి, కోడి రామ కృష్ణ, చింటూ, కుమార్ నాయక్, అవునూరి వెంకటేష్, బచ్చల రాములు, శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ రిగ్గింగ్కు పాల్పడిందన్న బీఆర్ఎస్ ఆరోపణలు అర్థరహితం. రిగ్గింగ్ చేయడం పాజిబుల్ కాదు. ఇది పాత జమానా కాదు. బీఆర్ఎస్వాళ్లు ఓడిపోతున్నామనే బాధలో మాట్లాడుతున్నారు. మళ్లీ మేమే వస్తాం. హైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక ఎన్నికలపై ముందుకు వెళ్తాం. కేబినెట్ విస్తరణ ముఖ్యమంత్రి, అధిష్ఠానం చూసుకుంటుంది.

-పీసీసీ చీఫ్ మహేష్ కుమార్



మిని ట్యాంక్ బండ్ పనులు వేగవంతం చేయాలి

- మంత్రి వాకిటి శ్రీహరి

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 12: మిని ట్యాంక్ బండ్ పనులు వేగవంతం చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. మక్తల్ పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్ వద్ద మూడు కోట్ల 75 లక్షలతో సుందరీకరణ పనులను మంత్రి వాకిటి శ్రీహరి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ట్యాంక్ బండ్ వద్ద విశ్రాంతి భవనాలు, కాటేజీలు, వ్యాపార సముదాయాలు, టాయిలెట్లు, ఫ్లస్ వన్ కాంప్లెక్స్, 12 దుకాణాలు, యాత్రికుల విశ్రాంతికి 12 బెడ్లు నిర్మించాల్సి ఉందని, అందుకు త్వరగా పనుల్లో వేగవంతం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మంత్రి వాకిటి శ్రీహరి. కార్యక్రమంలో ఇంజినీర్ నాగ శివ, మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- మక్తల్ సీఐ రామ్ లాల్

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట, నవంబర్ 12: నారాయణపేట జిల్లా మక్తల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రామ్‌లాల్ ఆధ్వర్యంలో ఆటో, జీప్, బొలెరో ఇతర ట్రాన్స్‌పోర్ట్ వాహన డ్రైవర్లకు అవగాహన మరియు కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రామ్‌లాల్ మాట్లాడుతూ ఇటీవల కొన్ని ప్రాంతాల్లో వాహనాలు కెపాసిటీకి మించి ప్రయాణికులను తీసుకువెళ్తున్న ఘటనలు గమనించామని, ఇలాంటి చర్యలు డ్రైవర్లకూ, ప్రయాణికులకూ ప్రాణహానికరమని హెచ్చరించారు. ప్రతి డ్రైవర్ రోడ్డు భద్రత నియమాలు కచ్చితంగా పాటించాలి, వాహనాల సరైన మెయింటెనెన్స్ చేయాలి, మరియు ఓవర్‌లోడ్ చేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అలాగే మితిమీరిన వేగంతో వాహనాలు నడప రాదని తెలిపారు. ఇకపై వాహనాలలో ఎవరు కెపాసిటీకి మించి ప్రయాణికులను తీసుకువెళ్తే, వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, వాహనాలను సీజ్ చేయడమో మరియు లైసెన్స్ రద్దు చేయడము జరుగుతుందని సిఐ తెలిపారు. అలాగే ప్రజలు కూడా తమ ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని, ఓవర్‌లోడ్ వాహనాల్లో ప్రయాణించవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, డ్రైవర్ల సంఘ ప్రతినిధులు మరియు పలువురు వాహన డ్రైవర్లు పాల్గొన్నారు.




సుదర్శన్ రెడ్డి సన్మాన సభను విజయవంతం చేయాలి

- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 12 : ప్రభుత్వ ముఖ్య సలహాదారులుగా నియమితులైన సుదర్శన్ రెడ్డి మొదటి సారీ జిల్లాకు వస్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన సభ ను విజయవంతం చేయాలని రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ మాధవ్ నగర్ సాయిబాబా మందిరం నుండి బైక్ ర్యాలీ మధ్యాహ్నం 1లకు ప్రారంభం అవుతుందని, అక్కడి నుండి పాత కలెక్టర్ గ్రౌండ్ చేరుకుని మధ్యాహ్నం 2 గంటలకు భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. జిల్లాలో ఉన్న ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఇందులో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాను అభివృద్ధిలో ముందుకు తీసుకువెళ్లాలని సుదర్శన్ రెడ్డికి ముఖ్య సలహాదారులుగా నియమించారని, ఇందుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గతంలో సుదర్శన్ రెడ్డి మంత్రిగా జిల్లాకు ఎన్నో సేవలు చేసారని, నిరంతరం ప్రజల కోసం ఆలోచించే నాయకుడికి మంత్రి హోదా ఇవ్వడం సంతోషకర విషయమన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, పిసిసి ప్రధాన కార్యదర్శి రామ్ భూపాల్, మాజీ పిసిసి ప్రధాన కార్యదర్శి నాగేష్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, శ్రీనివాస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికి రెండు రోజుల ముందు వరుడు ఆత్మహత్య

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 12 : రెండు రోజులలో పెళ్లి పీఠాలు ఎక్కవలసిన వరుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. బుధవారం ఎడపల్లి మండలం మంగళపాడు గ్రామంలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి.పెళ్లి వేడుకకు సిద్ధమైన కుటుంబంలో వరుడు ఆత్మహత్య కు పాల్పడటం ఆ రెండు కుటుంబాలలో తీవ్ర విషాదం నింపింది. గ్రామానికి చెందిన ప్రతాప్ గౌడ్ (31) సోమవారం పొలానికి వెళ్లి వస్తానని చెప్పిన ఇంట్లోనుంచి సాయంత్రం అయిన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టూ పక్కల ఎంత తిరిగినా ఆచూకీ లభించలేదు. దాంతో కుటుంబ సభ్యులు ఎడపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. మంగళవారం రాత్రి ప్రతాప్ గౌడ్ గ్రామం శివారులోని ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఉండటాని స్థానికులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకొని బోరున విలపించారు. అతని పెళ్లి గురువారం జరగాల్సి ఉండగా ఆత్మ



హత్య వార్తతో అంతా విషాదంలో మునిగిపోయారు. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎడపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని బోధన్ ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం

- గ్రామీణంలో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు చర్యలు
- మంథని లో 44 లక్షలతో సింథటిక్ టెన్నిస్ కోర్టు ప్రారంభం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి శ్రీధర్ బాబు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్(మంథని),నవంబర్-12: నూతన ఆవిష్కరణ లకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి వర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం మంథని పట్టణంలో మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తో కలిసి మంథని డ్రీమ్ స్టార్ట్ కార్యాలయంలో టీ వర్క్స్ ఆధ్వర్యంలో ఆధునిక సాంకేతిక సంబంధించిన మైండ్ సెట్ మేకర్ పుస్తకాన్ని ఆవిష్కరించి, ఇంగ్లీష్ టు తెలుగు పుస్తకాలు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సూచించిన విధంగా పిల్లలు మంచి కలలు కని, వాటిని సాధించేందుకు కార్యాచరణ ప్రారంభించాలని మంత్రి సూచించారు. పిల్లల ఆలోచనలను పదును పెట్టేందుకు డ్రీమ్, స్టార్ట్, రైస్ సంస్థ కృషి చేస్తుందని అన్నారు. మంథనిలోని యువకులు నూతనంగా తయారు చేసిన వ్యవసాయ పవర్ ఫీడర్, ఆధునిక హెల్మెట్ తయారి వంటి ఆవిష్కరణలు చేసేందుకు ముందుకు రావడం సంతోషకరమని అన్నారు. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు మంథని లో టీ వర్క్స్ ఆధ్వర్యంలో డ్రీమ్, స్టార్ట్, రైస్ సంస్థ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.గ్రామీణ ప్రాంతంలో ఉన్న నైపుణ్యం వెలికి తీయడానికి ప్రభుత్వం పూర్తి తోడ్పాటు అందిస్తుందని అన్నారు. పెద్దపల్లి జిల్లాలో ఉన్న 20 పాఠశాలల్లో డ్రీమ్, స్టార్ట్, రైస్ సంస్థ ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని అన్నారు. డ్రీమ్, స్టార్ట్, రైస్ సంస్థ కార్యక్రమాలలో ఆసక్తిగా పాల్గొంటున్న విద్యార్థులకు హైదరాబాద్ లోనే టీ వర్క్ సందర్శనకు ఏర్పాటు చేయాలని కలెక్టర్ కు మంత్రి సూచించారు. అనంతరం మంథని పట్టణంలోని పోచమ్మ వాడలో వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. రైతులకు తూకంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టామని, 48 గంటలో బ్యాంకు ఖాతాలలో ధాన్యం డబ్బులు జమ చేస్తున్నామని అన్నారు. అంతకంటే ముందు మంథని జూనియర్ కళాశాలల ఆవరణలో 44 లక్షలతో నిర్మించిన సింథటిక్ టెన్నిస్ కోర్టును మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో టీ వర్క్స్ సీఈఓ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నన్నయ గౌడ్, ఆర్డీఓ. సురేష్, తహసిల్దార్, ఎంపిడిఓ, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రతి పైసా ప్రజా ప్రయోజనార్థం వినియోగించాలి

- రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

ప్రతిపక్షం జిల్లా ప్రతినిధి, నిర్మల్,నవంబర్ 12 : స్థానిక సంస్థలు ఆర్థికంగా బలోపేతం కావడం ద్వారానే గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం కమిషన్ చైర్మన్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో కమిషన్ సభ్యులు రమేష్, కార్యదర్శి కాత్యాయిని దేవి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, స్థానిక సంస్థల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధి వేగవంతం కావాలంటే స్థానిక సంస్థల ఆర్థిక స్థితి బలోపేతం కావడం అత్యవసరమని తెలిపారు. నిధుల వినియోగం పారదర్శకంగా, సమర్థవంతంగా ఉండాలని, పంచాయతీలు, మున్సిపాలిటీలు ప్రజల ప్రాథమిక అవసరాలపై దృష్టి పెట్టి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర నిధుల ద్వారా గ్రామ పంచాయతీలను బలోపేతం చేయాలన్నారు. ప్రజాస్వామ్యం ఫలాలు సామాన్య ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి రూపాయి ప్రజా ప్రయోజనానికి వినియోగించబడాలని పేర్కొన్నారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం స్థానిక సంస్థల ఆర్థిక స్థితిగతులను బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చైర్మన్ సూచించారు. అనంతరం ఉమ్మడి జిల్లా పరిధిలోని పంచాయతీల ఆదాయం, వ్యయాల స్థితి, పన్నుల వసూళ్లు, నిధుల వినియోగం, పేదరిక నిర్మూలన, గ్రామీణ గృహనిర్మాణం, విద్యుత్, తాగునీటి సరఫరా, రహదారులు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర వివరాలు అందజేశారు. ఈ సమావేశంలో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, నిర్మల్ జిల్లాకు వివిధ శాఖలకు ఆయా రూపాలలో వచ్చిన నిధులు, ఆదాయ వివరాలను ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ కు వివరించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు రాజర్షి షా, కుమార్ దీపక్, వెంకటేష్ దోత్రే, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు సోమ రాజేశ్వర్, ఫైజాన్ అహ్మద్, దీపక్ తివారి, పంచాయతీ రాజ్, శాఖ అధికారులు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి స్పెషల్ డ్రైవ్

- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి
- ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై సుదీర్ఘ సమీక్ష

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 12 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో స్పష్టమైన పురోగతి కనిపించేలా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. లక్ష్య సాధనకు కృషి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, డబుల్ బెడ్రూంల పంపిణీ ప్రక్రియపై కలెక్టర్ ఎంపీడీఓలు, హౌసింగ్ ఏ.ఈలు, ఎంపీఓలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సుదీర్ఘ సమీక్ష జరిపారు. ఒక్కో మండలం వారీగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు ఎన్ని, వాటిలో ఎన్ని గ్రౌండింగ్ అయ్యాయి, ఎన్ని ఇండ్లు ఏ దశలో నిర్మాణంలో ఉన్నాయి, ఇప్పటివరకు గ్రౌండింగ్ జరగని ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులచే పనులు ప్రారంభించేలా చేపట్టిన చర్యలు ఏమిటి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలలో వెనుకంజలో ఉన్న ఆయా మండలాల అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహిస్తూ, నిర్దేశిత లక్ష్యాల



సాధన కోసం స్పష్టమైన దిశానిర్దేశం చేస్తున్నప్పటికీ, ఎందుకు పురోగతి సాధించడం లేదని నిలదీశారు. వారం రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని సూచించారు. తాను ఇందిరమ్మ ఇళ్ల ప్రగతి పై క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహిస్తానని, ఎప్పటికప్పుడు స్పష్టమైన పురోగతి కనిపించాలని అన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ అంకిత్, హౌసింగ్ పీ.డీ పవన్ కుమార్, ఈ.ఈ నివర్తి, డీ.ఈ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి వివరాలను యూడైస్‌లో నమోదు చేయాలి

- అవసరమైన వారికి బర్త్ సర్టిఫికెట్లు ఇప్పించాలి
- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి
- దర్యాపూర్ స్కూల్, భవిత కేంద్రాల సందర్శన

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 12 : ప్రతి విద్యార్థి వివరాలను యూడైస్ లో విధిగా నమోదు చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. నవీపేట మండల కేంద్రంలోని దర్యాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను, భవిత కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. యూడైస్ లో విద్యార్థుల వివరాల నమోదు గురించి ఆరా తీశారు. బర్త్ సర్టిఫికెట్ లేకపోవడం వల్ల కొంతమంది విద్యార్థుల వివరాలను నమోదు చేయలేదని పాఠశాల హెచ్.ఎం హన్మంతరావు తెలుపగా, కలెక్టర్ ఒకింత అసహనం వ్యక్తం చేశారు. బర్త్ సర్టిఫికెట్ లేని విద్యార్థులకు వాటిని ఇప్పించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, అవసరమైన వారి ఆధార్ వివరాలను కూడా అప్డేషన్ చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. జనన ధృవీకరణ పత్రం కోసం బర్త్ సర్టిఫికెట్ లేని విద్యార్థులు అందరూ దరఖాస్తు. చేసుకునేలా చూడాలన్నారు. దరఖాస్తులు వచ్చిన వెంటనే విద్యార్థులకు బర్త్ సర్టిఫికెట్లు జారీ చేయాలని తహసీల్దార్ వెంకటరమణకు సూచించారు. కాగా, ప్రతి విద్యార్థికి సంబంధించి అపార్ జెనరేట్ జరగాలని అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు ముఖ గుర్తింపు విధానం ద్వారానే వంద శాతం చేయాలని సూచించారు. ఏవైనా సాంకేతిక ఇబ్బందులు ఉంటే వాటిని పరిష్కరించుకుంటూ శత శాతం ఎఫ్.ఆర్.ఎస్ అమలయ్యేలా చూడాలన్నారు. కిచెన్ గార్డెన్ నిర్వహణను మెరుగుపర్చాలని, పాఠశాల ఆవరణలో నిరుపయోగంగా ఉన్న పాత గదులను తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. కాగా, పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న భవిత కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ఉద్దేశించిన ఈ కేంద్రంలో చేపట్టాల్సిన నిర్మాణ పనులను పరిశీలించారు. అన్ని చోట్ల నాణ్యతతో పనులు జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. చిన్నారులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిత కేంద్రాల నిర్మాణాలు, మరమ్మతుల కోసం అవసరమైన పక్షంలో జిల్లా యంత్రాంగం ద్వారా కొంత మేరకు అదనపు నిధులను సమకూరుస్తామని అన్నారు. భవిత కేంద్రాల పనితీరు, మరమ్మతులు, నిర్మాణాల ప్రతిపాదనలు, పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తానని, పూర్తి వివరాలతో సమీక్షకు హాజరు కావాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యా శాఖ అధికారి పి.అశోక్, ఎంపీడీఓ నాగనాథ్, తహసీల్దార్ వెంకట రమణ, ఇంజినీరింగ్ విభాగం అధికారులు జి.రవి, ఉదయ్ కిరణ్, భవిత కేంద్రాల జిల్లా ఇంచార్జి ప్రకాష్ తదితరులు ఉన్నారు.





ఆయిల్ పామ్ సాగులో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్రంలో ప్రస్తుతం 2.74 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోంది. మరో 12 లక్షల ఎకరాలు ఈ పంట సాగుకు అనువుగా ఉంది. వచ్చే నాలుగేళ్లపాటు ప్రతి ఏడాది కొత్తగా 2 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తూ, వచ్చే మూడేళ్లలో 10 లక్షల ఎకరాలకు సాగు విస్తీర్ణం పెంచుతాం.

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అమెరికా సుంకాలు తగ్గే అవకాశం

- ఇండియాతో త్వరలో వాణిజ్య ఒప్పందం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 12: ఇండియాతో వాణిజ్య ఒప్పందం త్వరలో కుదురుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. భారత వస్తువులపై టారిఫ్‌లు తగ్గిస్తామన్నారు. డొనాల్డ్ ట్రంప్ అమెరికాలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. భారతదేశంతో వాణిజ్య ఒప్పందం త్వరలో ఉంటుందని ప్రకటించారు. భారత వస్తువులపై విధించిన టారిఫ్ రేట్లను చాలా త్వరలో" తగ్గించనున్నామని స్పష్టం చేశారు. ఇప్పుడు వారు తనను ప్రేమించడం లేదని, కానీ, మళ్లీ తమను ప్రేమిస్తారని ఇండియాను ఉద్దేశించి ట్రంప్ ఆసక్తికరంగా మాట్లాడారు. న్యాయమైన ఒప్పందం పై చర్చలు జరుపుతున్నామని, అందరికీ లాభదాయక ఒప్పందంపై చర్చిస్తున్నామని వివరించారు. చాలా దగ్గరలో డీల్ కుదురుతుందని ట్రంప్ చెప్పారు. భారతదేశం రష్యన్ ఆయిల్ దిగుమతులను తగ్గించడంతో అమెరికా అనుకూలంగా మారింది. భారత్ రష్యన్ ఆయిల్ దిగుమతులను చాలా తగ్గించిందని, ఇది తమ ఒప్పందానికి సహాయపడుతోందని ట్రంప్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో " అద్భుత స్నేహం ఉందని ట్రంప్ చెబుతున్నారు. కాగా, ట్రేడ్ డీల్ 2025 చివరి నాటికి కుదిరే అవకాశం ఉందని అమెరికా వర్గాలు చెబుతున్నాయి. ట్రంప్ ప్రకటనతో భారతఅమెరికా వాణిజ్య సంబంధాలు మరింత బలపడనున్నాయని వాణిజ్య నిపుణులు అంచనా వేస్తున్నారు.



విశ్వ వీక్షణం



బాబీ డియోల్ ఇంటిలో ధర్మేంద్రకు చికిత్స

- తప్పుడు కథనాలపై హేమామాలిని సీరియస్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, ముంబై, నవంబర్ 12 : వెటరన్ హీరో ధర్మేంద్రకు చికిత్స కొనసాగుతోంది. కొంత కాలంగా ఆయన ఆరోగ్యంపై ఆందోళన నెలకొన్న సంగతి తెలిసిందే. ఆయన ఆరోగ్యం క్షీణించడంతో మరణించారని వదంతులు సైతం వ్యాపించాయి. అయితే, ఆయన నెమ్మదిగా కోలుకుంటున్నారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉంది. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ధర్మేంద్రను బుధవారం ఉదయం చిన్న కుమారుడు బాబీ డియోల్ అంబులెన్స్‌లో తన ఇంటికి తీసుకువెళ్లారు. 'ధర్మేంద్ర మా సంరక్షణలోనే ఉన్నారు. ఆయనను కుటుంబసభ్యులు ఇంటికి తీసుకు వెళుతున్నారు. ఆయనకు వారి ఇంటిలోనే చికిత్స కొనసాగుతుంది' అని క్యాండీ హాస్పిటల్ వైద్యులు తెలిపారు. ధర్మేంద్రను అంబులెన్స్‌లో బాబీ డియోల్ ఇంటికి చేరుకున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అది చూసిన అభిమానులు ఊపిరి తీసుకుంటున్నారు. ధర్మేంద్ర మరణించారని వచ్చిన పుకార్లలో నిజం లేదని డియోల్ ఫ్యామిలీ ఖండించింది. ధర్మేంద్ర ఆరోగ్య పరిస్థితి గురించి సన్నీ డియోల్, బాబీ డియోల్ టీం ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఫ్యాన్స్, మీడియాకు వివరించింది. ధర్మేంద్ర మరణించినట్టు వచ్చిన కథనాల మీద కుమార్తె ఈషా డియోల్, భార్య హేమామాలిని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు వార్తలు ఎలా ప్రసారం చేస్తారని మండిపడ్డారు ఆగ్రహం వ్యక్తం చేశారు.



తెలుసా?!

మీ ఆరోగ్యం బాలేదని!!

ఓ వ్యక్తి చెబుతున్న విషయాలు నిజమే కాదో తెలుసుకోడానికి వారి కండ్లలోకి తేరిపార చూస్తే చాలని చాలా మంది చెబుతుంటారు. నీ కండ్లే నిన్ను పట్టిస్తాయి అంటుంటారు. అలాగే మీ కండ్లు మీ ఆరోగ్యం గురించి కూడా చాలా విషయాలు చెప్పగలవని మీకు తెలుసా? కండ్లను బట్టి ముమ్ముందు వచ్చే అనారోగ్య సమస్యలను కూడా పసిగట్టవచ్చని మీరు ఎప్పుడైనా విన్నారా? నిజం అండి మీ కండ్లను చూసి మీ ఆరోగ్య సమస్యలు గుర్తించవచ్చు. కంటిలోని చిన్న రక్తనాళాలను లోతుగా పరిశీలిస్తే, ఆ వ్యక్తి హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదం ఎంత మేరకు ఉందో తెలిసిపోతుంది. అంతేకాదు, ఒకరి హృదయ నాళాల ఆరోగ్యం, జీవసంబంధమైన వృద్ధాప్య స్థితిని కూడా కళ్లు చెప్పేస్తాయని ఓ తాజా పరిశోధనలో వెల్లడైంది.


ఎంతమందిపై పరిశోధన చేశారు?

కెనడాలోని మెక్మాస్టర్ విశ్వవిద్యాలయం, పాపులేషన్ హెల్త్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ పరిశోధకులు 74 వేల మందిపై సంయుక్త పరిశోధనలు చేశారు. వీరి రెటీనా స్కాన్లు, జన్యు డేటా, రక్త నమూనా విశ్లేషణలను నాలుగు వేర్వేరు సంస్థల నుంచి సేకరించి పరిశోధించారు. కండ్ల ద్వారా తెలుసుకోగలిగే ఆరోగ్య స్థితిగతులపై అత్యంత ఆసక్తికర విషయాలు తెలిశాయి. సైన్సెస్ అడ్వాన్సెస్ జర్నల్లో ఇటీవల ఈ పరిశోధన ఫలితాలు ప్రచురితమయ్యాయి.

రోగ నిర్ధారణలో కీలకం కానున్న సమాచారం

ఈ అధ్యయనంలో మరో ముఖ్యమైన అంశం రక్తపు బయోమార్కర్లు, జన్యు డేటాను సమీక్షించటం. దీని ద్వారా, పరిశోధకులు కంటి రక్త నాళాలలో మార్పుల వెనుక గల జీవసంబంధ కారణాలు కనుగొనగలిగారు. రక్తనాళాలలో వచ్చే మార్పులకు కారణమవుతున్న రెండు ముఖ్య ప్రోటీన్లను ఈ పరిశోధనలో కనిపెట్టారు. వృద్ధాప్యం వేగాన్ని నెమ్మదింపజేయటానికి, గుండె జబ్బుల భారం తగ్గించడానికి, భవిష్యత్తులో ఔషధాల తయారీకి, చివరికి జీవితకాలం మెరుగుపరచడానికి ఈ ప్రోటీన్లు ఉపయోగపడతాయని ఇటీవల ఈ పరిశోధన చేసిన ప్రొఫెసర్ మేరీ పిగేయే వివరించారు.





కండ్ల చుట్టూ వాపు

ఈ సమస్యలో, కండ్ల చుట్టూ వాపు మొదలవుతుంది, దీనితో పాటు చర్మం కూడా కొద్దిగా కుంచించుకుపోయినట్లు కనిపిస్తుంది. కండ్ల చుట్టూ కనిపించే ఈ లక్షణాలు స్ట్రోక్, గుండెపోటుతో పాటు అధిక రక్తపోటుకు సంకేతంగా చెబుతుంటారు. ఒకవేళ థైరాయిడ్ సమస్యతో బాధపడుతున్నట్లయితే కండ్లు ఎర్రగా మారుతాయి. అంతేకాకుండా, కండ్ల చుట్టూ దురద సమస్య కూడా ఉంటుంది. కండ్ల చుట్టూ ఉన్న ప్రాంతంలో వాపు కూడా థైరాయిడ్ సమస్యను సూచిస్తుంది. ఇదే కాక డయాబెటిస్ కూడా వార్నింగ్ దశలోనే గుర్తించి తగిన జాగ్రత్తలు, సరైన చికిత్స తీసుకుంటే, ప్రభావం తీవ్రతనుంచి బయటపడవచ్చు. అయితే దీన్ని గుర్తించడం ఎలా ?

కంటి చూపులో ఎలాంటి మార్పులొస్తాయి?

కండ్లలో జరిగే కొన్ని మార్పులు డయాబెటిస్ కి ముందస్తు లక్షణము. శరీరంలో చక్కెర స్థాయిలు పెరిగితే అది కంటి నరాలపై ప్రభావం పడుతుంది. దీంతో కంటి చూపు మందగిస్తుంది. ఉదయం లేవగానే కండ్లు మసకగా అనిపించడం, దృష్టి మసక బారుతుంది. కండ్లలో నొప్పి, అలసట ఒత్తిడి లాంటి లక్షణాలు కనిపిస్తాయి. కండ్లు ఉబ్బినట్లు కనిపిస్తే షుగర్ కి ప్రాథమిక లక్షణంగా భావించి అలర్ట్ అవ్వాలి. రక్తంలో చక్కెర స్థాయి పెరిగి కంటి నరాలపై ప్రభావాన్ని చూపిస్తుంది. ఇలాంటి లక్షణాలు కనిపించిన వెంటనే మీ వైద్యులను సంప్రదించి, సంబంధిత పరీక్షలు చేయించుకోవాలి. మరియు చికిత్స కూడా చేయించు కోవాలి. లేదంటే డయాబెటిక్ రెటినోపతికి దారికావచ్చు. టైప్ 1, టైప్ 2 డయాబెటిస్ రోగుల్లో ఇది చాలా సాధారణంగా కనిపిస్తుంది.

అసలు కండ్లు ఏమి చెబుతాయి!

సాధారణంగా కంటి వెనకాల రక్త ప్రసరణ వ్యవస్థ ఉంటుంది. దీనినే రెటీనా వాస్కులేచర్ అంటారు. ఇది మీ గుండె ఆరోగ్యానికి చాలా దగ్గరి సంబంధం కలిగి ఉంటుంది. దీంతో కంటి ఆరోగ్యాన్ని బట్టి గుండె పనితీరును అంచనా వేయొచ్చు. కంటి లోపలి భాగాలను పరిశీలించడం ద్వారా ఈ విషయాన్ని అంచనా వేస్తాము. కంటి లెన్స్ రెటీనా, ఆప్టిక్ నరాల వంటి వాటిని పరిశీలించడానికి ఆప్తోల్మోస్కోపిన్‌ను ఉపయోగిస్తారు. ఒకవేళ అధిక కొలెస్ట్రాల్ సమస్య ఉంటే కనుపాట చుట్టూ బూడిద రంగు లేదా నీలం రంగు వృత్తం ఏర్పడుతుంది. వైద్య భాషలో దీనిని ఆర్కస్ సెనిలిస్ అంటారు. దీన్ని బట్టి మీకు గుండె జబ్బులు, కొలెస్ట్రాల్, పక్షవాతం వచ్చే ప్రమాదం ఉందో లేదో తెలుసుకోవచ్చు. ఇక కళ్ల రక్తనాళాలు దెబ్బతినడం కనిపించినట్లయితే, అది అధిక రక్తపోటు సమస్యకు సంకేతమని తెలుస్తుంది.

కనుపాప పరిమాణం

కనుపాప వెలుతురుకు తక్షణమే స్పందిస్తుంది. ప్రకాశవంతమైనటు వంటి వాతావరణంలో కనుపాప చిన్నదవుతుంది. వెలుతురు తగ్గే కొద్దీ కనుపాప పెద్దదవుతుంది. అటు హెచ్చుతగ్గుల ప్రతిస్పందన నెమ్మదిగానో, ఆలస్యంగానో జరుగుతున్నట్లయితే, అది అనారోగ్యాలను సూచిస్తుంది. అందులో అల్జీమర్స్ వంటి వ్యాధులు, మందుల ప్రభావాలు, మాదకద్రవ్యాల వినియోగించారనే దానికి ఆధారాల వంటివి ఉంటాయి. కొకెయిన్ వంటి మాదకద్రవ్యాలను ఉపయోగించే వారిలో కనుపాపలు ఉబ్బి కనిపిస్తాయి. హెరాయిన్ వాడేవారిలో కనుపాపలు చాలా చిన్నవిగా కనిపిస్తాయి. తెల్లగుడ్డు పసుపు రంగులోకి మారితే అది జాండిస్ (కామెర్లు) జబ్బుకు గుర్తు. కాలేయానికి జబ్బు సోకిందని చిహ్నం.



డా. కౌశల్ గోవర్ధన
7702417779
వైస్ చైర్మన్
శ్రీ రామానుజ సేవా ట్రస్ట్
ధనుంజయ నర్సింగ్ హోమ్, హైదరాబాద్

కంటిలో గడ్డ

కండ్లలో మనం చూడగానే చాలా భయపెట్టే సమస్యలు ఒక్కోసారి అతి నిరపాయకరమైన, చాలా సులభంగా చికిత్స చేయగలిగే సమస్యలు కావచ్చు. కంటి తెల్లగుడ్డు మీద పుట్టుకువచ్చే పసుపురంగులోని లావాటి గడ్డ పింగుకులా. ఇది కొవ్వు, మాంసం ఒకచోట పేరుకుని ఏర్పడే గడ్డ. దీనిని చుక్కల మందుతో సులభంగా తగ్గించవచ్చు. లేదంటే చిన్నపాటి శస్త్రచికిత్సతో తొలగించవచ్చు. నిజానికి ఈ గడ్డను అది కార్నియాను అంటే నల్లగుడ్డును తాకకముందే తొలగించి తీరాలి. ఒకవేళ అది పెరిగుతూ పోయేదాకా అశ్రద్ధ చేస్తే, నల్లగుడ్డు (శుక్ల పటలం) మీద పెట్రీజియం అనే ఒక తెరవంటిది ఏర్పడుతుంది. అది చూపును మసకబారుస్తుంది. తరచుగా సూర్యుడి అతినీలలోహిత వెలుతురు బారిన పడటం పింగుకులా, పెట్రీజియం రెండిటికీ ఒక ప్రధాన కారణమని భావిస్తాము.

రెడ్ స్పాట్

కంటి తెల్లటి భాగంలో రక్తం ఎరుపు మచ్చ (సబ్‌కంజంక్టివల్ రక్తస్రావం) భయానకంగా కనిపిస్తుంది. ఇది ఎల్లప్పుడూ స్థానికీకరించిన రక్తనాళం ఫలితంగా ఏర్పడుతుంది. చాలాసార్లు అది ఏర్పడటానికి ఎటువంటి కారణం ఉండదు. అది కొన్ని రోజులలో అదృశ్యమవుతుంది. అయినప్పటికీ, ఇది అధిక రక్త పోటు, మధుమేహం, అధిక రక్తస్రావం కలిగించే రక్తం గడ్డకట్టే రుగ్మతలకు సూచనగా ఉంటుంది. ఆస్పిరిన్ వంటి రక్తాన్ని పలుచబడే మందులు కూడా కారణం కావచ్చు. సమస్య తరచుగా ఉంటే మీ వైద్యుడిని కలవాల్సిందే.

కండ్లు ఆదరటం

ఇక కనురెప్పలు అదరటం (ఆక్యులార్ మయోకిమియా) చాలా తరచుగా జరుగుతుంటుంది. దీనికి ఇరిటేషన్, శరీరంలో వేడి సెగలు (హాట్ ఫ్లాషెస్) కారణం కావచ్చు. ఒక్కోసారి ఇవి కనిపించే దానికన్నా చాలా తీవ్రంగా ఉన్నట్లు అనిపిస్తుంటాయి. ఈ కండ్లు లేదా కనురెప్పలు అదరటం అనే ఈ పరిస్థితి చాలా వరకూ ఒత్తిడి వల్ల కానీ పోషకాహార సంతులనం లోపించటం వల్ల కానీ, అధిక మోతాదులో కెఫీన్ సేవించటం వల్ల కానీ తలెత్తే నిరపాయమైన సమస్య.

ముఖ్య గమనిక:

ఇలాంటి కళ్లు వైద్య పరిస్థితికి సంబంధించి మీకు ఏవైనా సందేహాలు ఉంటే మీ వ్యక్తిగత వైద్యుని లేదా సంబంధిత నిపుణుల సలహా తీసుకోండి. ఈ సమాచారం సాధారణ సమాచారం, జాగ్రత్తల కోసం మాత్రమే!

బిహార్‌లో కాంగ్రెస్ సీనియర్ నేత రాజీనామా

- మనస్తాపంతో పార్టీని వీడిన షకీల్ అహ్మద్


ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, పాట్నా, నవంబర్ 12 : బిహార్‌లో ఓటింగ్ ముగియగానే ఆ రాష్ట్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత షకీల్ అహ్మద్ రాజీనామా చేవారు. షకీల్ అహ్మద్ యూపీఏ ప్రభుత్వంలో హోమ్ శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. ఆయన తన రాజీనామాను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు పంపారు. భవిష్యత్తులో ఇక ఎన్నికలలో పోటీ చేయనని పార్టీకి స్పష్టం చేశారు. తన ముగ్గురు కుమారులు కెనడాలో నివసిస్తున్నారని, వారిలో ఎవరికీ రాజకీయాలలో చేరడానికి ఆసక్తి లేదని, కాబట్టి వారు కూడా ఎన్నికలలో పోటీ చేయరని వివరించారు. పార్టీకి రాజీనామా చేయాలని బరువెక్కిన హృదయంతో నిర్ణయించుకున్నానని, కానీ, జీవితాంతం కాంగ్రెస్ పార్టీలోనే ఉంటాననీ పేర్కొన్నారు. తనకు వేరే ఏ పార్టీలో చేరే ఉద్దేశం లేదని, తమ పూర్వీకుల మాదిరిగానే, తనకు కాంగ్రెస్ పార్టీ విధానాలు, సిద్ధాంతలపై అచంచలమైన నమ్మకం ఉందన్నారు. తన చివరి ఓటు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉంటుందన్నారు. తమ తాత అహ్మద్ గఫూర్ 1937లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని, 1948లో ఆయన మరణించిన తర్వాత, తండ్రి షకూర్ అహ్మద్ 1952-1977 మధ్య ఐదుసార్లు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఎన్నికై వివిధ పదవులు నిర్వహించారని, 1981లో తమ తండ్రి మరణించిన తర్వాత, తాను 1985 నుంచి ఐదుసార్లు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా, ఎంపీగా ఎన్నికయ్యానని అహ్మద్ గుర్తు చేశారు.



రిపబ్లిక్ డే రోజున దాడులకు ప్రణాళిక

- డాక్టర్ విచారణలో కీలక అంశాలు వెల్లడి

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 12 : రాజధాని ఢిల్లీ ఎర్రకోట సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన ఘోర పేలుడు కేసులో దర్యాప్తు అధికారులు కీలక విషయాలు గుర్తించారు. ప్రధాన నిందితులలో ఒకడైన డాక్టర్ ముజమ్మిల్ షకీల్ గణతంత్ర దినోత్సవం, దీపావళి వంటి జాతీయ కార్యక్రమాల సమయంలో ఉగ్రదాడులు చేయడానికి ప్లాన్ చేసినట్లు పోలీసుల విచారణలో అంగీకరించాడని తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ముజమ్మిల్ తన సహచరుడు ఉమర్‌తో కలిసి ఈ యేడాది ప్రారంభంలో ఎర్రకోట ప్రాంతంలో రెక్కీ నిర్వహించినట్లు అంగీకరించాడు. 26 జనవరి గణతంత్ర వేడుకల సమయంలో దాడి చేయడానికి రెక్కీ నిర్వహించినట్లు సమాచారం. ముజమ్మిల్ మొబైల్ ఫోన్ నుండి సేకరించిన లొకేషన్ డేటా, ఎర్రకోట చుట్టుపక్కల ప్రాంతాలకు చాలాసార్లు వెళ్లినట్లు నిర్ధారించింది. దీపావళి సమయంలో దాడి చేసేందుకు ప్లాన్ చేసుకున్నా, చివరి నిమిషంలో విరమించుకున్నారని తెలిసింది. పుల్వామాకు చెందిన సీనియర్ డాక్టర్ ముజమ్మిల్ ఫరీదాబాద్ అల్‌ఫలాహ్ విశ్వవిద్యాలయంలో ఫ్యాకల్టీగా పనిచేశాడు. జైషేమహ్మద్, అన్సార్ ఘజ్వత్ ఉల్ హింద్ వంటి నిషేధిత సంస్థలతో సంబంధాలు ఉన్న వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ తో ముజమ్మిల్‌కు సంబంధాలు ఉన్నాయని అధికారుల నమ్మకం విచారణలో బలపడుతోంది. ఆత్మాహుతి దాడికి పాల్పడిన డాక్టర్ ఉమర్, నవంబర్ 10న ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలోని ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర హ్యుందాయ్ ఐ20 కారులో పేల్చివేసుకుకుని మృతిచెందాడు. ఈ పేలుడులో 12 మంది మరణించగా, 20 మంది వరకు గాయపడ్డారు.



డిజిటల్ అరెస్టు పేరుతో 99 లక్షలు స్వాహా

- నిర్మలా సీతారామన్ సంతకం ఫోర్జరీతో నకిలీ అరెస్ట్ వారెంట్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, ముంబై, నవంబర్ 12 : సైబర్ నేరస్థులు రోజురోజుకూ తెలివిమీరిపోతున్నారు. సరికొత్త ఎత్తులతో ఉన్నత విద్యావంతులనూ మోసం చేస్తున్నారు. డిజిటల్ అరెస్ట్ నేరాలపై ప్రజలలో అవగాహన పెరగడంతో మరో కొత్త వ్యూహంతో మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా పుణేకు చెందిన ఓ వృద్ధురాలిని డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరించి రూ.99 లక్షలు కాజేశారు. ఇందుకోసం కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఓ అరెస్ట్ వారెంట్ సృష్టించారు. దీంతో ఉన్నతవిద్యావంతురాలు, ఎల్ఐసీ మాజీ ఉన్నతాధికారి అయిన ఆ వృద్ధురాలు నమ్మి మోసపోయారు. పుణే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. 62 యేండ్ల మహిళ ఎల్ఐసీలో ఉన్నతోద్యోగం చేసి పదవీ విరమణ చేశారు. ఇటీవల ఆమెకు ఓ ఫోన్ కాల్ వచ్చింది. ఆమె ఆర్థిక మోసాలకు పాల్పడ్డారని బెదిరింపులకు గురిచేశారు. సీనియర్ ఆఫీసర్ వీడియో కాల్ లో మాట్లాడతారంటూ ఫోన్ పెట్టేశాడు. కాసేపటి తర్వాత సీనియర్ పోలీస్ ఆఫీసర్ జార్జ్ మాథ్యూ పేరుతో మరో వాట్సాప్ వీడియో కాల్ చేశారు. ఆమె ఆధార్ కార్డ్ తో లింక్ అయిన ఫోన్ నెంబర్ తో ఆర్థిక మోసాలు జరిగాయని, ఈ కారణంగా ఆమెను డిజిటల్ అరెస్ట్ చేశామని చెప్పాడు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ సంతకంతో జారీ అయిన నకిలీ అరెస్ట్ వారెంట్ వాట్సాప్ చేశాడు. బ్యాంకులో ఉన్న నగదు తాము సూచించిన ఖాతాకు బదిలీ చేయాలని, తనిఖీ తర్వాత తిరిగి ఆమె ఖాతాలో జమ అవుతుందని నమ్మబలికాడు. లేదా జైలుకు వెళ్లాల్సి వస్తుందని బెదిరించడంతో భయాందోళనకు గురైన బాధితురాలు దుండగుడు చెప్పిన బ్యాంకు ఖాతాలకు రూ.99 లక్షలు బదిలీ చేసింది. ఆ తర్వాత దుండగుడికి ఫోన్ చేసేందుకు ప్రయత్నించగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు వెంటనే పోలీసులను ఆశ్రయించింది.



పాకిస్తాన్‌లో శ్రీలంక జట్టుకు భారీ భద్రత

- దేశంలో తరుచుగా జరుగుతున్న ఉగ్ర దాడులు

పాకిస్తాన్‌లో పర్యటనలో ఉన్న శ్రీలంక క్రికెట్ జట్టుకు భద్రతను భారీగా పెంచారు. దేశంలో ఇటీవల వరుసగా ఉగ్రవాద దాడులు జరుగుతున్న నేపథ్యంలో పాకిస్తాన్ ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. ఆటగాళ్ల భద్రతను పర్యవేక్షించేందుకు పాక్ ఆర్మీ, పారా మిలటరీ రేంజర్లను సైతం రంగంలోకి దించింది. పీసీబీ చైర్మన్‌గా, దేశ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రిగా ఉన్న మొహ్సిన్ నఖ్వీ..శ్రీలంక జట్టు సభ్యులను స్వయంగా కలిసి వారికి పూర్తిస్థాయి భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇస్లామాబాద్‌లోని ఓ జ్యుడీషియల్ కాంప్లెక్స్ వెలుపల జరిగిన ఆత్మాహుతి దాడిలో 12 మంది మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. అదే సమయంలో ఉత్తర పాకిస్తాన్‌లోని వానా ప్రాంతంలో ఉన్న కేడెట్ కాలేజీపై ఉగ్రవాదులు దాడికి యత్నించగా, భద్రతా దళాలు విఫలం చేసి 300 మంది విద్యార్థులను సురక్షితంగా తరలించాయి. పాకిస్తాన్‌లో దాడులకు తెహ్రీక్ ఏ తాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ) ఉగ్రవాదులు అఫ్ఘానిస్తాన్ భూభాగాన్ని వాడుకుంటున్నారని పాక్ ఆరోపించింది. 2009 మార్చిలో లాహోర్‌లోని గడాఫీ స్టేడియం సమీపంలో శ్రీలంక జట్టు బస్సుపై టీటీపీ ఉగ్రవాదులు దాడి చేసిన విషయం తెలిసిందే. ఆ భయానక ఘటన తర్వాత దాదాపు పదేండ్ల పాటు పాకిస్తాన్‌లో అంతర్జాతీయ క్రికెట్ నిలిచిపోయింది. మళ్లీ ఇన్నాళ్లకు అంతర్జాతీయ జట్లు వస్తున్న తరుణంలో భద్రతా సమస్యలు తలెత్తకుండా పీసీబీ జాగ్రత్తలు తీసుకుంటోంది. మూడేళ్ల క్రితం కూడా ఉగ్రదాడి జరగవచ్చన్న నిఘా వర్గాల హెచ్చరికలతో న్యూజీలాండ్ జట్టు ఒక్క మ్యాచ్ కూడా ఆడకుండానే పర్యటనను రద్దు చేసుకుని స్వదేశానికి తిరిగి వెళ్లింది.



అండర్ 19 భారత్ 'బి' జట్టు కెప్టెన్‌గా అరోన్

- హైదరాబాద్ కుర్రాడికి బీసీసీఐ అవకాశం


అఫ్గానిస్తాన్ అండర్ 19 జట్టుతో జరిగే ముక్కోణపు సిరీస్‌కు బీసీసీఐ రెండు జట్లను ప్రకటించింది. అండర్ 19 భారత్ 'ఎ', అండర్ 19 భారత్ 'బి' జట్లు అఫ్గానిస్తాన్ అండర్ 19 టీమ్‌తో ఆడతాయి. 'ఎ' జట్టుకు విహాన్ మల్హోత్రా సారథ్యం వహిస్తాడు. కాగా, 'బి' జట్టుకు హైదరాబాద్ కుర్రాడు ఆరోన్ జార్జ్ కెప్టెన్ గా ఉంటాడు. ఆరోన్ జార్జ్ ఇటీవల ముగిసిన ప్రతిష్టాత్మక దేశవాళీ అండర్ 19 టోర్నీ వినూ మన్కడ్ ట్రోఫీలో హైదరాబాద్ జట్టుకు నాయకత్వం వహించాడు. అసాధారణ ప్రదర్శన, సారథ్యంతో హైదరాబాద్ జట్టును విజేతగా నిలబెట్టాడు. కొంతకాలంగా బాగా ఆడుతున్నాడు. వినూ మన్కడ్ ట్రోఫీలో మూడేండ్లుగా టాప్ స్కోరర్‌గా ఉన్నాడు. ఇటీవల ముగిసిన ఎడిషన్‌లో రెండు సెంచరీల సాయంతో 373 పరుగులు చేశాడు. అండర్ 19 చాలెంజర్ ట్రోఫీలో కూడా చక్కగా రాణించాడు. స్కూల్ క్రికెట్‌లో ప్రతిభ చూపిన ఆరోన్ 2022లో హైదరాబాద్ అండర్ 16 జట్టులోకి తీసుకున్నారు. విజయ్ మర్చంట్ ట్రోఫీలో ట్రిపుల్ సెంచరీ సహా 511 పరుగులు సాధించాడు. ఈ ప్రదర్శనతో ఆరోన్‌కు మంచి గుర్తింపు దక్కింది. ఆరోన్ జార్జి స్వరాష్ట్రం కేరళ. అయితే, తల్లిదండ్రులు హైదరాబాద్‌లో సెటిల్ అయ్యారు.



చిన్నస్వామి స్టేడియంలో ఐపీఎల్ మ్యాచులకు 'నో'

- మహారాష్ట్రలోని పుణే స్టేడియంలో జరిగే అవకాశం

ఐపీఎల్ కు సంబంధించి రోజుకో కొత్త కథనం బయటకు వస్తోంది. తాజాగా ఆర్సీబీ మ్యాచులకు సంబంధించి ఓ ప్రచారం తెర మీదకు వచ్చింది. వచ్చే సీజన్‌లో ఆర్సీబీ తమ సొంత మైదానం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆడడానికి అనుమతి ఉండకపోవచ్చని అంటున్నారు. ఆర్సీబీ విజయోత్సవాల సందర్భంగా చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో పది మంది మృతిచెందారు. దీంతో స్టేడియం సామర్థ్యం, ప్రేక్షకుల భద్రత మీద సందేహాలు వ్యక్తమయ్యాయి. అప్పటి నుంచి అక్కడ అంతర్జాతీయ మ్యాచ్ ఒక్కటి కూడా జరగలేదు. వచ్చే యేడాది భారత్, శ్రీలంక లో జరగనున్న టీ20 వరల్డ్‌కప్‌కోసం కూడా చిన్నస్వామి స్టేడియాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. ఐపీఎల్ నిర్వాహకులు కూడా మ్యాచులు నిర్వహించేందుకు అనుమతి నిరాకరించారని సమాచారం. ఐపీఎల్ లో సాధారణంగా స్టేడియం నిండిపోతుంది. అందుకే ప్రేక్షకుల భద్రతా దృష్యా నిర్వాహకులు ఈ నిర్ణయం తీసుకుంటారని అంటున్నారు. దీంతో ఆర్సీబీ తమ సొంత మైదానంలో జరిగే మ్యాచులను వేరే స్టేడియానికి మార్చాలని అనుకుంటున్నట్టు తెలుస్తోంది. మహారాష్ట్రలోని పుణే స్టేడియంలో ఈ మ్యాచులు జరిగే అవకాశాలు ఉన్నాయంటున్నారు. డిసెంబర్‌లో జరగనున్న మినీ వేలం తర్వాతే తుది నిర్ణయం ఉండవచ్చు.



మీరిద్దరూ దేశవాళీ పోటీలు ఆడాల్సిందే

- రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకి బీసీసీఐ ఆదేశం!

టీమిండియా స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మకు బీసీసీఐ కీలక సూచనలు జారీ చేసిందని సమాచారం. అంతర్జాతీయ టీ20లతో పాటు టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన వీరు ప్రస్తుతం వన్డే ఫార్మాట్‌లోనే కొనసాగుతున్నారు. వన్డే ప్రపంచకప్ 2027 ఆడాలని అనుకుంటున్నారు. ఇందుకోసం తీవ్రంగా కష్టపడుతున్నారు. శారీరక సామర్థ్యం కాపాడుకోవడానికి యత్నిస్తున్నారు. ఈ క్రమంలో రోహిత్ శర్మ ఏకంగా 12 కిలోల బరువు తగ్గాడు. ఆస్ట్రేలియా పర్యటనలో ఈ ఇద్దరూ ఆటగాళ్లు సత్తా చాటారు. అయితే, ఈ వన్డే సిరీస్‌లో టీమిండియా ఓడిపోయింది, ఈ ఇద్దరూ ఇపుడు వన్డే ఫార్మాట్‌లో మాత్రమే ఆడుతుండటంతో ప్రాక్టీస్ కోసం దేశవాళీ క్రికెట్ తప్పక ఆడాలని బీసీసీఐ ఆదేశించిందని తెలిసింది. భారత జట్టుకు ఆడాలంటే, దేశవాళీ క్రికెట్ ఆడాలని బీసీసీఐతో పాటు టీమ్‌మేనేజ్‌మెంట్ కూడా సూచించిందని ఓ బీసీసీఐ అధికారి మీడియాకు తెలిపారు. అందుబాటులో ఉన్న ఆటగాళ్లు దేశవాళీ క్రికెట్ ఆడాలని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ సూచించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రోహిత్ శర్మ దేశవాళీ క్రికెట్ ఆడుతానని ముంబై జట్టుకు సమాచారమిచ్చాడు. విరాట్ కూడా ఢిల్లీ తరఫున ఆడే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం కోహ్లీ లండన్‌లో ఉంటున్నాడు. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ అనంతరం అతను నేరుగా లండన్ వెళ్లిపోయాడు. మ్యాచ్‌ల కోసం మాత్రమే భారత్‌కు వస్తున్నాడు.



కాంత చాలా అరుదైన సినిమా

ఇలాంటి సినిమాలు జీవితంలో ఒక్కసారే వస్తాయి

దుల్కర్ సల్మాన్, రానా దగ్గుబాటి

దుల్కర్ సల్మాన్ పీరియాడికల్ డ్రామా 'కాంత'. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. రానా, సముద్రఖని కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్. దుల్కర్ సల్మాన్ 'వేఫేర్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్', రానా దగ్గుబాటి 'స్పిరిట్ మీడియా' సంయుక్తంగా నిర్మిస్తున్నారు. టీజర్, ట్రైలర్, పాటలు అద్భుతమైన రెస్పాన్స్ తో మంచి బజ్ క్రియేట్ చేశాయి. నవంబర్ 14న ఈ సినిమా గ్రాండ్ గా విడుదల కానుంది. ఈ సందర్భంగా దుల్కర్ సల్మాన్, రానా విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు.

రానా ఇది బయోపిక్ అని వినిపిస్తుంది.. నిజమేనా?

లేదండి. ఇది కంప్లీట్ గా ఫిక్షనల్ కథ. ఇప్పుడు స్టూడియోలో ఏదైనా జరిగితే ఇమ్మీడియట్ గా అందరికీ తెలిసిపోతుంది. కానీ ఇలాంటి కథలు చాలా జరిగాయి. చాలా తక్కువ మందికి తెలిసేవి. ఆ కాలం నుంచి ఇన్స్పిరేషన్ పొంది రాసిన కథ. ఇది ఒక ఇన్సిడెంట్ అని చెప్పలేం. డార్క్ సైడ్ ఆఫ్ గ్రేట్ పీపుల్ అని చెప్పొచ్చు. ఒక ఇద్దరు గొప్ప వ్యక్తులు వాళ్ళ ఆర్టిస్ట్ బ్రిలియన్స్ కోసం గొడవలు పడిన నేపథ్యం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఇది ఎవరి తాత నాన్నల కథ కాదు(నవ్వుతూ). ఈరోజు మద్రాస్ లో సినిమా చూపించేస్తున్నాం. తర్వాత అన్ని క్లియర్ అయిపోతాయి. 50s బ్యాక్ డ్రాప్ ని ఎంచుకోవడానికి కారణం ఉంది. ఆ కాలంలో లిటరేచర్, మ్యూజిక్ కి చాలా ఎక్కువ ప్రాముఖ్యత ఉండేది. ఈరోజు షార్ట్ కాంటెంట్ లో వున్నాం, ఏ మ్యూజిక్ ఏ సాహిత్యమైన ఓకే అన్ని సర్దుకుపోతున్నాం. కానీ ఆ కాలంలో అలా ఉండేది కాదు. పర్ఫెక్షన్ ఉండేది. ఆ టైంలో జరిగిన కథ అంటే తెలియని రొమాన్స్ వస్తుంది. సినిమా మాత్రమే టైం ని రీ క్రియేట్ చేయగలదు. మేము మద్రాస్ నుంచి ఇక్కడికి వచ్చేటప్పుడు ఇక్కడ ఎలాంటి స్టూడియోస్ లేవు. మద్రాస్ లో ఉండే స్టూడియో కల్చర్ గురించి మాట్లాడుతున్నప్పుడు చాలా ఇంట్రెస్టింగ్ గా అనిపించింది. అలాంటి టైంని రీ క్రియేట్ చేయడం చాలా ఎక్సైటింగ్ థింగ్.

దుల్కర్.. ఈ ట్రైలర్ చూసినప్పుడు ఇది బయోపిక్ అని కొన్ని డౌట్స్ వచ్చాయి..మీకు అలా అనిపించలేదా?

లేదండి. అంతా చాలా క్లియర్ గా ఉంది. ఇది ఒక ఫిక్షనల్ స్టోరీ. నాకు కథ నచ్చింది. నేను ఇంకేది ఆలోచించలేదు. మీరు సినిమా చూసినప్పుడు కూడా దీన్ని ఒక మంచి కథగానే ఫీలవుతారు.

రానా ఈ కథని సురేష్ బాబు గారికి చెప్పారా?

చెప్పారండి. ఆయన చూడడం జరిగింది. చాలా హ్యాపీగా ఉన్నారు. ఆయన ఇన్పుట్స్ చాలా ఉన్నాయి. ఎందుకంటే ఆయన ఆనాటి స్టూడియోస్ లో తిరిగారు. ఆయన ఇన్పుట్స్ మాకు చాలా హెల్ప్ అయ్యాయి.

దుల్కర్.. కాంత సినిమా ఎలా ఉండబోతుంది?

కాంత నా కెరియర్లో చాలా స్పెషల్ ఫిలిం. ఇలాంటి సినిమాలు జీవితంలో ఒకేసారి వస్తాయి. ఇలాంటి ఎక్స్పీరియన్స్ ని మళ్ళీ మళ్ళీ రీ క్రియేట్ చేయలేం. నేను రానా ఈ కథ విన్న వెంటనే కచ్చితంగా సినిమా చేయాలనుకున్నాం.

రానా.. ఈ కథ ఫస్ట్ ఎవరికి చెప్పారు?

డైరెక్టర్ సెల్వ ఈ కథని ఫస్ట్ నాకు చెప్పారు. చెప్పిన వెంటనే ఈ కథకు పర్ఫెక్ట్ దుల్కర్ అనుకున్నాం. తర్వాత ఆయన కలవడం జరిగింది. ఈ సినిమాకి సంబంధించిన ప్రతిదీ చాలా కేర్ఫుల్ గా డిజైన్ చేశాం. హ్యాండ్ పెయింటింగ్స్ వేసే వారిని వెతికిమరీ హ్యాండ్ పెయింటింగ్ పోస్టర్స్ ని డిజైన్ చేశాం.

డైరెక్టర్ సెల్వ గురించి?

డైరెక్టర్ సెల్వ కథని చాలా అద్భుతంగా చెబుతాడు. ఫస్ట్ టైం ఫిలిం మేకర్ ఉండాల్సిన పాషన్ తనలో కనిపించింది. ఆ ప్రపంచంలో జరుగుతున్న ప్రతి విషయం మీద తనకి గ్రిప్ ఉంది. ప్రతిదీ రీసెర్చ్ చేసి పెట్టుకున్నాడు.

భాగ్యశ్రీని హీరోయిన్ గా తీసుకోవాలని ఆలోచన ఎవరిది?

అది డైరెక్టర్ సెల్వ ఛాయిస్. దాదాపు ఆరు నెలలు పాటు వెతికాడు. ఫైనల్ గా భాగ్యశ్రీని అనుకున్నాం. భాగ్యశ్రీని మొదటి చూసినప్పుడు చాలా మోడరన్ గా అనిపించింది. ఈ క్యారెక్టర్ కి ఎలా సూట్ అవుతుందో అనుకున్నాం. కానీ దుల్కర్ భాగ్యశ్రీ సీన్ చేసిన తర్వాత పర్ఫెక్ట్ అనిపించింది. భాగ్యశ్రీ ఈ కథకి యాప్ట్.

రానా.. దుల్కర్ తో కలిసి పర్ఫార్మ్ చేస్తున్నప్పుడు ఎలా అనిపించింది?

ఈ సినిమా మాకు చాలా స్పెషల్. మేము సినిమాని జీవితాంతం ప్రేమించే వాళ్ళం. సినిమానే మాకు అంత ఇచ్చింది. సినిమాకి మేము ఇవ్వాలి తిరిగి ఇవ్వాలి. అలాంటి అవకాశం ఈ సినిమాతో వచ్చింది. సినిమాని సెలబ్రేట్ చేసుకునే లాగా ఉంటుంది ఇది. మేము ఎప్పటినుంచో మంచి ఫ్రెండ్స్. కలిసి సినిమా చేయాలని అనుకున్నాం. అలాంటి మూమెంట్ కాంత సినిమాతో వచ్చింది. ఇందులో నా క్యారెక్టర్ కూడా చాలా క్రేజీగా వచ్చింది. ఆ క్యారెక్టర్ చాలా ఎంటర్టైనింగ్ గా వుంటుంది.

పాతాళభైరవికి ఉపయోగించిన కెమెరాని కనిపిస్తుందని విన్నాం?

అవునండి. ఆ కాలంలో వాడిన చాలా అరుదైన పరికరాలు ఎందులో కనిపిస్తాయి.చాలా గొప్ప గొప్ప సినిమా సెట్స్ లో తిరిగిన వస్తువులు మా సెట్లో ఉన్నాయి .అవి స్క్రీన్ మీద కనిపించినప్పుడు మీరు చాలా ఎంజాయ్ చేస్తారు. పాతాళ భైరవి ఇలాంటి కెమెరాల్లో తీశారా అని సర్ప్రైజ్ అవుతారు.





'సీత ప్రయాణం కృష్ణతో నవంబర్ 14న రిలీజ్

ఖుషి టాకీస్ పై నిర్మించిన సీత ప్రయాణం కృష్ణ తో నవంబర్ 14న గ్రాండ్ గా రిలీజ్ అవబోతుంది. ఈ సినిమా లో రోజా భారతి, దినేష్, సుమంత్, అనుపమ నటించారు. ఈ చిత్రానికి దర్శకుడిగా దేవేందర్. ఈస్ట్ వెస్ట్ ఎంటర్టైన్మెంట్స్ ప్రెజెంటర్ గా డా. రాజీవ్, డా. రోజా భారతి ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. శరవణ వాసుదేవన్ మ్యూజిక్ అందించిన ఈ చిత్రం ప్రెస్ మీట్ గ్రాండ్ గా హైదరాబాద్ లో నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో.. హీరోయిన్ డా.రోజా భారతి మాట్లాడుతూ ...* ముందు గా ఈ సినిమాకి పని చేసిన ప్రతి ఒక్కరికి థాంక్స్ చెప్తున్నా. నన్ను నమ్మి అందరు ఈ సినిమా నాది అని అనుకుని అందరూ పనిచేసారు కాబట్టే ఇవాళ రిలీజ్ వరకు రాగలిగాం. అందరు నవంబర్ 14 న మా సినిమా ని చూసి ఆదరిస్తారని ఆశిస్తున్నాను.అన్నారు. హీరో దినేష్ మాట్లాడుతూ ..నాకు సినిమాలో అవకాశం ఇచ్చిన రోజా గారికి, రాజీవ్ గారికి చాల థాంక్స్. వాళ్లిద్దరూ లేకపోతే ఈరోజు ఈ రోజు మేము ఇక్కడ ఇలా ఉంది మాట్లాడలేము. కచ్చితంగా మా సినిమా అందరిని ఎంటర్టైన్ చేస్తుందని ఆశిస్తున్నాను అన్నారు.



డిఫరెంట్ స్క్రీన్‌ప్లేతో థ్రిల్ చేసే '12A 'రైల్వే కాలనీ'

అల్లరి నరేష్ అప్ కమింగ్ థ్రిల్లర్ '12A రైల్వే కాలనీ'. నూతన దర్శకుడు నాని కాసరగడ్డ దర్శకత్వంలో, శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి నిర్మించారు. పవన్ కుమార్ సమర్పణలో పోలిమేర సిరీస్ తో పాపులరైన డాక్టర్ అనిల్ విశ్వనాథ్ షోరన్నర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ రాశారు. తాజాగా లాంచ్ చేసిన "12A రైల్వే కాలనీ" ట్రైలర్ సినిమా టోన్ , మెయిన్ కాన్ఫ్లిక్ట్ ని అద్భుతంగా ప్రజెంట్ చేసింది. మిస్టరీ మర్డర్స్ సిరీస్ చుట్టూ తిరిగే కథలో ప్రతి పాత్ర అనుమానాస్పదంగా కనిపిస్తుంది. ఈ ట్రైలర్ సస్పెన్స్ ని నెక్స్ట్ లెవల్ కి తీసుకెళ్ళింది. మూఢనమ్మకాలు, హీరోకి ఎదురైన భయానక అనుభవాలతో పాటు వాస్తవం - మానసిక భ్రమలు మరింత థ్రిల్ ని క్రియేట్ చేశాయి. దర్శకుడు నాని కాసరగడ్డ, డా. విశ్వనాథ్ రాసిన థ్రిల్లింగ్ కథను తెరపై సస్పెన్స్‌తో ప్రజెంట్ చేశారు. అల్లరి నరేష్ ఈసారి తన కామెడీ ఇమేజ్ కి భిన్నంగా, ఇంటెన్స్ ఎమోషన్స్ తో అదరగొట్టారు. అతని పాత్రలోని డిఫరెంట్ లేయర్స్ కట్టిపడేశాయి. డా. కమాక్షి భాస్కర్ల తన సహజ నటనతో కథకు ఎమోషన్ యాడ్ చేశారు. సాయి కుమార్ ఇన్వెస్టిగేషన్ యాంగిల్‌కి బలాన్నిచ్చారు. వైవా హర్ష సపోర్టింగ్ రోల్‌లో ఆకట్టుకున్నారు. కుశేందర్ రమేశ్ రెడ్డి సినిమాటోగ్రఫీ, భీమ్స్ సిసిరోలియో బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టెన్షన్‌ను రెట్టింపు చేసింది. ప్రొడక్షన్ వాల్యూస్ టాప్ క్లాస్ లో వున్నాయి. ట్రైలర్‌తో, "12A రైల్వే కాలనీ" పై అంచనాలు పెరిగిపోయాయి. నవంబర్ 21న విడుదల కానున్న ఈ సినిమా ఆడియన్స్ కి థ్రిల్లింగ్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వనుంది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200